# ఇదొక శుభవేళ!

## (వింధియా కథలు)



అనువాదం: ఏండి సుందరేశన్

**IDI OKA SUBHAVELA! (Vindhiya Kathalu)**
(Anthology of Vindhiya's Tamil Short Stories)
తెనుగు అనువాదం© Kurinji Publications, California, USA

సంపుటం - 5

**First Edition, 2020**
© KNS Family/Surviving Members

***Cover Design:***
Front Cover: Amirr Butt

The cover illustration is from the ***Kalaimagal*** issue dated April, 1955. Used with permission.

The translator acknowledges with thanks the permission to use the illustrations from the various magazines that originally published these short stories.

***Photo Credits:***

Back Cover:
Thota Photo Studio, Berhampur, (Odisha)

**Printed at:**

The Copy World
1375 University Avenue.
Berkeley, CA 94702
1-800-930-2679

# ఇదొక శుభవేళ!

## (వింధియా కథలు)

### మూలం: తమిళం

### అనువాదం:

### ఏండి సుందరేశన్

## Published By

**Kurinji Publications**
**El Cerrito, CA 94530, USA**
**10944 San Pablo Avenue # 610**
**Email: rangan.sundaresan@gmail.com**

# ఇందులో


మా అన్నగారు డా. నారణన్


**ముందు మాట**

1. ఇదొక శుభవేళ!
2. ఈ టపాసు వద్దు!
3. ఆదివారం
4. సురభి విన్న సందేశం
5. అణిగిన అగ్ని
6. మరో ప్రపంచం
7. భలే, మంచి ప్రశ్న!
8. పేరు తారుమారు
9. పాపం, మణి!
10. ఆదర్శ ఇల్లాలు

# ఆదర్శ జీవి అన్నయ్య

# ‘నన్ను’

# డాక్టర్ ఎస్.  నారణస్



**(1930-2019)**

నేను ***తీయని చుట్టరికం (వింధియా కధలు - సంపుటం IV)*** పూర్తి చేసి కొత్త సంపుటంకి కధలు ఎంచుకున్న సమయంలో శోచనీయమైన వార్త నా చెవులకి అందింది: 'మా అన్నయ్య 'నన్ను'[1] నవంబరు 28 చెన్నైలో కన్నుమూసారు,' అని.

ఇటీవల అతని అస్వస్థతగురించి మేం విన్నాం. హాస్పిటల్లోనుంచి వచ్చినతరువాత అతను కోలుకుంటున్నారని మా భావన, మా ఆశ; అందువలన ఈ దుర్ఘటన విని మేం అదిరిపడ్డాం.

పెద్దక్కయ్య ఇందియాదేవి, 'నన్ను', తోబుట్టువుల ఉన్నత విలువలకి ఓజబంతిగా మెలిగారు. అన్నయ్య ఏది చేసినా - చిన్నదైనా, పెద్దదైనా సరే - అందులో నైపుణ్యం, సమర్థత కనిపిస్తాయి. మానసిక ఆరోగ్యంని పుష్కలంగా పెంచుకొని జీవితాన్ని కళగా జీవించిన వ్యక్తి అతను. అదే తన కుటుంబ సభ్యులకి, ఇతరులకి అతను వల్లించిన పాఠం. తనకని జీవితంలో కొన్నిషరతులున్నాయి, ఆ షరతులమీదే అతను స్థిరంగా, హాయిగా జీవించారు.

ఉద్యోగరీతిగా అతను భౌతికశాస్త్రవేత్తగా (Physicist) Tata Institute of Fundamental Research, బంబాయిలో 42 సంవత్సరాలు పని చేసారు. కాని అతని అభిరుచి బహుముఖాల్లో వ్యాపించింది. విజ్ఞాన శాస్త్రంలో చాలా విభజనలున్నాయనే కారణంవలన అతను ఇతర రంగాల్లో కృషి చెయ్యడం జరిగింది. గణితం, సాంఖ్యక శాస్త్రం (Statistics), గణక యంత్ర శాస్త్రం (Computer Science), భాషా శాస్త్రం (Linguistics), జన్యు శాస్త్రం (Genetics) - వీటిలో అతను వైజ్ఞానిక విమర్శనలు రాసారు. కడపాటిగా అతని విమర్శన కిందటి సంవత్సరం Dutch Mathematical Journal లో ప్రచురితమైంది.

మా అమ్మ నాకు ఒకసారి చెప్పినది ఇప్పుడు గుర్తుకి వస్తోంది: "మీ నాన్నగారూ, 'నన్నూ' అదృష్టవంతులు. కారణం, జీవితమంతా వాళ్ళకి తృప్తినిచ్చే పని వాళ్ళ వృత్తి

[1] అన్నయ్య చనువుపేరు

కావడం!’ అని. ‘ఇటువంటి భాగ్యం ఎంతమంది నిజంగా అనుభవిస్తారు? అని నేను చాలాసార్లు ఆలోచించేవాడిని.

మా అక్కయ్య వింధియా సాహిత్య ఉద్యమంకి (1947-60), అన్నయ్యకీ మంచి సంబంధం ఉంది. వింధియా కథలు ప్రచురితమైన రోజుల్లో - అంటే డెబ్భై సంవత్సరాలముందన్నమాట! - మా నాన్నగారు ఆ ఆ సంచికలనుంచి వింధియా కదలు విడదీసి, వర్ణించి, ఒక్కొక్క కథకీ - అది ఏ పత్రికలో, ఏ తేదీలో వెలుబడింది, బహుమానం ఏదైనా అందుకుందా? అనే వివరాలు పోగుచేసేవారు. మొత్తంగా ప్రచురితమైన వింధియా తమిళ రచనలు: 80 కథలు, మూడు వ్యాసాలు, ఒక నాటకం.[2] ఆ తరువాత మా అన్నయ్య వాటిని రెండు గ్రంధాలుగా సమకూర్చి అక్కయ్యకి బహుమానంగా ఇచ్చారు. ఆ రెండు గ్రంధాల ఆధారంతోనే నేను 2007 లో వింధియా కథలు ఆంగ్లంలో అనువదించాను. ఆ తరువాత విందియా తమిళ రచనలన్నీ సరిదిద్ది, internet లో పోస్టు చెయ్యడమైంది.

వింధియా కథలన్నీ తెలుగులోకి అనువదించి e-books గా ప్రచురించాలని మేం - KNS కుటుంబ సభ్యులం - నిశ్చయించాం; ఇంతవరకూ నాలుగు సంపుటాలు వచ్చాయి.

నేను తెలుగులో అనువదించిన వింధియా కథలన్నీ అన్నయ్య ‘నన్ను’ చదివారని నాకు తృప్తి. మా తోబుట్టువులలో అతనే వింధియా కథలన్నీ అధికంగా చదివివుంటారని నాకు నమ్మకం. అతన్ని తప్పిస్తే మిగిలిన అక్కతమ్ముళ్ళం ఇప్పుడిప్పుడే  మొదటిసారిగా - ఇన్ని సంవత్సరాల తరువాత -వాటిని చదవడం జరుగుతోంది!

వయస్సులో ‘నన్ను’కి ఇందియాదేవికి మూడేళ్ళ తేడా ఉంది. అతనికి అక్కయ్య జీవితంలోని ప్రధాన ఘట్టాలు, ముఖ్యమైన సంఘటనలు, సమకాలీన సమాజంపై ఆవిడకున్న ఉన్న దృక్పథం - వీటిపై మంచి ఆవగాహన ఉంది. అందువలనే మేమీ కథలు చదివి పాల్గొనే కుటుంబ సభ్యుల చర్చలలో ‘నన్ను’ ఈ కథల వెనుక ఉన్న

---

[2] విందియా తెలుగులో రాసిన ఒకే ఒక కథ ‘కాలక్షేపం’ 2017 లో నాకు అకస్మాత్తుగా దొరికింది.

ఇతివృత్తం, ప్రమేయం, నేపథ్యం గురించి తలపోస్తూండేవారు. అంతేకాదు, అతననేవారు: “నేను నా వ్యక్తిగత జీవితంలోని ప్రస్తావనలు, అవాంతర విషయాలు పంచుకున్న తరువాత వింధియా తన కల్పనాశక్తితో వాటిని  కధలుగా అల్లడం జరిగింది”,  అని. ఆ కధల్లోని పాత్రీకరణ, సాహిత్యయుక్తి గురించి అతను తరచుగా పొగడేవారు. అతని ప్రేరణతో, 2006లో బొంబాయిలోని Sounds & Picture Archives for Research on Women (SPARROW)  సంస్థలో వింధియా రచనలు అంకాత్మక పద్ధతి (Digital Mode) లో భద్రపరచివున్నాయి.

అన్నయ్య దీవెనతో మిగిలిన వింధియా కధలు తెలుగులో అనువదించడం సాగుతుంది.

జనవరి, 2020

ఏండీ సుందరేశన్

సెల్వి విశ్వనాధన్

సీను శ్రీనివాశన్

# ముందు మాట

"Past doesn't haunt us; we haunt the past."

- Anonymous

"గతకాలం మనల్ని తరుముకొని రాదు. మనమే దాన్ని వెంటాడుతాం!" అని ఒక లోకోక్తి నా జ్ఞాపకంకి వస్తోంది.

సుమారు డెబ్బై సంవత్సరాలముందు మా అక్కయ్య వింధియా రాసిన తమిళ కథలు చదివి వాటిని తెనుగులో అనువదించే ఈ ఉద్యమంలో మేం - KNS కుటుంబ సభ్యులం - శేష జీవులం - సాధ్యమైనంతవరకూ, ఈ కథల్లోని ఇతివృత్తాలు అర్థం చేసుకొని, వాటికి నేపధ్యం, మూల ఘటనలు, తెలుసుకోవాలని పూనుకున్నాం. ఇదొక సరసమైన ప్రక్రియ, చిక్కు (puzzle) గా సాగుతూనేవుంటుంది అని మా ఊహ.

ఈ సంపుటంలో రచయత్రి వింధియా **కలైమగళ్** పత్రిక కధానిక పోటీలలో బహుమతి అందుకున్న రెండు కథలున్నాయి.

**ఇదొక శుభవేళ!** 'రంగుల కథలు' అనే శీర్షికలోనూ, **ఆదివారం** 'వారం కథలు' అనే శీర్షికలోనూ వెలుబడ్డాయి.

మన హైందవ సంప్రదాయంలో రంగులకీ, వారాలకి ప్రత్యేక విశిష్టత, గౌరవం ఉన్నాయి. ఆ లోక మర్యాదని అనుసరించిన కథలని **కలైమగళ్** సంపాదకులు కథానిక పోటీకి ఆహ్వానించారు.

కవులు, రచయతలు మానసికావస్థని రంగులలో వర్ణించడం గమనార్హం. **ఇదొక శుభవేళ!** కథలోని ఘటనల నేపద్యంలో ముగ్గులు, పెళ్ళిగురించి చర్చలు, విమర్శలు, జరుగుతున్నాయి. చాలామట్టుకు మనం చూసేది వాగుడు, స్త్రీల వాచాలత్వం, అనే ఉపేక్ష కలగడం సహజం. కాని ఈ పరస్పర కథోపకథనంలో

రచయిత్రి మనకి ఈ ముగ్గురు స్త్రీల మనోభావాలు ఎంత విపులంగా తెలియజేస్తున్నారు!

అలాగే వారాలు కూడా. ఇక్కడ పిల్లవాడు కణ్ణన్ అవగాహనలో ఆదివారం ఎలాగ క్రమంగా రూపొందిందని మనకి చెప్తున్నారు.

**అణగిన అగ్ని** అక్టోబర్ 55 లో వింధియా రాసిన కథ. అందులో భవిష్యత్తులో ఆవిడ జీవితంలో రాబోయే కొన్ని సూచనలు మనం చూస్తాం. 1960 దశాబ్దం చివరిలో మా అక్కయ్య జీవితంలో ఒక పెద్ద మలుపు. గభీమని తన సాహిత్య అభిరుచిని నిరాకరించి పూజలు, ఆరాధనల్లో లీనమైపోయారు. **అణగిన అగ్ని** కథలో వచ్చే తల్లీ, కూతురూ, శింగేరికి వెళ్ళే మార్గంలో కలుసుకునే స్త్రీ పేరు మనకి తెలియదు: అది ఉద్దేశపూర్వకంగా చేసారని నా వాదం. సంబరాల్లో, యాగాల్లో సేవచేసే volunteers ఎంతమంది ఉన్నారు, వాళ్ళ పేర్లు మనకి తెలుసునా?

ఇక తక్కిన కథల గురించి చెప్పాలంటే అవన్నీ రచయిత్రి ఊహాకల్పనలో - సంప్రదాయేతర రీతిలో - రూపొందాయి.

- దీపావళి పండుగకి అల్లుళ్లు రావడం గురించి తమిళ పత్రికలలో తరచుగా కథలు వస్తుంటాయి; ఇక్కడ మనం చదివే కథలో ముఖ్యమైన పాత్ర అల్లుడు కాదు!
- **సురభి విన్న సందేశం** కథకి మూలం అక్కయ్యకి పరిచయమైన ఒక ఉన్నత గంవర్ణమెంటు కుటుంబం. వాళ్ళు తరచుగా బదిలీ అవుతుంటారు; ఊరులు మారుతుంటారు; వాళ్ల ఇంట్లో ఒక ఆవు, ఒక కుక్క ఉన్నాయి. అవే ఈ కథకి సారం పోసాయని నా ఉద్దేశం.
- వింధియా స్నేహితులు కొందరు హైస్కూలు చదువు ముగించిన తరువాత పెళ్ళికి రాజీ పడక, టీచర్లుగా పనిచేసి, ఆలస్యంగా పెళ్ళి చేసుకోవడం జరిగింది. **మరో ప్రపంచం** లో వచ్చే యువతి ఆ కోవకి చెందిన అమ్మాయి కాబోలు!

- **పేరులో తారుమారు** సంఘటనలు, పాత్రలు 100% నిజం; ఒకప్పుడు మా ఇంట్లో 'సీను' అనే పేరులో ఇద్దరు ఉన్నది నిజం. తక్కినవన్నీ కల్పితం!
- 'అత్తలేని కోడలు ఉత్తమురాలు, కోడలు లేని అత్త గుణవంతురాలు' అనే సామెత ఉంది. ఐతే **భలే, మంచి ప్రశ్న!** కధలో మనం చూసే అత్తాకోడళ్ళు సర్దుకుపోతూ సంతోషంగా గడిపేస్తున్నారు! "ఇదొక మంచి శకునం!" అని మనం చప్పట్లు కొట్టవలసిందే!
- యౌవన దశలో అడుగుపెడుతున్న మణికి చికాకు, కలవరంతోబాటు దొరతనమూ వచ్చేసింది! పాపం, వాడేం చేస్తాడు? పిచ్చి ఆవేశంలో ఏమో ఆలోచనలు, చేష్టలు అనివార్యంగా వాడిని ఆకట్టుకున్నాయి. ఎది చేసినా తొందరే! సుపరిచిత పరిసరాలనుంచి 'పారిపోవాలని' వైరాగ్యం, వాంఛ. కాని జాలి, అనుకంప వాడిని ఇంటికి తిరిగిరావడానికి ప్రేరేపించాయి.
- కొత్తకాపురంలో దంపతుల ప్రశ్నలు విందియా **రాజేశ్వరి** నవలలో విపులంగా, అక్కరగా పరిశీలించారు. ఆదర్శ **ఇల్లాలు** కధలో మనకి కనిపించేది ఒక దృష్టాంతం.

నాకు ఈ ఆఖరి రెండూ తేలికగా, ఉల్లాసంగా చదవవలసిన కధల్లా అనిపించాయి. కాని అన్ని కధల్లోనూ రచయత్రి గుఋతు కానవస్తుంది.

ఎప్పటిలాగే ఈ సంపుటంకి సలహాలతో, సూచనలతో తోడ్పడిన అక్కయ్య సెల్వి విశ్వనాధన్కి నా కృతజ్ఞతలు.

ఫిబ్రవరి, 2020 ఏండీ సుందరేశన్



# ఇదొక శుభవేళ![1]

గణేశన్ ఆఫీసుకి వెళ్ళడానికి సిద్ధమవుతున్నాడు. చల్లటి నీళ్ళని మొహంమీద చల్లుకుంటూ శారద ఇవతలకి వచ్చింది. ఇటీవల ఎఱ్ఱపాటుగా మారిన ఆమె మొహం కొంచెం మెత్తబడినట్టు కనిపించింది. తొందర తొందరగా నెత్తిలో ఒక కుంకుమ బొట్టు పెట్టుకుంది; ఉగ్రత ఆవరించుకున్న ధోరణిలో వచ్చి అక్కడ నిలబడింది.

"డబ్బు తీసుకొని వెళ్తున్నారా లేదా?"

"అలా చేస్తే బాగుంటుందా? కొంచెం ఆలోచించు; వాళ్ళు ఎంత బాధ పడతారో?"

"మరి నేను పడుతున్న బాధగురించి ఆలోచించేరా? వాళ్ళూ బాధ పడనీ; ఆ డబ్బు మీరు తిరిగి పంపించేయాలి, మరేం ఆలోచన వద్దు!"

"సరే, నీ ఇష్టం."

గణేశన్ బీరువా తెరిచి పది రూపాయలు తీసుకొనివెళ్ళాడు.

రాలిన ఒక కన్నీటిచుక్కని శారద తుడుచుకుంది. ఇప్పుడు దాన్ని ఒక బొట్టు రక్తం అని అనవచ్చు. కాని ఇంతకు ముందో? గణేశన్ నివ్వెఱపడిపోయాడు. మరెవరైనా చూసివుంటే ఏదో ఘోరం, దుర్గతి జరిగిందని ఉలికిపడివుంటారు. అంత ఉగ్రంగా శారద ఏడ్చిందన్నమాట! తన ఎఱ్ఱబారిన మొహమూ, పొదిగిన కళ్ళూ ఎవరూ చూడకూడదని తలుపుని మూసుకొని వంటగదిలో అన్నిపనులూ చేసుకుంది. కొంచెసేపు నిద్రపోతే భారం తగ్గుతుందని తలగడని తీసి మంచంలో వాలింది, కాని నిద్ర అంత సులభంగా రాలేదు; తడిసిన ఇటుకలాగ మనసు ఆయాసపడింది.

'వాళ్ళు బాధపడతారు' అని భర్త అన్న మాటలు జ్ఞాపకం వచ్చాయి; అతనికున్న దాక్షిణ్యం తనకి లేదని గ్రహించగానే ఆమె దుఃఖం ఇంకా పెరిగింది.

[1] కలైమగళ్ పత్రిక 'రంగుల కథలు' శీర్షికలో ప్రచురితమైన కథ

వాళ్ళు ఎవరు? ఆమె తల్లిదండ్రులు. అలవాటుగా ఆమెకి పుట్టినరోజు బహుమతి పంపించారు. 'నీకు కావలసినదేదో కొనుక్కో!' అని పదిరోజులముందే వచ్చిన దాన్ని శారద సంతోషంతో పుచ్చుకుంది. కాని ఐదురోజుల తరువాత "నాకీ బహుమతి వద్దు, తిరిగి పంపించేయండి!" అని మొండిగా భర్తతో వాదించి, గెలిచింది.

ఏం, ఎందుకు?

ఆ ఉదయం వచ్చిన ఉత్తరమే కారణం; అది ఆమె నాన్నగారు రాసారు.

"మంజు పెళ్ళిగురించి నువ్వెందుకు ఆయాసపడుతున్నావ్? దాని చదువు ఇప్పుడే పూర్తి అయింది. స్థానిక స్కూల్లోనే దానికి ఉద్యోగం దొరికే సూచనలు కనిపిస్తున్నాయి. ఒక ఆరు నెలలు పనిచేస్తే మంచిదేకదా? చదువుకి తగిన ఆత్మవిశ్వాసం దానికి ఉందా అని తెలుసుకుందాం! మంజూ సరేనంటుంది, నీ ఉద్దేశం ఏమిటి? వేళ అని వస్తే పెళ్ళి జరగవలసిందే! అనావశ్యకంగా నువ్వేం బాధపడవద్దు!"

ఇదే అతని ఉత్తరం, అతని సారాంసం. 'ఇవి నాన్నగారి మాటలా?' అనే ఆలోచనతో శారద ఉలికిపడింది. భరించలేని దుఃఖం కొట్టుకొని వచ్చింది. ఉత్తరం చదువుతూనే ధారధారగా కన్నీరు కార్చింది. వెక్కి వెక్కి పది నిమిషాలు ఏడ్చింది. మొహం బాగా ఎఱ్ఱబారింది.

"నీకెందుకీ కలత? నీపై భారం మొయ్యాలా ఏమిటి? వాళ్ళకి మంజు గురించి బాధ్యత తెలియదా ఏమిటి? ఇంతకీ వాళ్ళేమంటున్నారు? 'అమ్మాయి ఉత్తికే ఇంట్లో కూర్చోకుండా ఉద్యోగం దొరికితే చెయ్యనీ!' అని మీ నాన్నగారు అంటున్నారు, అంతేకదా?" అని గణేశన్ భార్యని సముదాయించాడు.

విసుగ్గుంటూ శారద జవాబు చెప్పింది: "నేను రాసిన అన్ని ఉత్తరాలకి ఇదే ఫలం అంటే నేను భరించలేను!" వెక్కిళ్ళతో ఆమె ఇంకా బలంగా ఏడవసాగింది. తన అభిలాష, సలహా, సాయం నాన్నగారు లెక్క చెయ్యకుండా తోసిపారేసారనే ఊహ శారద మనసులో నాటుకుపోయింది.

ఆమె ఆశించినదేమిటి? జరుగుతున్నదేమిటి?

మంజు ఆమె చెల్లెలు. చెల్లెలికి మంచి భర్త లభించాలని మూడు సంవత్సరాలుగా శారద తాపత్రపడుతోంది. చురుకైన యువకులని చూస్తే వాళ్ళ కులగోత్రాలు తెలుసుకోవాలనే ఆతురత; మంచిదొక వస్తువు కనబడితే 'మంజుకి ఇది కొంటే బాగుంటుంది!' అనే ఆలోచన. రెండు సంవత్సరాలముందు ఆమె తల్లిదండ్రులుకూడా అటువంటి శ్రద్ధతోనే కనిపించారు. కాని మంజు మొండిగా "ముందు నా రెండు సంవత్సరాల చదువు పూర్తి అవనీ," అని పట్టుబట్టింది, గెలిచింది.

ఈ రెండు సంవత్సరాలు పూర్తి అవడానికి ముందే మంజు పెళ్ళిగురించి శారద తన తల్లిదండ్రులని ప్రోత్సాహించడం ఆరంభించింది; తనూ ఉత్సాహంతో ఆ అన్వేషణలో దిగింది. ఒక జాతకం అందిన తరువాత దాన్ని మంజు జాతకంతో సరిచూడమని ఏర్పాటు చేసింది. 'అంతా ఆ భగవంతుని కటాక్షం!' అని ఆమె ఆశ్చర్యపడుతున్నట్టు జోస్యుడు "ఇద్దరికీ అమోఘమైన పొత్తు ఉంది. అసలు మీ చేతికి ఈ అబ్బాయి జాతకం ఎలా వచ్చింది?" అని అడిగాడు. శారద వెంటనే సంతోషంతో తన తల్లిదండ్రులకి వివరాలన్నీ తెలియజేసి "మీరు ఈ వరుడు గురించి చురుకుగా సమాలోచనలు జరపాలి!" అని వేడుకుంది; ఆతురతతో జవాబు ఎదురుచూసింది. కాని ఆఖరికి నిరాశే మిగిలింది.

"ఇదొక ఐశ్వర్యవంతుల కుటుంబం. మనకి వాళ్ళతో పెళ్ళి సంబంధం సాధ్యమా? అసలు వాళ్ళతో ముందు ఎలాగ సంప్రదించడం అని ఆలోచిస్తే అదే ఒక పెద్ద సమస్యగా ఉంది! వాళ్ళ సంపద, హోదాకి తగినట్టుగా మనం అన్నీ చెయ్యాలి, అందుకు మనకి శక్తి లేదు. అవునా?" అని అమ్మ రాసింది. "అమ్మే వెనకాడుతోంది!" అని నాన్నగారు అదే పాట తన ఉత్తరంలో పాడారు.

"'మన అమ్మాయికి మంచి వరుడు దొరకాలి!' అని మనం ఆశించడం తప్పా? స్నేహితులద్వారా మనకీ జాతకం దొరికింది. మంచి పొందిక ఉందని జోస్యుడు అంటున్నారు. ఇక మనం ఏం చెయ్యాలి? అమ్మాయిని చూడడానికి వెంటనే రమ్మని పిలవండి, లేకపోతే ముందు మంజు ఫోటో పంపించాలంటే, అదీ మంచిదే! మనింటి అమ్మాయి పెళ్ళికి మనమే చురుకుగా, తప్పకుండా అన్నివిధాలా కృషి చెయ్యాలి! ఆలస్యం వద్దు! 'ఈ వరుడే మన మంజుకి!' అని నా నమ్మకం!" అని శారద రాసింది.

"ఆర్థిక విషయాల్లో - కట్నం, కానుకలు అన్నప్పుడు - ఈ వరుడి తల్లిదండ్రులు చాలా ఉదార గుణంతో మెలుగుతారనే సూచనలు వరుడి జాతకంలో కనిపిస్తున్నాయని అంటున్నారు. ఇక ఆలస్యం చెయ్యకండి! వరుడునికూడా అందరూ పొగడ్తున్నారు. నిజంగా మంజు అదృష్టవంతురాలు." అని శారద ఆ రోజే ఇంకొక కార్డు రాసి తల్లిదండ్రులని తొందరపెట్టింది.

కాని ఆమె తల్లిదండ్రులు తొందరపడలేదు. "అసలు మనకి ఇటువంటి ఘనమైన కుటుంబాలతో పరిచయం లేదే? వీళ్ళతో మనకి పెళ్ళి సంబంధం వీలవుతుందా? మనకింత పేరాశ ఎలా వచ్చింది అని వాళ్ళు ఎగతాళి చేస్తారేమో?" ఇలాంటి సందేహాలే మళ్ళీ మళ్ళీ వాళ్ళని చుట్టుముట్టాయి.

"వీళ్ళెందుకిలా భయపడుతున్నారు? ప్రయత్నం చెయ్యవచ్చుకదా? పెళ్ళి జరగలేదంటే సరే, మనకి ప్రాప్తం లేదని ఊరుకుంటాం. కట్నంపై ఆశలేని మగపెళ్ళివారు ఈ ప్రపంచంలో లేరా? ఎందుకిలా నీ తల్లిదండ్రులు భయపడుతున్నారు?" అని గణేశన్ కూడా భార్యని అడిగాడు.

"మంచి సంబంధం అంటే 'కొంచెం కష్టమైనా సరే, అది తప్పకుండా జరగాలి' అని మనం ఆశించాలి. అవునా?"

"అవును. మంచి సంబంధం వస్తే దాన్ని పొరబాటున విడిచిపెట్టకూడదు. కావాలంటే ఒక వేయి, రెండు వేలు అప్పు చేసినా సరే . . . " అన్నాడు గణేశన్.

"ఆదీ చాలదు, ఇంకా ఎక్కువగానే అప్పుచెయ్యాలి. కాని మన అమ్మాయికి పెళ్ళైందని తృప్తి, మన బాధ్యత నెరవేరిందనే సంతోషం కలుగుతుంది! ఇక ఉండేది అబ్బాయిలేకదా?"

శారద తన తల్లిదండ్రులకి ఆదే రాసింది. ఈ ఉత్తరాల పరివర్తన జరుగుతున్న సమయంలో మంజుకి పరీక్షలు దగ్గరకి వచ్చాయి. "అమ్మాయి శ్రద్ధతో చదవనీ! నువ్వు చెప్పిన వరుడిని నేను మరిచిపోలేదు!" అని తండ్రి శారదకి రాసారు; పరీక్షలైనతరువాత గణేశన్ ఇచ్చిన చిరునామాకి అతను ఉత్తరం రాసారుకూడా. కాని ప్రత్యుత్తరం రాకపోవడంతో మరేం చెయ్యక ఊరుకున్నారు.

** ** **

అక్కడ మంజు చురుగుగా ఒక బ్రహ్మాండమైన ముగ్గు వేయాలనే పథకం ఆరంభించింది. ఇంచుమించు ఒక పెద్ద ముగ్గు వెయ్యాలనే ఉద్దేశం, కాని అది పూర్తి అవగానే ఉత్సాహం పెరిగింది; చుక్కలని కలుపుతూ, ముగ్గుని క్రమంగా విస్తరించుకుంటూ వెళ్ళింది.

"ఏమిటే, ఇక్కడేం పెళ్ళి జరుగుతోందా?. . . అవును, త్వరలో పెళ్ళి జరగవలసిందే!" అని అంటూ పట్టమ్మాళ్ అక్కడకి వచ్చారు. "రండి!" అని నవ్వుతూ మంజు ఆవిడకి స్వాగతం చెప్పి, తల్లిని పిలిచింది. కమలం వచ్చింది. "చూసారా, గంటకిపైగా మంజు ఈ ముగ్గు వేస్తోంది!" అని అభిమానంతో వివరించింది.

"ఓ, అలాగా? మంచిదే! ఇవన్నీ పడుచులకి నచ్చే ముచ్చటలుకదా? నేనూ ఒకప్పుడు రకరకాల చుక్కలముగ్గులు వేసేదాన్ని, కాని ఇప్పుడేమో ముగ్గుల గొట్టాలే వాడుతున్నాను. ఎలాగైనా ముగ్గు అన్నప్పుడు - చిన్నదైనా, పెద్దదైనా - అది శోభించాలంటే మనం తప్పకుండా ఎర్రమన్ను వాడాలి! మేం ఏ ఊరుకి బదిలీయై వెళ్ళినా ఒక డబ్బా ఎర్రమన్ను నాతో ప్రయాణం చేస్తుంది . . . అసలు ఈ ఊరులో ఎర్రమన్ను ఎలా ఉందో చూసారా? కాషాయవర్ణంలో ఉంది, రవంతైనా కాంతి లేదు!"

మంజు దేహాన్ని మెలిదిప్పుకొని నిలబడి ముత్తైదువని చూసింది. "ఇప్పుడే నాకు జ్ఞాపకం వచ్చింది. క్రిందటి మంగళవారం మనం సినిమాకి వెళ్ళాం. ఆరోజు మీ ఇంటి పూజామందిరంలో మీరు వేసిన ముగ్గు - ఎర్ర మన్నుతో - ఎంత రమ్యంగా కనిపించింది!" అని పొగడింది.

"కావాలంటే నేను నీకూ ఎర్రమన్ను ఇస్తానులే. ఒక చిన్న ముక్క, అంతే! మరేం నా దగ్గర లేదు! ఏమంటావ్?"

"ఓ, అది చాలండీ! ముగ్గు చూడడానికి ముద్దుగా ఉంటుంది!"

పట్టమ్మాళ్ ఉప్పుమా చెయ్యడానికి బియ్యం నూరడానికి వచ్చారు. తిరిగి వెళ్తున్నప్పుడు ఆవిడ మంజు వేసిన ముగ్గుని చూసారు, మెచ్చుకున్నారు. "నేనిచ్చిన ఎర్రమన్ను వాడావంటే, అది ఈ ముగ్గుకే సగం సరైపోతుంది!" అని నవ్వారు.

"లేదు, లేదు, దీనికి వాడను!" అని మంజు చెప్పింది; ఆ రోజే ఆవిడతో వెళ్ళి ఎర్రమన్ను తీసుకొని వచ్చింది.

"రేపు శుక్రవారం. ముగ్గు వేసి ఎర్రమన్ను పూయి!" అని కమలం చెప్పింది.

"రేపు అక్కయ్య పుట్టినరోజు," అని అంది మంజు.

"మంచిది. హూం, అదేం కొనుక్కుందో? ఒక మంచి ఎవర్ సిల్వర్ గిన్నె కావాలని చెప్తూండేది. అది దొరికితే కొంటుందేమో?"

"అమ్మా, మంచి గిన్నెలు ఆ ఊరులో దొరకవు. పూజకని అక్కయ్య ఒక గంట కొనవచ్చు. దానికి వెల పదిరూపాయలని చెప్పింది; మన బహుమతికి తగిన వస్తువు."

"సరేలే, దాని ఇష్టం. దాని పెళ్ళికి మరేం గొప్పగా కొనలేదు. తనకెదికావాలో దానికి తెలుసు. అబ్బబ్బా, ఈ రోజుల్లా ధరలు ఎలా పెరిగిపోయాయి! ఇంకొక పెళ్ళి చెయ్యాలి, ఎలాగ సాధ్యమవుతుందో? పాపం, దానిగురించే దాని బాధ అంతా! ఈ పెళ్ళి తన బాధ్యత అని శారద ఆరాటపడుతోంది!"

కమలం తానే మాటాడుకుంటూ వెళ్ళింది. మంజుకి తల్లి మనసు బోధపడింది; నవ్వలేక ఆలోచనలో పడింది.

ఆ మరువాడు పొద్దున్నే మంజు వీధిలో ఇంటిముందు ఒక అందమైన ముగ్గువేసి దాన్ని ఎర్రమన్నుతో అలంకరించింది; రెప్పవాల్చకుండా దాన్ని చూస్తూ ఉత్సాహంతో, ఇంట్లోకి తిరిగివెళ్ళడానికి సిద్ధమైంది.

ఇంతలో ఒక గుర్రంబండి వచ్చి వాళ్ళ ఇంటిముందు ఆగింది. ఒక సుమంగళి స్త్రీ బండినుంది దిగారు. అది ఎవరు? మంజుకు తెలియదు. కాని తను తప్పకుండా ఆవిడకి స్వాగతం చెప్పాలికదా? మంజు తిరిగి చూసినప్పుడు ఆవిడ పక్కనే ఒక యువకుడుకూడా కనిపించాడు. మంజు జంకింది; అలాగే నిలబడిపోయింది. యువకుని దృష్టి మంజుమీద లేదు. "అదో, అక్కడ పట్టు మామి కనిపిస్తున్నారు! ఈ ఇల్లు కాదు! రా, వెళ్ళాం!" అని అతను ఆ ముత్తైదువకి చెప్తున్నాడు.

"అవును, అది పట్టమ్మాళే!" అని అంటూ ఆ సుమంగళి త్వరగా ముందుకు నడిచారు. అసలు ఏం జరిగిందని మంజుకి బోధపడింది. ఇంతలో యువకుడుకూడా దానిగురించే ఆలోచించి, నవ్వుకుంటూ తన చూపు వాళ్ల ఇంటిమీద మళ్ళించాడు.

మంజు అక్కడ నిలబడివుంది; వెంటనే గభీమని యువకుడు జారుకున్నాడు; బండివాడికి కూలి ఇవ్వడానికి తొందరపడుతున్నట్టు కనిపించాడు.

అతన్ని చూస్తూనే నిలబడిన మంజు ఒక కాలుని ఇంట్లోకి అడుగుపెట్టగానే ఆమెకు నిలకడ తప్పింది; చెయిలోని గిన్నె కదలడంతో అందులోవున్న ఎర్రమన్ను ద్రవంలో ఒక వంతు చీరమీద పడింది. దాన్ని లెక్కచెయ్యక మంజు ఒక చిరునవ్వు నవ్వింది.

** ** **

ఆరోజు మధ్యాహ్నం పట్టమ్మాళ్ తనింటికి అతిథిగా వచ్చిన ముత్తైదువతో వచ్చారు. అది కమలం మైసూర్ పాక్ పచనం చేసే సమయం. “రండి, రండి, ఈ మైసూర్ పాకు రుచి చూడండి! ‘వేడి ఒక రుచి, ఎరుపు ఒక అందం!’ అనే వచనం మీరు విని వుంటారు,” అని అంటూ ఒక పళ్ళెంలో భక్షణం ఆవిడకి అందించింది.

“అవును, మీరన్నది నిజం. నాకు మైసూర్ పాకు వేడిగానే తినాలి,” అని అంటూ ఆ ముత్తైదువ నవ్వారు.

“ఎరుపు ఒక అందం అని కమలం అన్నారుగా, అదీ నిజమే! ఎరుపు చర్మం అంటే మరేం లోపాలు కనిపించవు! అవునా, సౌర్ణం, ఏమంటారు? మీకెటువంటి కోడలు కావాలి? అందగత్తె కాకపోయినా చర్మం ఎరుపుగా ఉంటే చాలా, లేకపోతే నల్లగా ఒక రూపవతి కావాలంటున్నారా?” అని పట్టమ్మాళ్ ఆవిడని పొడిచింది.

సౌర్ణం మరేం అనక ఉత్తికే నవ్వారు.

“నోరు తెరిచి మాటాడరేం?”

“చెప్పడానికి ఏముంది? నాకు ముగ్గురు అబ్బాయిలున్నారు; మూడు రకాల కోడళ్ళు వస్తారని నా నమ్మకం. కాని మన చేతిలో ఏముంది? ప్రాప్తం ఎలావుందో ఎవరికెరుక?”

“మామీ, మీరు మైసూరా పాకు తినండి. నేను మంజుకి ఇచ్చి వస్తాను!” అని కమలం ఒక బిళ్ళను తీసుకొని లేచింది.

“మీరెందుకు లేచివెళ్ళాలి? మంజు ఇక్కడికి రానీ! దాని పరీక్షలప్పుడు మీరు చేసిన సేవ మీకు బాగా అలవాటైపోయిందన్నమాట!” అని పట్టమ్మాళ్ నవ్వారు.

“అవును, మీరన్నది నిజం!” అని చెప్పి కమలం మంజుని పిలిచింది.

మంజు వస్తూనేవుంది. పెద్దలు తన పెళ్ళిగురించి మాటాడతారనే మొహమాటంవలన ఆమె వాళ్ళ మధ్య వచ్చి కూర్చోలేదు; ఇప్పుడు తల్లి పిలవగానే వచ్చింది.

"ఇవాళ ఏమిటి విశేషం, మైసూరు పాక్?" అని పట్టమ్మాళ్ అడగ్గానే "ఇవాళ శారద పుట్టినరోజు!" అని కమలం బదులు చెప్పింది. "అక్కడ శారద ఏమీ చెయ్యదు. నాకే ఇవాళైనా ఒక స్వీట్ చేస్తే తృప్తి!" అని అంటూ ఒక మైసూర్ పాకు బిళ్ళ మంజుకి అందించింది.

"ఇది మీ రెండో అమ్మాయా? పెళ్ళి చెయ్యాలన్నమాట!" అని సౌర్ణం అడిగారు.

"చదువు పూర్తైంది; ఉద్యోగంకూడా చెయ్యవచ్చు," అని పట్టమ్మాళ్ అన్నారు.

"అవును, చదువు పూర్తైంది, ఇక పెళ్ళి సంబంధం చూడాలి!" అని కమలం జోక్యం చేసుకుంది.

"శారద ఎప్పటిలాగే ఉత్తరాలు రాస్తోందా?" అని పట్టమ్మాళ్ అడిగారు.

"హూం, చురుకుగా, శ్రద్ధగా రాస్తూనేవుంది. మంజు పెళ్ళిగురించి మేం అశ్రద్ధగా ఉన్నామని వాపోతుంది. మేం అశ్రద్ధగా ఉండగలమా, చెప్పండి! ఈ రోజుల్లో పెళ్ళంటే ఎంత డబ్బు కావాలి! అది చెప్పే వరులు మాకు అందని స్థాయిలో ఉన్నారు, వాళ్ళతో ఎలా సంప్రదించడం అని మేం రాత్రీ పగలూ ఆలోచిస్తున్నాం. అదే దానికి అర్థం కావటంలేదు!"

"అవును, నిజం! పెళ్ళంటే సరాసరి ఆరు వేలు చాలా?"

"ఆరుపేలు ఏ మూల? చెవులకి వజ్రాల కమ్మలకే రెండు వేలు కావాలి!" అని అంది కమలం.

"భవిష్యత్తులోనే ఇవన్నీ కొనాలంటే ఇక కష్టమే! పెళ్ళి సమయంలో కొందాం అని ఆలస్యం చెయ్యక కొంతమంది ముందుగానే ఒక్కొక్క వస్తువు కొంటారు, వాళ్ళకి అంత శ్రమ ఉండదు. మీరలా చెయ్యలేదుకాబోలు!" అని అంటూ సౌర్ణం మంజుని తేరిచూసారు. మంజు తలవంచుకొని వెనకాడింది.

"అదేంటో, ఎంత డబ్బు ఖర్చుపెట్టి కానుకలు కొన్నా ఆఖరికి ఆ వెండి గిన్నెలూ, నగలూ పుట్టిల్లులో మిగిలిపోవడమే మనం చూస్తున్నాం! మన పిల్లలు బంబాయీ,

అస్సామూ అని వలసపోయినప్పుడు ఎదీ తీసుకొనివెళ్ళరు! ఇక వాళ్లు వజ్రాల కమ్మ చెవిలో తొడుక్కోడం ఎన్నడూ జరగదు! పెళ్ళికానుకలు పుట్టిల్లు లేకపోతే అత్తగారింట్లో అలాగే ఉండిపోతాయి! అంతా వ్యర్థం!" అన్నారు పట్టమ్మాళ్.

"వ్యర్థం అని మీరెందుకంటున్నారు? ఆ దంపతులు ఎక్కడున్నాసరే ఆ కానుకలకి వాళ్ళు అర్హులు. పెళ్ళి అనే వంకలో మనం కొని ఇవ్వకపోతే మరెప్పుడు కొనడం సాధ్యమౌతుంది?" అని కమలం అడిగింది. 'అవును!' అని ఆమెతో ఏకీభవించిన ధోరణిలో సొర్ణం కనిపించారు.

పట్టమ్మాళ్ నవ్వుతూ మళ్ళీ మాటాడారు:

"అవును, మనం తప్పకుండా కానుకలు కొని ఇవ్వాలి. నేనన్నది ఈ రోజుల్లో పెళ్ళి పెనుభారంగా ఐపోయిందని, అంతే! అలాగ కొనిపెట్టినా మన పిల్లలు వాటిని అనుభవించడంలేదని అన్నాను. పెళ్ళంటే వైభవంగా జరిపితే అది కన్నులవిందుగానే ఉంటుంది! కాదని ఎవరన్నారు?"

సొర్ణం ఏమీ అనక ఊరుకున్నారు. అది చూసి పట్టమ్మాళ్ "మీరేం ఆలోచిస్తున్నారు, సొర్ణం? మీకందరూ అబ్బాయిలే! కూతురు లాంఛనాలగురించి మీకు ఏ శ్రమా లేదు!" అని ఆవిడ నాలికని లేవగొట్టారు.

"శ్రమ అంటున్నారా? అదేం మాట? అమ్మాయికీ అన్నివిధాలా మర్యాదలు చెయ్యాలని మనకి ఆశగా ఉంటుంది. మంజుకి 'ఇది కొనాలి!', 'అది కొనాలి!' అని నాకూ ఎప్పుడూ ఆతురత . . . కాని దాని తరువాత ఇద్దరు అబ్బాయిలు ఉన్నారు, వాళ్ళ చదువుగురించి మనకి బాధ్యతవుందని ఆలోచించాలిగా?" అంది కమలం.

"అవును, తమ తమ పిల్లలకి అన్నీ చెయ్యాలని తల్లిదండ్రులు ఆశపడతారు!" అని సొర్ణం ఆమోదించారు.

"'తమ తమ ఆడపిల్లలకి' అని చెప్పండి!" అని పట్టమ్మాళ్ గట్టిగా నవ్వారు.

"మగపిల్ల, ఆడపిల్ల - ఎవరైనా సరే, . . . " అని దృఢంగా, నవ్వకుండా సొర్ణం పలికారు. 'నాకు కూతురు లేదు. నేను చేసేదంతా నా అబ్బాయిలకీ, రాబోయే కోడళ్ళకీ!' అనే ఆవిడ పలికిన మాటలు ఆవిడ మనోభావం ఆవిడ చూపులోనే అందరికీ అర్థమైంది.

“మా శారద స్వభావం పట్టమ్మాళ్ కి తెలుసు. ‘మీరు అప్పుచేసైనా సరే మంజుకి పెళ్ళి చెయ్యండి!’ అని శారద మాకు ఎన్నిసార్లు చెప్పిందో? కాని మా దగ్గరనుంచి అగత్యంలేకుండా ఏదీ తీసుకోదు! అంత కచ్చితమైన మనసు దానికి! తోబుట్టువుల ఆస్తిని కాజేసినట్టుందని అంటుంది. ఐనా ‘దీపావళి, నవరాత్రి, పుట్టినరోజు సమయాల్లో నువ్వు మా కానుకలు నిరాకరించకూడదు!’ అని మేం కోపించుకున్నాం, అదీ వద్దనలేదు. లెక్కంటే శారద చాలా కరారుగా ఉంటుంది!” అంది కమలం.

“అలాగుంటే మంచిదే!” అని సౌర్ణం ఆమోదించారు.

“ఎటువంటి వ్యవహారంలోనూ ఒక పరిమితి ఉంటేనే ఉత్తమం!” అన్నారు పట్టమ్మాళ్.

“అవును. అదే శారద ఉద్దేశం! ఎవరూ తన్ను తప్పుపెట్టకూడదు! తమ్ముడూ, చెల్లెళ్ళకి ఏదైనా బహుమానం ఇవ్వాలన్నా జాగ్రత్తగా, ఆలోచించే కొంటుంది. అగత్యంలేకుండా ఏదీ పుచ్చుకోదు. ఏదీ ఇవ్వదు! ఐదు, పది అని ఐనా ఇంత కరారుగా ఉండాలా అని నాకనిపిస్తుంది,” అని కమలం కూతురుగురించి గర్వంగా చెప్పుకుంది.

“లెక్కకి సరిగ్గా ఉంటే ఏ బాధా లేదు!” అని పట్టమ్మాళ్ క్లుప్తంగా అంటున్నారు. కాని?

సౌర్ణం ఒక సరసమైన సంగతి చెప్పారు.

“డబ్బు ఉంటే అన్నివిధాల చిక్కులూ పడవలసిందే! నాకు తెలిసిన ఒక ముత్తైదువ ఉన్నారు. పాపం, అడిగి అడిగి ఆవిడ తన అబ్బాయి పెళ్ళిలో అన్నిరకాల కానుకలూ పుచ్చుకున్నారు. ఇల్లంతా కోడలు తెచ్చిన వస్తువులతో నిండిపోయింది. కొన్నిరోజుల్లో ఆవిడ సంతోషమంతా వట్టిపోయింది. ఇల్లంతా కోడలు తెచ్చిన బహుమతులే. ‘ఇది నా కొడుకు ఇల్లు కాదు, కోడలిల్లు!’ అనే నాకనిపిస్తోంది! ఎందుకురా ఇవన్నీ అడిగి తీసుకున్నాం?’ అని ఇప్పుడు బాధగా ఉంది అని అంటున్నారు. తనేదో పోగొట్టుకున్నట్టు ఆవిడ ఆరాటపడుతున్నారు.”

“ఏదో అని ఎందుకంటున్నారు? కొడుకుమీదవున్న ఆశ! అవును, కట్నమని వందలూ, వెయ్యిలూ తీసుకుంటే ఆఖరికి మనమే బానిసలైపోతాం! కట్నం వద్దని బహుమతులు మాత్రం పుచ్చుకుంటే మన అబ్బాయికీ అదే గతి! మేం మా

అబ్బాయికి కొనియిచ్చినవేవీ ఇప్పుడు వాడిదగ్గర లేవు! వాడి ఉపనయనంలో కొన్న పంచపాత్ర, వాడు నాతో కూర్చొని భోంచేసిన వెండి పళ్ళెం మా ఇంట్లోనే ఉన్నాయి!" అని పట్టమ్మాళ్ విసుగ్గున్నారు.

"అవేమో మీ అబ్బాయికి ఇచ్చేయండి!" అన్నారు సౌర్ణం, నవ్వుతూ.

"అలాగ చేస్తే చాలా? కూతురుకి చేసినట్టే కొడుక్కీ లాంఛనాలు చేస్తే, కొడుకూ కోడలూ మన అణకువలో ఉంటారనిపిస్తోంది. నేను ఒక నెల కలకత్తాలో అబ్బాయితో ఉన్నప్పుడు నాకలాగే అనిపించింది!" అని అంటూ పట్టమ్మాళ్ ఒక జడ్డినవ్వు నవ్వారు.

"నాకేం శ్రమ లేదని మీరన్నారుగా? అసలు నా పరిస్థితి ఏమిటో బోధపడిందా? నేనే ఎక్కువగా ఆయాసపడాలి!" అన్నారు సౌర్ణం.

"మీరన్నది నిజం. కాని మీరుగాని తలచుకుంటే మీకెటువంటి బాధా లేదు! మీకందరూ అబ్బాయిలే! మా సంగతి వేరు. మేమే ఆయాసపడాలి!"

"ఏదైనా సరే, ఒక పరిమితిలో ఉంటే ఏ కష్టమూ లేదు. కూతురుకి తల్లిదండ్రులు అన్ని లాంఛనాలు వైభవంగా చేస్తే అది ఆమెకు బలం ఇస్తుందికదా? అభిమానం పెరుగుతుంది. పేదగా వెళ్తే ఎన్ని చిక్కులు పడాలో?" అని కమలం అంది.

"అన్నీ కొన్ని రోజులకే; ఆ తరువాత అందరూ తమ తమ గొడవ, సంసారం అని సహజంగా సర్దుకొనిపోతారు!" అన్నారు పట్టమ్మాళ్.

"అలా సర్దుకొని పోవడానికి ఎది కారణం? అభిమానం, బుద్ధి! డబ్బు కాదేమో?" అని సౌర్ణం అడిగిన ప్రశ్న ఆ ముగ్గురు స్త్రీలనీ ఆహ్లాదపరిచింది.

'ఇవన్నీ విని నా మనసులో ఒక కొత్త భావన లేచింది!' అని బాహాటంగా చెప్పాలని కమలంకి ఊరట కలిగింది; కాని ఏమీ అనక ఊరుకుంది.

మగువలు సంభాషణలని అని ఆరంభిస్తే, వాళ్ళ పిచ్చాపాటీకి అంతు అంటూ ఏమైనా ఉందా? రంగుల ముగ్గులకి ఎర్రమన్ను వాడితే సొగసుగా ఉంటుందా? వాళ్ళు ఎన్ని కబుర్లు, ఎటువంటి కబుర్లు చెప్పుకుంటారో ఎవరికి తెలుసు? ఆ తరువాత ఈ స్త్రీలు ఏమేమో మాటాడారు, సమయం సాగుతూనేవుంది. ఇంతలో పట్టమ్మాళ్

కూతురు వచ్చి "శేఖర్ అంకుల్ ఈ వారం 'ఇంద్రధనుస్సు' పత్రిక కావాలంటున్నారు. మీ ఇంట్లో అడిగి తెస్తానని చెప్పాను," అని అడిగి ఆ పత్రికని తీసుకుంది.

"నిన్నరాత్రంతా రైల్లో నిద్రపోకుండా వాడేదో పత్రిక చదివాడే? అది వేరే పత్రిక కాబోలు! బాగుంది. సెకండ్ క్లాసులో రిజర్వ్ చేసుకొని ఆఖరికి నిద్రలేకుండా ప్రయాణం చేసాడు!" అని నవ్వుకుంటూ సొర్ణం వెళ్ళారు.

శేఖర్ అనే పేరు మంజు చెవులకి ఇంపుగా వినబడింది. కమలం అది గుర్తించలేదు. అల్లుడుగా రాబోయే వరుడుగురించి తల్లికి శ్రద్ధ లేదని శారద బాధపడుతోంది! ఆవిడకి మరేం ఆలోచన లేదే?

సాయంకాలం భర్త శబేసన్ రాగానే కమలం అతనికి మైసూర్ పాకు వడ్డించింది. "మీకిది వేడివేడిగా ఇవ్వాలనుకున్నాను. కాని మీరెదీ వేడిగా తీసుకోరని నాకు తెలుసు. నేను మధ్యాహ్నమే ఇది చేసేసాను, రుచి చూసేసాను.  ఇవాళ కోవిలకి వెళ్ళి శారద పేరులో అర్చన చెయ్యాలనుకుంటున్నాను. మనం ఈ ఊరులో మూడు సంవత్సరాలుగా ఉన్నాం,  ఎవరి పేరునా అర్చన చెయ్యలేదు! మన ఊరిలో ఉంటే అలవాటుగా చేసివుంటాం," అని అంది.

టక్కున శబేసన్ నోరు తెరిచి మాటాడారు. "చూడు, నాకిది వేడిగానే ఉంది!" అని చెయిలోని మనియార్డరు నమూనాతో వచ్చిన సందేశం భార్యకి అందించారు.

అది చదివి కమలం అదిరిపడింది. 'మనం ఏం తప్పు చేసాం? మనకెందుకీ శిక్ష?' అని నివ్వెఱపోయింది.

'శారద మనసు తెలుసుకున్నతరువాత దాని మాటలకి వ్యతిరేకంగా నేనేమీ చెయ్యలేను. దుఃఖంతోనే నేను మీకు మీ బహుమతి తిరిగి పంపిస్తున్నాను. మీరేం బాధపడవద్దని నా మనవి,' అని గణేశన్ రాసాడు.

"దానికి ఇలా కోపం వస్తే మనం చేసేదేముంది? అది చెప్పినట్టే ఉత్తరం రాసాం, జవాబేమీ రాలేదే?" అని శబేసన్ భార్యని సముదాయించారు.

'అమ్మోయ్, అక్కయ్యకి ఎంత కోపం!' అని మంజు తనలో నవ్వుకుంది.

‘ఈ ఊరులో అర్చన చెయ్యాలని నాకు వింతగా ఎందుకు తోచిందో? ఈ సంవత్సరం అదే దానికి పుట్టినరోజు బహుమతి కాబోలు!’ అని కమలం ఆలోచించింది. మంజుతో కోవిలకి వెళ్ళడానికి ఒక పళ్ళెంలో కొబ్బరికాయ, అంటిపళ్ళతో సిద్ధమైంది.

“మామీ, ఒక నిమ్మపండు ఇస్తారా? అమ్మ మిమ్మల్ని అడగమంది!” అని పట్టమ్మాళ్ కూతురు - పన్నెండేళ్ళ అమ్మాయి - వచ్చింది.

“ఒకటి చాలా? పులుసుకా?”

“కాదు. శేఖర్ అంకుల్ కాఫీ వద్దని అనేసారు; అతను మధ్యాహ్నం కాఫీ తాగరట. అతనికి షర్బత్తు చెయ్యాలి.”

“ఇప్పుడు మధ్యాహ్నం కాదే? ఏం, ఎండగా ఉన్నప్పుడు ఎందుకు అతను షర్బత్తు తాగలేదు?”

“అతను ‘ఇంద్రధనుస్సు’ చదువుతూ అలాగే నిద్రపోయారు.”

“సరేలే, మేమిప్పుడు కొవిలకి వెళ్తున్నాం. మీ అమ్మా, సౌర్ణం ఆంటీ వస్తారా?”

వీధిలో ఏదో సందడి వినిపించింది. శేఖర్, పట్టమ్మాళ్ భర్త వచ్చి ఇంటిముందు నిలబడ్డారు. “‘ఇక్కడే వీడు షర్బత్తు తాగనీ, మిమ్మల్ని కలుసుకోనీ!’ అని తీసుకొని వచ్చాను” అని శబేసన్ కి ఆ పెద్దాయన చెప్తున్నారు. అతను తనకి జలుబుగా ఉందని, షర్బత్తు వద్దనేసారు. శేఖర్ కి మైసూర్ పాకు, షర్బత్తు  ఇచ్చి తల్లీ, కూతురూ కోవిలకి బయలుదేరారు. మంజు, శేఖర్ - ఇద్దరూ - ఒకరినొకరు రెప్పవాల్చకుండా చూసిన ధోరణి ఎలా వర్ణించడం?

కమలం కోవిలలో దేవుని సన్నిధిముందు మనఃపూర్తిగా నిలబడింది; శారద మనసులోని కోరికలన్నీ నెరవేరాలని ప్రార్థించుకుంది.

ఇక మంజు?తన జీవితం వర్ధిల్లాలని అక్కయ్య ఆకాంక్ష; అది నెరవేర్చమని మనసులో వేడుకుంది.

ఇద్దరూ దర్శనం ముగించి బయటకి వచ్చే సమయంలో సౌర్ణాంబాళ్, పట్టమ్మాళ్ కోవిలలో ప్రవేశించడం చూసారు. కొంచెంసేపు నిలబడి అందరూ మాటాడుకున్నారు. “అర్చన అనే పేరుతో శారదకి ఏదో చేయడమైంది. నా మనసు బాగా లేదు. దాని పుట్టినరోజుకి మేం పంపిన బహుమతిని అమ్మాయి తిరిగి పంపేసింది. మంజు పెళ్ళి

విషయంలో మేం అశ్రద్ధగా ఉన్నామని దానికి కోపం. దేనికీ దేనికీ సంబంధం అని చూసారా?" అని కమలం తక్షణమే తన మనోవ్యధ తెలియజేసింది.

"పాపం, మీకు బాధగా ఉంటుంది!" అని సౌర్ణం సానుభూతితో పలికారు.

"ఆ అమ్మాయి తను పడుతున్న వేదన తాళలేకే ఇలా చేసివుండాలి! ఆరు నెలలుగా ఆమె నొక్కి చెప్తోంది! 'మంజు చదువైపోయింది, మీరెందుకు ఆలస్యం చేస్తున్నారు?' అని మాటి మాటికీ అడుగుతూనేవుంది!" అన్నారు పట్టమ్మాళ్.

మంజు మరేం అనక అలాగే నిలబడింది.

"వాళ్ళు ఇంకా ఇంటిలో ఉంటారోమో?" అనే అపేక్షతో మంజు ఇంటికి తిరిగి వచ్చింది. 'అందరికీ ప్రసాదం,' అన్నట్టు చిందూరం, పళ్ళూ ఇవ్వాలనుకుంది. కాని ఎవరూ కనిపించలేదు.

'నాన్నగారెక్కడ?' అని కమలం వెదికింది. "పట్టు అంకుల్ ఇంటికి వెళ్ళారు," అని అబ్బాయి చెప్పాడు. ఎందుకు? అతను ఇక్కడికి వచ్చారుగా, మరి ఎవరితో మాటాడాలని ఆ ఇంటికి వెళ్ళారు? స్త్రీలతో మాటాడాలని వెళ్ళారా? వాళ్ళు ఇంకా గుడినుంచి తిరిగివచ్చివుండరే?

"సరిగ్గా చెప్పు, నాన్నగారు ఏమని నీకు చెప్పి వెళ్ళారు? ముందు ఆ రేడియోని ముయ్ . . . నీకు జ్ఞాపకం వస్తుంది!" అని కమలం కొంచెం కఠినంగా అడిగినతరువాత పిల్లవాడు చెప్పాడు: "నాన్నగారు నిన్నుకూడా రమ్మన్నారనుకుంటాను."

"ఆ ఇంటికా?

"మరెక్కడికి?"

"సిలోన్ కి!" అని జోక్యం చేసుకుంటూ మంజు గట్టిగా నవ్వింది.

శబేసన్, కమలం ఇంటికి తిరిగిరావడానికి ఒక గంట పట్టింది. అంతలోనే ఎన్ని మార్పులు! ఆ మండుటెండలో మనకి ఆకాశంలో కనిపించే శోభలాగ ఆ దంపతుల మొహం నిగనిగలాడింది.

"ఒరేయ్, మనింట్లో పెళ్ళి!" అని అంటూ శబేసన్ అబ్బాయి వీపుమీద మెల్లగా తట్టారు.

"ఇక దేవుడి దయ వలన అన్నీ శుభంగా జరగనీ!" అని కమలం మనసార వేడుకుంది.

ఇక మంజు ఓపికని పరీక్షించకూడదని తల్లిదండ్రులు అన్నీ వివరంగా ఆమెకి చెప్పేసారు.

"దేవుని అనుగ్రహం అంటే ఇదే!" అని అందరూ చెప్పుకున్నారు.

శేఖర్ ఎవరు? శారద శ్లాఘించిన వరుడే! అతని తండ్రి తరచుగా పనిమీద ప్రయాణం చేస్తారట. అతని చెయికి శబేసన్ ఉత్తరం అందినట్టు ఏ సూచనా లేదు. "అది భద్రంగానే మా ఇంటిలో ఉంటుంది. నేను అక్కడ ఉండివుంటే దాన్ని మా ఆయనకి ఇచ్చివుంటాను. ఈ రెండు నెలలూ శేఖర్ తో ప్రయాణం చేసి ఇప్పుడే నేను మా ఊరుకి తిరిగి వెళ్తున్నాను," అని అతని భార్య పొర్ణాంబాళ్ అన్నారట. "సరే, జాతకాల్లో పొందిక ఎలావుందో చూద్దాం, నేను మీకు తెలియజేస్తాను! ప్రాప్తముంటే ఈ పెళ్ళి జరుగుతుంది," అని ఆవిడ ధైర్యపరిచారట! మరేం కావాలి?

'మనుషుల్లో భేదాలు, హెచ్చుతగ్గులు వాళ్ళ వాళ్ళ మనసుబట్టి ఉంటాయి; ఐతే భగవంతుడి ఇచ్ఛలో డబ్బేం చేస్తుంది?' అని పొర్ణం అన్నారట.

"మా ఇంటిముందే ముగ్గులకి ఎర్రమన్ను పూసివుంటుంది. మీకు మరేం ఆనవాలు వద్దు! మీరు మా ఇంటికి ఎప్పుడైనా సరే రావచ్చు! మీరు ప్రయాణం చేసే దారిలోనే మా ఉరు ఉంది!" అని పట్టమ్మాళ్ పొర్ణంగారని ఆహ్వానించారట. వాళ్ళు అలాగే వచ్చారు, అవాళే మంజు తనింటి ముగ్గులో ఎర్రమన్ను వాడింది.

"నేను మంజుకి ఎర్ర మన్ను ఇచ్చిన వేళ, అది దాని పెళ్ళి ముహూర్తంకి దారి తీసింది!" అని పట్టమ్మాళ్ గొప్పగా అందరికీ చెప్తున్నారు. న్యాయమేకదా?

"మీరూ, మీ ఆయన మాకు శేఖర్ తల్లిదండ్రులను పరిచయం చేసారు; మీ ఆయన వచ్చి మాకు వివరాలు చెప్పిన తర్వాతే మాకన్నీ తెలిసాయి!" అని శబేసన్ తన కృతజ్ఞత తెలియజేసారు.

పట్టమ్మాళ్ స్నేహం, ఆవిడ పలికే మోటు మాటల్లో ఇమిడియున్న గూఢార్థాలవలన ఆ రోజు మధ్యాహ్నం తనూ, పొర్ణాంబాళ్ మాటాడుకున్న కబుర్లు కమలం భర్తకి వివరంగా చెప్పింది.

“మరేం చింతా లేదు. ఈ పెళ్ళి త్వరలో జరుగుతుంది,” అన్నారు శబేసన్.

“ఇదిగో చిందూరం! మీకివ్వడానికి మరిచిపోయాను!” అని కమలం అతనికి అందించింది. ఆ సమయంలో దూరంలో ఏకాకిగా నిలబడియున్న మంజు తన చీరలో ఎర్రమన్ను అలికిన ప్రదేశాన్ని తన కళ్ళలో ఒత్తుకుందేమో? ముద్దు పెట్టుకుందేమో? లేకపోతే ఉత్తికే మొహం తుడుచుకుందేమో?

“శారదకి ఒక టెలిగ్రాం పంపించాలనిపిస్తోంది. దానికి ఇదే మంచి పుట్టినరోజు బహుమతి! పాపం, దానికి ఈ శుభవార్త తెలియదే?” అన్నారు శబేసన్.

“టెలిగ్రాం వద్దు. అర్ధరాత్రిలో భయపడుతుంది. మీరు దానికి ఫోను చెయ్యండి.”

“మనం ఉత్తికే డబ్బు ఖర్చు చేస్తున్నాం అని గోల పెడుతుందేమో?”

“గోల పెట్టినా సరే. ఫోనూ వద్దు. దానికి బదులు మంజుకి ఒక ఎవర్ సిల్వర్ పాత్ర, ఒక కుంకుమ డబ్బీ కొనవచ్చు అని అంటుందేమో? రేపు దానికి వివరంగా ఉత్తరం రాయండి, అది చాలు! ఇన్నిరోజులుగా దాని మనసులో ఆరాటం, ఇంకా రెండు రోజులు ఆలస్యమైతే ఏంపోయింది?”

కమలం అలా అనుకుంది కాని అక్కడ శారద ఈ రెండురోజులూ బాధపడుతూనేవుంది: ‘పాపం, నేను తిరిగిపంపించిన బహుమతి నా పుట్టినరోజే నా తల్లిదండ్రులకి అందిందేమో?’ అనే తాపం కలిగింది.

‘అలాగైనా సరే! వాళ్ళు బాధ పడనీ!’ ఆమె కోపం తగ్గలేదు.

ఆమె ఆరాటం ఒక హద్దులోకి వచ్చింది; కుంకుమం పూసిన ఒక ఉత్తరంలో ఒక శుభవార్త ఆమెకు వచ్చిచేరింది:

“నీ మనోవ్యథా, నా ఆలోచనలన్నీ నేను సొర్ణాంబాళ్ గారికి - ఆవిడ ఎవరని తెలియకుండానే - మాటవరుసకి తెలియజేసాను. అందువలన వాళ్ళకి మన ఆర్థిక అవస్థ బాగా తెలుసు. మనగురించి అన్ని వివరాలు చెప్పడానికి పట్టు మామీ ఉన్నారు. సొర్ణంగారి మనసు బంగారం; అందులో ఔదార్యం ఉంది, అభిమానం ప్రకాశిస్తోంది. ఈ స్నేహం వలన ఈ సంబంధం స్థిరపడుతుందని నమ్మకం మాకు కలుగుతోంది.

ఎద్దైనా సరే, శిఖరాన్ని చేరినతరువాత కిందకి దిగి రావలసిందే! ఆ రోజు నీ మనోవ్యధ అత్యంతంగా పెరిగిపోయిందని మేం తెలుసుకున్నాం. నువ్వు డబ్బు తిరిగిపంపించినప్పుడు మాకలాగే తోచింది. దేవుడి దయవలన ఈ శుభవార్త నీకు అందజేస్తున్నాం!" అని శబేసన్ మనఃపూర్తిగా ఆ ఉత్తరంలో రాసారు.

"ఆ తరువాత ఎందుకురా మనియార్డర్ తిరిగి పంపించేయాలని హఠం చేసాను అని నాకనిపించింది. 'మీరది పంపించకుండా ఉంటే బాగున్ను!' అనికూడా తోచింది!" అని శారద గణేశన్ కి చెప్పింది.

"నాకూ అదే ఆలోచన. కాని అవాళ నీ కోపం చూసానుగా? మరేం అనక పంపించేసాను! నేనుగాని పంపించలేదనుకో? . . ." అని అంటూ గణేశన్ నవ్వాడు.

"మీరలాంటి టక్కులమారిగా ఉంటే . . . నేనెందుకిలా ఉన్నాను?"

"ఎలాగ?"

"నా చెల్లెలి పెళ్ళిగురించి ఎందుకిలా బెంగపెట్టుకొని ఉన్నాను?"

ఈ ప్రశ్నే ఒక జవాబుగా శారద ఇవ్వాలనుకుంది; గణేశన్ కూడా అదే భావనలో కాచుకొనివున్నాడు.

ఇంతలో మోమాటం జోక్యం చేసుకొని ఇద్దరి ముఖాల్లోనూ ఎర్రమన్ను పూసేసింది.

********

**(మూలం ప్రచురణ: కళైమగళ్, ఏప్రల్,1955)**



# ఈ టపాసు వద్దు!

టపాసుకీ, మతాబుకీ నిప్పు అంటించి ఇక రాబోయే శబ్దం వినాలని, కాంతిని చూసి ఆనందించాలని పిల్లలు కాచుకొనివున్నారు.

ఇంతలో తపాలులో వచ్చిన శుభ వార్త విని పెద్దలు సంతోషించారు.

పిల్లల ముచ్చటలు పెద్దలకి అంత గొప్పగా అనిపించకపోయినా పెద్దల సంతోషంలో పిల్లలు కలుసుకున్నారు.

"బావగారు వస్తున్నారు!"[1] అంటూ పిల్లలు కేరింతలు పెట్టారు. అది విని పద్మ మొహం ప్రకాశించింది. ఆమె తల్లిదండ్రులు అది విని ఆనందించారు. వాళ్ళకీ హృదయమని ఒకటుంది; కాని పద్మ మిరుమిట్లు గొలిపే మతాబు లాగ కనిపించింది; ఆమె తల్లిదండ్రుల ధోరణిలో టపాకాయల్లాగ శబ్దమూ, కాంతీ రెండూ కానవచ్చాయి.

ఇంటి ముందు భాగంలోనే ఈ గడబిడ అంతా; వెనుక భాగంలో, తలుపుదగ్గర నిలబడి ఈ ముచ్చటలన్నీ చూస్తున్నది ఎవరు?

ఆ శుభవార్తకి అర్హత కలిగిన పద్మ కాదు!

ఆ శుభవార్తలో ఆవిడకి రవంతైనా వంతులేదు; కాని రాబోయే అతిధి సత్కారంకి ఆవిడకి నిండుగా బాధ్యత ఉంది: అదే ఈ ఇంటి, ముసలి వంటకత్తె, మీనాక్షి అమ్మాళ్.

చావడిలో ఉత్సాహంగా అందరూ మాటాడుకుంటున్నారు.

"ఇదిగో, వినండి. అల్లుడుగారు దీపావళి పండుగకి మనింటికి వస్తున్నారు! అక్కయ్యకీ, అతనికీ ఎటువంటి ఇబ్బంది రాకూడదు, సరేనా?"

ఇంటి యజమాని స్వామినాధన్ మాటలు విని అంతా బోధపడినట్టు పిల్లలు గోపీ, లలిత గట్టిగా నవ్వారు; అతని పక్కనే నిలబడియున్న పద్మ మెల్లగా జరుగుతూ, ఇంటి వెనుక భాగం చేరుకుంది.

---

[1] ఆంధ్రులకి సంక్రాంతిలాగ తమిళులకి దీపావళి ముఖ్యమైన అల్లుళ్ళ పండుగ

"పద్మా, మీ ఆయన వస్తున్నారని ఉత్తరం వచ్చిందా?"

ప్రశ్న వినగానే పద్మ తిరిగి చూసింది; మీనాక్షి అమ్మాళ్ ఐదారు అడుగుల దూరంలో, తలుపు వెనుక కనిపించారు.

"అవును."

"అతనితో నువ్వూ వెళ్తావా? అతను మరేమైనా రాసారా?" అని ఇంకొక ప్రశ్న.

"ఊరుకోండి మామీ, . . . నాకేం తెలుసు? మీకెందుకు ఈ ప్రశ్నలు?" అని కటువుగా అడుగుతూ అక్కడనుంచి పద్మ నిష్క్రమించింది.

మీనాక్షి అమ్మాళ్ మొహం ముడుచుకుంది.

'నాకేదో అడగాలనిపించింది, అడిగాను . . . అందుకు అమ్మాయి ఇలా మండిపడాలా?' అని ఆవిడ నొచ్చుకుంది.

'అమ్మాయి మంచిదే, కాని దుడుకుతనం కూడా ఉంది!' అని తనలో చెప్పుకుంది.

కాని వెంటనే మరొక విధంగా ఆవిడకి ఊరడింపు కలిగింది:

'అవును. ఆ అమ్మాయిని అడుగుతే మరేం చెప్తుంది? దాన్ని నేను అడిగినది సరేనా? అదే నేను చేసిన తప్పు! పాపం, పద్మ సిగ్గుతో నాతో కఠినంగా మాటాడింది. నేను దాన్ని తప్పుపెట్టకూడదు! దాని ప్రవర్తనకి లజ్జే కారణం, మరేం లేదు . . .'

మనసు శాంతపడింది; మీనాక్షి అమ్మాళ్ లోపలికి వెళ్ళి, జపమాలతో కూర్చున్నారు.

"మామీ, మంచి వేళ, అల్లుడుగారు వస్తున్నారని ఇవాళే ఉత్తరం వచ్చేసింది! మనకి ఇంకా ఒక వారం టైముంది. మీరే బాధ్యత వహించి, మీ సొంత అబ్బాయికి చేసినట్టు, శ్రద్ధగా అతనికి అన్నీ చెయ్యాలి! మీకే ఇవన్నీ బాగా తెలుసు!"

కొంచెం సమయంలోనే పద్మ తల్లి సీతాలక్ష్మి మర్యాదగా అన్న ఈ మాటలు విన్నతరువాత మీనాక్షి అమ్మాళ్ మనసు పద్మని క్షమించేసింది.

"దానికేం అమ్మా! సాధ్యమైనంతవరకూ నేనన్నీ చేస్తానులే! మీ అల్లుడు నాకేం అన్యులా? పద్మ నా కూతురులాగ. దాని పెళ్ళి నేను చూడలేక పోయాను, ఇప్పుడు దంపతులిద్దరినీ కలిసి చూడడం నా భాగ్యం, నాకది చాలదా? ఇవన్నీ చెయ్యడానికి

నాకు చాలా సంతోషమే!" అని అంటూ మీనాక్షి అమ్మాళ్ చెయిలో జపమాల అందుకున్నారు.

"సరే మామీ, మీరు జపం చెయ్యండి; పది నిమిషాల్లో అందరూ భోజనంకి వచ్చేస్తారు!" అని చెప్పి సీతాలక్ష్మి వంటగదినుంచి బయటకి వచ్చింది.

"అదేంటో అమ్మా, అల్లుడుగారు వస్తున్నారంటే సంతోషంకి బదులు గాబరావే ఎక్కువగా కనిపిస్తోంది! ఇంతకీ అతనుమాత్రం వస్తున్నారు. వియ్యంకులెవరూ రావటం లేదు! అతను మన అతిథి సత్కారం తప్పుపట్టే మనిషికూడా కాదు! ఐనా మనకెందుకో తత్తరపాటుగా ఉంది!" అని సీతాలక్ష్మి భర్తదగ్గర మొరబెట్టుకుంది.

"ఎందుకు భయం? నాకేమో అల్లుడుగారనే హోదా గురించి ఎటువంటి భయమూ, ఆరాటం లేదు! అందుకు తగినట్టుగా ఈ అల్లుడు మనకి దొరికారు!" అని మాటవాసికి అన్నారు స్వామినాధన్.

"అవును. నాకూ సరైన అల్లుడుగారే దొరికారు! ఐతే మనం మన దేశం వదిలి ఎక్కడో ఉంటున్నాం, నాకు మన సంప్రదాయాలు అలవాటు లేదు, నేర్పించే వాళ్ళూ లేరు! ఇది మనింటి మొదటి పెళ్ళి, అవునా? మంచి వేళ, అల్లుడిగారి మనుషులు - బంధువులు - ఎవరూ లేరు, ఐనా ఎందుకో భయంగానే ఉంది! అతనికి ఎటువంటి అతృప్తి రాకూడని నా బాధ!" అని సీతాలక్ష్మి మళ్ళీ తన వేదన భర్తకి తెలియజేసింది.

"అవును, నిజం. అల్లుడుగారు తృప్తికి తగినట్టుగా మనం అన్నీ చెయ్యాలి . . . కాని భయం వద్దు . . . అతనికి మనం అన్నివిధాల మర్యాద, ఉపచారం చెయ్యాలి."

సామినాధన్ ఒక నిమిషం ఆలోచించి మాటాడారు: "నాకొక పద్యం జ్ఞాపకం వస్తోంది. మంచి అర్థవంతమైన పద్యం!" అన్నారు.

"ఏం అర్థం?" అని అతని భార్య ప్రేరేపించింది.

"అల్లుడుకి భయపడుతూ సేవ చెయ్యడం ఎందుకో తెలుసా? అల్లుడూ ఒక కొడుకులాగే! కాని ఒకప్పుడు కోపంతో ఇంటిలోనుంచి పారిపోయిన కొడుకు! చాలా సంవత్సరాల తరువాత ఇంటికి తిరిగివచ్చిన కొడుకు! మళ్ళీ పారిపోతాడేమో? కోపం

వస్తే మళ్ళీ మాయమైపోతాడని ఇంట్లో అందరికీ భయం! అతనంటే అభిమానం ఎక్కువ, కాని బెంగతోనే ఈ కొడుక్కి అన్నివిధాలా సేవ చేస్తున్నారట! ఇదే అర్థం, ఎలాగుంది?"

ఈ వ్యాఖ్యానం స్వామినాథన్ బిగ్గరగా చెప్తూంటే సీతాలక్ష్మి ఆశ్చర్యంతో "ఓ, అర్థం చాలా బాగుందే! ఇది మీరెక్కడ చదివారు?" అని అడిగింది.

"ఇది నా స్నేహితుడు రాసిన పద్యం. అతనొక కవి. కాని, పాపం, అతనికి ఎటువంటి పేరూ, కీర్తి రాలేదు!"

"అతను ఎవరు?"

స్వామినాథన్ ఆ కవి పేరు చెప్పారు.

అప్పుడే ఇంటి వెనుక భాగంలో తలుపుదగ్గర మీనాక్షి అమ్మాళ్ ఆకారం కనిపించింది.

"ఇదో మామీ, అందరూ వస్తున్నారు!" అని సీతాలక్ష్మి భోజనంకి రమ్మని పిల్లలందరినీ పేరుచెప్పి పిలిచింది. ఆవిడ వంటగదిలో ప్రవేశించగానే మీనాక్షి అమ్మాళ్ సీతాలక్ష్మిని సమీపించారు.

"ఏమ్మా సీతాలక్ష్మి, మీ ఆయన ఎవరిగురించో చెప్పడం విన్నాను; అతని ఊరు పేరు ఏమని చెప్పారు? పేరూరా?"

"అవును, పేరూరే . . . మీకతను తెలుసా?"

"తెలుసు . . . నాకు బంధువులే . . . "

ఇంతలో పద్మ వంటగదిలోకి ప్రవేశించింది.

"అమ్మా, విస్తరాకులు ఎక్కడ? మేమందరం భోజనంకి వచ్చేసాం!"

"ఇదిగో, ఒక నిమిషం ఆగు!" అని సీతాలక్ష్మి తొందరతొందరగా విస్తరాకుల కట్ట అందుకుంది.

"మామీ, మీకతను ఎలా బంధువులు?" అని సీతాలక్ష్మి ఆగిపోయిన సంభాషణని ఆతురతతో సాగించింది.

"ఎవరు? బంధువులా? అని పద్మ ఉలికిపడినట్టు అడిగింది.

"నాన్నగారు ఎవరో ఒక కవి పేరు చెప్పారు. అతను మీనాక్షి మామీకి బంధువట."

సీతాలక్ష్మి దాన్ని ఎగతాళిగా అనలేదు, కాని పద్మకి అది వినోదంగా అనిపించింది.

"అవునులే, మామీకి మరేం పనిలేదు! ఊళ్ళో అందరిగురించి అన్ని కబుర్లూ కావాలి!" అని కటువుగా అంది.

"పద్మా, పిచ్చిగా మాటాడకు! నీకు అత్తమామలు లేరు. కాని నువ్వు అందరతోనూ అణకువతో మెలగడం నేర్చుకోవాలి. మాటల్లో నిదానం కావాలి!" అన్నారు సీతాలక్ష్మి.

"సరేలే," అని పద్మ గొణుక్కుంది.

ఇంతలో స్వామినాథన్ కాళ్ళూ, చేతులూ కడుక్కొని భోజనంకి వచ్చి కూర్చున్నారు. ఆ కొత్త వాతావణంలో మరేం సందడి లేకుండా అందరూ భోంచేసారు. ఆ తరువాత సీతాలక్ష్మి భర్తకి తాంబూలం అందించింది.

"మీరు ఆ పేరూర్ కవిగురించి చెప్పారుగా, అతను తనకి బంధువు అని మీనాక్షి అమ్మాళ్ చెప్పడానికి వచ్చారు. ఐతే పద్మకి అల్లుడుగారే తన బంధువు అని ఆవిడ అంటున్నారని అనిపించింది కాబోలు! 'ఎవరు?' అని లటుక్కున అడిగేసింది! నేను దానికి వివరించి చెప్పినా తను తప్పుచేసినట్టు పద్మ ఒప్పుకోదు! 'మామీకి మరేం పనిలేదు! ఊళ్ళో అందరిగురించి అన్ని కబుర్లూ కావాలి!' అని విసుగ్గుంది! అదేంటో పడుచుతనం!" అని అంటూ నవ్వింది.

"పద్మ జ్ఞాపకంలో అల్లుడుగారుండడంవలన తప్పకుండా దానికి అలాగే అనిపించియుంటుంది! కాని ఎందుకు అది అదిరిపడాలి? పేదవాళ్ళకి బంధువులుండరా ఏమిటి? నా బంధువులు హోటల్లో పని చెయ్యడం, వడ్డించడం నాకు తెలుసు. నెనెలాగో ఈ గోదావరి జిల్లాకి వచ్చేసాను, మంచి స్థితిలో ఉన్నాను . . . పద్మకి ఇవన్నీ తెలియవు . . . మనం చెప్పాలి !" అన్నారు స్వామినాథన్.

"అవును . . . దానికి ఇవాళ మనసులో చాలా సంతోషం. కాని బయటకి చిరచిరలాడుతున్నట్టు నటిస్తోంది!" అంది సీతాలక్షి ఒక చిరునవ్వు నవ్వుతూ.

"నాకది తెలుసులే! . . . నువ్వు వెళ్ళి భోంచెయ్! . . . మామీ కాచుకొనివుంటారు!" అన్నారు స్వామినాథన్.

నేలమీద పడిన తమలపాకు కాండాలు సేకరించుకొని సీతాలక్ష్మి నిష్క్రమించింది.

వంటగదిలో దీపావళి పండుగ గురించే అందరూ మాటాడుకుంటున్నారు.

కొన్ని నిమిషాలు ఏదో ఆలోచిస్తునట్టు స్వామినాథన్ కనిపించారు. ఆ తరువాత అతను వార్తాపత్రికలో లీనమైపోయారు.

ఉత్తరదేశంలో దీపావళి పండుగలో ఇంటి గుమ్మాలదగ్గర, ప్రహరీ గోడలపై, దేవుళ్ళ పటాలముందు, తులసి చెట్టు ముందు - ఇలా అనేక చోట్ల దీపాలని వరుసగా పెడతారు; ఆ అలవాటు దక్షిణదేశంలో లేదు. కాని అల్లుళ్ళని దీపావళికి పిలిచి గౌరవించడం తమిళులు ఒక ప్రత్యేకమైన ఆచారంగా భావిస్తారు. 'దీపాలూ, కాంతీ - ఇవేం మాకు వద్దు! అల్లుడుగారు ఉంటే ఇంటిలో అందరు ముఖాలూ నిగనిగలాడుతాడుతాయి! అది మాకు చాలు!' అని తమిళులు ఈ సంప్రదాయం అలవరించుకున్నారేమో?

అల్లుడు రాజన్ రాజులాగే కనిపించాడు. రాజయోగ్యమైన ఉపచారాలతో అతనికి అన్నివిధాలా గౌరవించడం జరిగింది. స్వామినాథన్ రైల్వే స్టేషన్ కి వెళ్ళి, అతన్ని కలుసుకొని ఇంటికి తీసుకొని వచ్చారు. ఇంటిగుమ్మం వెనుక నిలబడివున్న సీతాలక్ష్మి బిడియంతో, నోటినుంచి మాటల్లేవీ రాకపోయినా, అత్తగారనే ధోరణిలో అల్లుడికి స్వాగతం చెప్పింది. పద్మ సిగ్గుతో ఏదో ఒక మూలవెళ్లి దాంకోలేదు; అణకువతో భర్తని ఒక సారి సూటిగా చూసి మెల్లగా జారుకుంది. రాజన్ గుర్రంబండినుంచి దిగినవెంటనే పిల్లలందరూ బావగారిని గుమ్మందగ్గరే చుట్టుముట్టుకున్నారు.

"ఉష్! . . . గోడవ చెయ్యకండి . . . అందరూ ఇలా రండి!" అని పద్మ పిల్లల్ని మెల్లగా మందలించింది. సాధుపైన ఆమె కంఠం వినే రాజన్ తలెత్తి చూసాడు; పద్మ సిగ్గుతో తల వంచుకుంది.

ఆతురతతో ఇవన్నీ ఇంటి వెనుక భాగంలో చురుగ్గా చూస్తున్న మీనాక్షి అమ్మాళ్ అల్లుడు ఇంట్లోకి ప్రవేశించగానే వంటగదిలోకి జారుకుంది.

అల్లుడుతో స్వామినాథన్ మేడమీద వెళ్లారు. సీతాలక్ష్మి మీనాక్షి అమ్మాళ్ ని వెతుక్కుంటూ స్నానంకి వేడి నీరు ఏర్పాటు చెయ్యాలని పెరడుకి వెళ్ళింది.

“వేడినీళ్ళు సిద్ధంగా ఉన్నాయమ్మా!” అని మీనాక్షి అమ్మాళ్ అన్నారు.

“ఓహో . . . ” అని అంటూ సీతాలక్ష్మి ఒక క్షణం ఆగింది. ఆ తరువాత “మామీ, మీరు అల్లుడుని చూసారా? ఛాయలో తక్కువే కాని సొగసుగా కనిపిస్తున్నారు కదూ? మొహంలో మంచి చురుకుతనం కనిపిస్తోంది! మంచి మనసు, మంచి ఉద్యోగం . . . పద్మ నిజంగా అదృష్టవంతురాలు!” అని అంది.

“అవును, తప్పకుండా! అల్లుడు మహారాజులాగున్నాడు, నేనూ చూసానుగా?”

“పేరు కూడా రాజన్!” అని అంది సీతాలక్ష్మి.

“ఒ అలాగా? . . . నేను పేరడగడం మరిచిపోయాను! . . . ఏం రాజన్? నటరాజనా? త్యాగరాజనా?”

“అదీ మీరు సరిగ్గా చెప్పేసారు! పేరు నటరాజన్! కాని అందరూ రాజన్ అనే పిలుస్తున్నారు!” ఆ పేరు పలికినప్పుడు మాత్రం ఆవిడ కంఠధ్వని మట్టుపడింది; కాని మొహంలో చిరునవ్వు కనిపించింది.

“నా అబ్బాయి పేరుకూడా నటరాజన్! అందుకే ఆ పేరు గభీమని నాకు జ్ఞాపకంలో వచ్చింది!”

అప్పుడు స్వామినాధన్ మెట్లుదిగి మేడనుంచి దిగుతున్నారు. “అతన్ని స్నానంకి రమ్మనండి!” అని సీతాలక్ష్మి అంది.

అల్లుడు రాజన్ స్నానంకి మేడనుంచి దిగివచ్చాడు. అరవాయిలో పంచె, భుజాన్నీ, ఛాతీని కప్పుకున్న టర్కిష్ తువ్వాలు, చెయిలో సబ్బుపెట్టి - వీటితో చక్కగా కనిపించాడు; గబగబమని వంటగది దాడుకుంటూ నడిచాడు.

“అల్లుడుగారూ, రండి!” అని ఎవరో పిలిచారు. రాజన్ తలెత్తి చూసాడు.

తను వచ్చిన పదిహేను నిమిషాల్లో తనకి స్వాగతం చెప్తున్న కంఠం విని రాజన్ కి ఆశ్చర్యం కలిగింది; ‘ఎవరు చెప్మా?’ అని అని కళ్ళు భిగించి చూసాడు.

“మరెవరూ మీతో రాలేదా? నాన్నగారూ, అమ్మా అందరూ రావడానికి వీలుపడలేదా? మీ చిన్ననాటి స్నేహితుడు రావొచ్చుగా?”

“మరెవరూ రాలేదు!” అని ఒకే మాటలో జవాబు చెప్పి రాజన్ త్వరగా నిష్క్రమించాడు.

'నేను ఒంటరిగా రావడం ఈ ముసలమ్మకి ఇష్టం లేదేమో?' అనే ఆలోచనతో రాజన్ మరేం అనక ఊరుకున్నాడు.

అల్లుడు పెరడుకి వెళ్ళడం గమనించి అతనికి స్నానగది చూపించాలని అతని వెనుకనే  నడుస్తున్న సీతాలక్ష్మి అతను వంటగదిలో ఆగిన రెండు నిమిషాల ఘటన చూసి చీదరపడింది. అల్లుడు వెనుక తనూ త్వరగా నడిచింది. కొంచెంసేపు మీనాక్షి అమ్మాళ్ పక్క నిలబడి "మామీ, మీరు కొంటెతనంగా ఏమీ మాటాడవద్దు! మీకు నేను చెప్పానుగా అతనికెవరూ బంధులు లేరని? మీరేం ప్రత్యేకంగా అతనికి అతిథి సత్కారం చెయ్యాలనుకుంటున్నారా? అతన్ని ఏదైనా అడిగితీరాలని ఇలా అడగాలా? అసలు మీకతనితో పరిచయం లేదుకదా, మరెందుకు అతని క్షేమం గురించి మీరు అడిగి తెలుసుకోవాలి?" అని అణిగిన స్వరంతో ఆవిడని హెచ్చరించి, అల్లుడు స్నానగది ఎక్కడ అని తెలియక నాలుగు పక్కలా చూడడం గమనించింది.

"ఇదిగో, ఇదే స్నానగది . . . వేడినీళ్ళు ఉన్నాయి," అని అతనికి చూపించింది.

చావడికి వచ్చి భర్తకి చెప్పింది.

"ఈ పద్మ ఒక జడ్డి; అల్లుడుగారికి స్నానంకి వేడినీళ్ళు చూపడానికి దానికి సిగ్గు! అల్లుడుగారు రాగానే వంటమనిషికికూడా పిచ్చిపట్టుకుంది! మనం ఎంత జాగ్రత్తగా ఉన్నా, ఇలాగేదైనా దురవస్థ తప్పదేమో?" అని విసుగ్గుంది.

మీనాక్షి అమ్మాళ్ తొంగిచూసి తల వెనక్కి గుంజుకోడం సీతాలక్ష్మి చూసింది; పద్మని వెతుక్కుంటూ వెళ్ళింది.

అల్లుడుగారు స్నానం ముగించి తిరిగి వస్తున్నప్పుడు మీనాక్షి అమ్మాళ్ కంఠధ్వని మళ్ళీ వినిపించింది:

"ఆ తువ్వాలుని నేను ఉతుకుతానులే! నువ్వు వెళ్ళి టిఫన్ కి త్వరగా వచ్చేయ్!"

ఆవిడ మాటలు సరిగ్గా వినిపించుకోకుండా వస్తున్న రాజన్ కి సీతాలక్ష్మి కనిపించింది.

'అదేదో వెట్టిగా వాగుతోంది!' అని అర్థం చేసుకున్నట్టు ఇద్దరూ ఒకరినొకరు చూసుకున్నారు.

"మీరు మేడమీదకి వెళ్ళండి, నేను టిఫన్ పంపిస్తాను," అని సగం నవ్వు నవ్వి, అతను మెట్లెక్కి అదృశ్యమవగానే సీతాలక్ష్మి  మీనాక్షి అమ్మాళ్ దగ్గరికి వచ్చింది.

"మామీ, ఇదేంటి? దీపావళి పండుగలో అతిథి మర్యాద మాకంటే మీకే బాగా తెలుసుకాబోలు! టిఫనుకోసం అల్లుడుగారు వంటగదికి రావాలని పిలవాలా? బాగుంది! నాజూకుగా టిఫను ఒక పళ్ళెంలో పెట్టి పంపించడం నియమం! ఇది మీకు తెలియదా?" అని మందలించింది.

"అదేంటో, ఇడ్లీ, చట్నీ టిఫను కదా? ఇక్కడొచ్చి భోంచేస్తే  వసతిగా, అతనికి ఇచ్ఛగా వడ్డించడానికి వీలవుతుందనిపించింది. అందుకే అలాగన్నాను" అని మీనాక్షి అమ్మాళ్ చెప్పింది.

ఆవిడ జవాబులో న్యాయముందని గ్రహించినా సీతాలక్ష్మి మనసులో 'మామీకి తెలిసిన నాజూకుతనం ఇంతే!' అనే భావనే కలిగింది. "సరేలేండి! ఒక పింగాణీ పళ్ళెంలో రెండు ఇడ్లీలు పంపితే అతనికి తృప్తిగా ఉంటుంది, అందుకే అంటున్నాను!" అని అంటూ  ఒక మంచి పళ్ళెంలో టిఫను పెట్టి దాన్ని అల్లుడుకి ఇవ్వమని పద్మకి చెప్పింది.

ఆ తరువాత చాలా సమయాల్లో సీతాలక్ష్మి మీనాక్షి అమ్మాళ్ తో కొంచెం అధికారధ్వనితోనో మాటాడింది, ఆజ్ఞలు ఇచ్చింది. అల్లుడు వచ్చిన సమయం వంటగత్తె ప్రవర్తనలో ఏమైనా పెట్టిగా, అవినయముగా చోటుచేసుకుంటుందేమో అనే భయమే దానికి కారణం.

మరునాడు ప్రాతఃకాలంలో మంగళస్నానం ఆరంభించడానికి ముందే సీతాలక్ష్మి ఆవిడతో "మామీ, అందరికీ స్నానంకి ఏర్పాట్లు చేసేయండి! పిల్లలందరికీ నూనె పట్టించేయండి!" అని చెప్పింది.

"అలాగేనమ్మా, తప్పకుండా . . . ఇదిగో చూడు  . . . ముందు ఒక బిందెలో అల్లుడుగారు రూపాయలు వెయ్యాలి, అది ఆచారం! ఆ డబ్బుకి ఆ నీళ్ళు కట్టినవాళ్ళు అర్హులని చెప్తారు!"

"ఓ, అలాగా? సరేలేండి! మేమే నాలుగో ఐదో వేసేస్తాం . . . ఇవన్నీ అల్లుడుగారికి ఎలా చెప్పడం? నేనే బిందెలో వేస్తాను" అంది సీతాలక్ష్మి.

"ఊహూం, అదేం కుదరదు! అల్లుడుగారు తనే వచ్చి బిందెలో రూపాయలు వెయ్యాలి! . . . నేనంటున్నది డబ్బుకోసం కాదు! 'అది మన సంప్రదాయం' అని అంటున్నాను! మీకు మొమాటం అంటే నేనే అతనికి చెప్తాను!" అంది మీనాక్షి అమ్మాళ్.

"వద్దు, నేనే చెప్తాను, అంది సీతాలక్ష్మి.

తన భర్త మూలంగా సీతాలక్ష్మి అల్లుడికి తమ ఆచారంగురించి వార్త పంపించింది: "'ఒక రూపాయో, రెండు రూపాయలో - అది చాలు!' అని అతనికి చెప్పండి. అతనేం గొప్పగా తన డబ్బు ఖర్చు చెయ్యనక్కరలేదు."

"సీతా, అతను 'ఐదు రూపాయలు వేస్తాను!' అంటున్నారు," అని అంటూ అల్లుడుగారుతో స్వామినాథన్ వచ్చారు.

"అతనిదగ్గర ఐదురూపాయలనోటు ఉంది కాబోలు! జాగ్రత్త! డబ్బు అతను వేడి నీళ్ళలో వెయ్యాలని చెప్పండి!" అని సీతాలక్ష్మి భర్తకి గుర్తుచేసింది.

"ఓ, అలాగా? అవును, నా దగ్గర ఐదు రూపాయల నోటే ఉంది!" అని అంటూ రాజన్ ఆ నోటుని స్వామినాథన్ కి అందించి చిల్లర కావాలని అడిగాడు.

ఇంతలో మీనాక్షి అమ్మాళ్ "నాదగ్గర చిల్లర ఉంది, నేను ఇస్తాను," అని ముందుకు వచ్చింది.

"మామీ, ఎలాగైనా ఆ డబ్బుకి మీరే అర్హులు కదా? ఈ నోటు మీరు తీసుకోండి! బిందెలో డబ్బు వెయ్యకపోతే ఏం నష్టం?" అంది సీతాలక్ష్మి.

"ఏంటి, మీరలా అంటున్నారు? నేనంటున్నది సంప్రదాయంకోసం, డబ్బుకోసం కాదు!" అన్నారు మీనాక్షి అమ్మాళ్. ఆవిడ కంఠధ్వనిలోని తత్తరపాటు, కలవరం గమనించారు స్వామినాథన్.

"ఓహో, అంటే, చిల్లరగా దీన్ని మీరు బిందెలో వెయ్యాలి! అన్నారు స్వామినాథన్.

ఐదురూపాయల నోటూ, చిల్లరా చేతులు మారాయి; రూపాయల నాణేలు బిందెలోకి వెళ్ళాయి.

యువ దంపతులు పద్మ, రాజన్ పీటలమీద కూర్చున్నారు, ఆరతి పుచ్చుకున్నారు; కొత్త బట్టలు ధరించారు; తల్లిదండ్రులని నమస్కరించారు.

"మామీని నమస్కరించండి!" అన్నారు స్వామినాథన్. రాజన్, పద్మ లోపలికి మీనాక్షి అమ్మాళ్ ని నమస్కరించారు.

ఆవిడ దీవించిన ధోరణి చూసి అక్కడ ఉన్నవాళ్ళందరూ నవ్వుకున్నారు.

"పెద్దలు దీవించడం వింటే చాలు, చెవులకి ఇంపుగా ఉంది!" అన్నాడు రాజన్.

తక్షణమే నవ్వులాట  అణగిపోయింది; బాణా సంచా తన వెలుగును గభీమని కోల్పోయినట్టనిపించింది.

** ** **

"అమ్మా, సీతాలక్ష్మీ, నేను వీళ్ళతో కాశీకి వెళ్తాను. నన్ను పంపించేయ్!" అని మీనాక్షి అమ్మాళ్ వేడుకుంది.

"మామీ, ఇదేంటి, ఎందుకు గభిమని ఈ ఆలోచన మీకు వచ్చింది?" అని సీతాలక్ష్మి ఆశ్చర్యపడింది.

"నాకు మరెప్పుడు తోడు దొరుకుతుందో తెలియదమ్మా! నా చెయిలో ఏదో కొంచెం డబ్బుంది. నేను వెళ్తాను. మీ ఆయనతో ఏర్పాటు చెయ్యమని చెప్పు!"

సీతాలక్ష్మి భర్తకి చెప్పింది:

"ఆ రామసామి అయ్యర్ కుటుంబంతో తను కాశీకి తప్పకుండా వెళ్ళాలని ఆవిడ అంటున్నారు. దీపావళి పండుగ దినంనుంచి ఆవిడ మనసులో ఒక మార్పు వచ్చినట్టుంది. ఇంతకీ మా ఇద్దరిమధ్యా జగడమంటూ ఏదీ లేదు. దీపావళి సమయంలో నాకున్న ఆరాటం వలన నేను ఆవిడతో కొంచెం కఠినంగా మాటాడాను. అందుకేనా ఈ కోపం?  మాటమాటకీ ఆవిడ సణుగ్గుంటే మనం చేసేది ఏముంది? ఆవిడకి ఇష్టం లేదంటే మనం బలవంతం చెయ్యవద్దు!"

ఆవిడ మరో సంగతికూడా చెప్పింది.

"భర్తపోయి రెండు సంవత్సరాయ్యాలంటే ఆవిడ ఇప్పుడు కాశీకి వెళ్ళి మొక్కు చెల్లించాలా? సరేలే, ఆవిడ ఇష్టం! వాళ్ళతో ప్రయాణంకి చెయ్యడానికి నేను ఏర్పాటు చేస్తానని చెప్పు!" అని అన్నారు స్వామినాథన్.

రామసామి అయ్యరు ఇంటినుంచి ఒక అబ్బాయి - బాబు - పెద్ద చదువుకి కాశీకి వెళ్తున్నాడు. అతనితో అతని అత్తకూడా వెళ్తోంది; మీనాక్షి అమ్మాళ్ వాళ్ళ ప్రయాణంలో కలుసుకుంది.

"పద్మా, వస్తానమ్మా! నువ్వు అత్తగారింటికి వెళ్ళినతరువాత నేను ఈ ఇంట్లో ఎలా ఉండగలను, చెప్పు? మళ్ళీ తోడు దొరుకుతుందా అని ఎవరికి తెలుసు? అందుకే నేను ముందుగా వెళ్తున్నాను. నువ్వు దీర్ఘసుమంగళిగా వర్ధిల్లాలి! సీతాలక్ష్మి, వస్తాను!" అని చెమ్మగిల్లిన కళ్ళతో, మరేం మాటలు అనలేక, మీనాక్షి అమ్మాళ్ వీడ్కోలు చెప్పింది.

"మామీ, వీలయితే, బాబు అత్త తిరిగి వస్తున్నప్పుడు మీరూ రావచ్చుగా?" అని అన్నారు స్వామినాథన్.

"చూద్దాం, అంతా దేవుడి దయ!" అని అంటూ మీనాక్షి అమ్మాళ్ బండెక్కింది.

ప్రస్తుతం రైలు ప్రయాణికులలాగ అన్ని వసతులతో మీనాక్షి అమ్మాళ్ ప్రయాణం చేస్తునట్టు స్వామినాథన్ దంపతులు గుర్తుచేసుకున్నారు. కాని వెనకటి రోజుల యాత్రికులలాగ ఆవిడకి ఏమైనా జరిగిందా అనే భయం వాళ్ళకి కలిగింది. రోజులూ, వారాలూ గడిచాయి. మీనాక్షి అమ్మాళ్ దగ్గరనుంచి ఉత్తరమంటూ ఏదీ రాలేదు.

ఈ ఊరునుంచి కాశీకి వెళ్ళిన బాబు, అతని అత్త తమిళదేశంలో నివసించినవారు - ఇక్కడ బంధువులున్నారని వచ్చి, రెండు మూడు రోజులు ఆగి ప్రయాణం సాగించారు. అందువలన స్థానిక రామసామి అయ్యరు కుటుంబంని అడిగితే వాళ్ళకీ ఏ వివరాలూ తెలియవని చెప్పారు.

"చూసారా, ఆవిడ మనసు? తప్పకుండా ఆవిడ ఉత్తరం రాస్తారని మనం ఎదురుచూసాం, రాలేదు! మనం రాయాలంటే ఆవిడ ఎడ్రసు తెలియదు! ఇక మనం చేసేదేముంది?" అని సీతాలక్ష్మి భర్తతో మొరబెట్టుకుంది.

"నాన్నగారూ, నన్ను మామి 'మీ ఇంట్లో మీ అక్కయ్య - బావగారి ఫోటో ఉందా?' అని అడిగారు" అని కూతురు లలిత స్వామినాథన్ కి చెప్పింది.

" విన్నారా? ఇందులో కపటం ఎందుకు? సూటిగా మనల్ని అడిగితే ఏం పోయింది? ఉంటే ఉందని చెప్తాం, లేకపోతే లేదంటాం, అంతేకదా?" అంది సీతాలక్ష్మి.

"అది సరేలే, కాని ఆవిడకి ఆ ఫోటో కాపీ మనం ఇస్తామా? 'వంటమనిషికి అదెందుకు?' అని అడుగుతాం! ఇంటిలో కాపీ ఉందా అని తెలుసుకున్నతరువాత మనల్ని అడగాలని ఆవిడ ఉద్దేశం కాబోలు!" అన్నారు స్వామినాధన్.

"అదేంటో, ఆవిడ మన ఇంట్లో వంటమనిషిగా మెలగలేదు . . . ఇంతకీ మనం చాలా మర్యాదతో . . . " అని సీతాలక్ష్మి ఆరంభించింది.

"మొదటినుంచే ఆవిడలో వంటగత్తె పోలికలేవీ కనిపించలేదనే చెప్పాలి. అందుకే ఆవిడంటే నాకు చాలా మర్యాద" అన్నారు స్వామినాధన్.

"అవును. కాని దీపావళి తరువాత ఆవిడ స్వభావం బాగా మారిపోయింది! నేను కొంచెం అధికారం చెలాయించడంతో ఆవిడకి బాధ కలిగిందేమో? ఆ తరువాత ఆవిడలో సహజభావం పూర్తిగా పోయింది!" అంది సీతాలక్ష్మి.

అందరూ మీనాక్షి అమ్మాళ్ గురించి ఏ వార్తా తెలియక కలవరపడ్డారు.

"మామా, మా ఇంటికి ఈ ఉత్తరం వచ్చింది!" అని అంటూ రామసామి ఇంటినుంచి ఒక అబ్బాయి వచ్చి స్వామినాధన్ కి ఒక కార్డు అందించాడు.

కాశీకి వెళ్ళిన మీనాక్షి అమ్మాళ్ గంగానదిలో పడి మరణించారు. కావాలనే గంగానదిలో ఆవిడ దూకి ఆత్మహత్య చేసుకున్నారా అని అనుమానం చోటుచేసుకుంది. ఏం, ఎందుకు? చావడానికి ముందు ఆవిడ పదిరూపాయలకి ఒక చిన్న చెంబు కొన్నారట. "ఇది నా కొడుకు, కోడలికి చేర్పించండి!" అని చెప్పారట.

"మరి మీకు కొడుకూ, కోడలూ ఉన్నారంటే మీరెందుకు కాశీలో ఉంటున్నారు?" అని ఎవరో అడిగితే ఆవిడ ఒక విచిత్రమైన జవాబు చెప్పారట.

యౌవనంలో, పదిహేను, పదహారు వయసులో తల్లిదండ్రులతో దెబ్బలాడి ఇంటినుంచి పారిపోయిన తన కొడుకు ప్రస్తుతం ఒక మంచి కుటుంబంలో అల్లుడుగా ఉన్నాడని తెలుసుకొని ఆవిడ చాలా సంతోషించారు.

'మంచి ఆర్థికస్థితిలో ఉన్న తల్లికే తన కొడుకూ, కోడల మధ్య జీవితం గడబిడగా ఉంది. కోడలుంటున్న పుట్టిల్లులో నేను వంటగత్తెగా పనిచేస్తున్నాను; ఏ ముఖం పెట్టుకొని నేను వాళ్ళతో సహజంగా మెలగగలను?" అదే ఆవిడ ప్రశ్న.

మీనాక్షి అమ్మాళ్ సందేశం ఇది:

"నా అబ్బాయి ఆదాయంలో నాకు వచ్చినది ఐదు రూపాయలు; అది నాకు వాడే తన చెయితో ఇచ్చాడు. ఇదిగో, నా దగ్గరనుంచి ఐదు రూపాయలు! నా మనసార ఒక బహుమతిగా వాళ్ళకి ఈ పవిత్ర చెంబు ఇవ్వాలని నా ఆఖరి అభిలాష!"

'అయ్యో పాపం', 'ఎంత శోచనీయం!', 'ఎంత అన్యాయం!', 'ఏం ఆశ్చర్యం!' అని అందరూ సానుభూతి చూపారు.

'మా ఆయన తల్లి అనే హోదా ఆవిడ మనసులో ఎప్పుడూ ఉంది! నా పొగరు, దుడుకుతనం ఆవిడ అందుకే భరించలేకపోయారు!" అని పద్మ గుర్తుచేసుకుంది.

"'వియ్యంకులెవరూ లేరు, పద్మకి అత్తగారు లేరు!' అని సంతోషపడుతున్నట్టు నేను ఎన్నిసార్లు అన్నానో, అది విని ఆవిడ ఎంత బాధపడ్డారో? రాజన్ తన కొడుకని ఆవిడకి ఎప్పుడు తెలిసిందో? " అని సీతాలక్ష్మి కంపించిపోయింది.

"దీపావళి తరువాత ఆవిడలో మార్పు వచ్చిందని నువ్వు అన్నావుకదూ? దీపావళి సమయంలోనే తెలిసివుండాలి!" అన్నారు స్వామినాథన్. అతనూ తల్లిప్రేమకి పెద్ద దెబ్బ కలిగిందని తెలిసి వాపోయారు.

"బావగారు ఎందుకు తల్లిని గుర్తుపట్టలేదు?" అని పిల్లలు అడిగారు. పెద్దలు మారడం సహజం. పిల్లలు గబగబమని ఎదుగుతారు. పిల్లలు పెద్దలని అనవాలు పట్టడం సులభం.

కాని తల్లి ప్రేమ, కన్నకొడుకుగురించి పాత జ్ఞాపకాలు - వీటి మూలంగానే మీనాక్షి అమ్మాళ్ తన అబ్బాయిని అనవాలు పట్టుకొనివుండాలి. మామి తన జీవితమంతా నలగుతూనే, శ్రమతో గడిపారు, బాగా మారిపోయారు. అందుకే అల్లుడుగారు తల్లిని గుర్తించలేదని స్వామినాథన్ అన్నారు.

"నీకు జ్ఞాపకం ఉందా? 'పారిపోయిన కొడుకు తిరిగి రావాలని అతన్ని అల్లుడుగా భావించి అన్ని మర్యాదలూ చేస్తున్నాం!' అని నేను ఆ రోజు అనలేదూ? ఇప్పుడో? రాజన్ మనకి అల్లుడా లేక మీనాక్షి అమ్మాళ్ ఆబ్బాయా?" అని స్వామినాథన్ నవ్వుతూ అడిగారు.

"పాపం, అల్లుడుగారుకి తెలుస్తే . . . " అని అంది సీతాలక్ష్మి.

అతనికీ త్వరలో కబురు పంపడం అయింది; అతను ఆ పవిత్ర చెంబుని భక్తితో అందుకున్నాడు. ఆ బహుమతిని తను పూజ చేసే మందిరంలో పెట్టాడు. ఆ తల్లి అతని మనసులో స్థిరంగా ఒక పవిత్ర స్థానం ఆధీనం చేసుకుంది. ఆ చెంబులోని పవిత్ర గంగా జలంలాగ - అతని మనస్సు తన తల్లిని కలుసుకున్న ఘటన, ఆవిడ ఆఖరికి తనకిచ్చిన కానుక - ఆ జ్ఞాపకాలన్నీ తనలో భద్రపరచుకుంది.

గంగా నిర్ణీత కాలమూ ప్రవహించే ఒక మహానది. కాని దీపావళినాడు అందరూ ఆ గంగానదిలో స్నానం చేసినట్టు ఒక భావన కలిగించే శక్తి ఆ నదికి ఉంది. అలాగే రాజన్ మనసులో ఆ భక్తి స్థిరంగా చోటుచేసుకుంది.

“అమ్మని తలుచుకుంటే చాలు, నా కళ్ళనుంచి గంగానది ప్రవహించి నా మనసునీ, దేహాన్నీ స్నానంలో ముంచేస్తుంది!” అని అంటున్నాడు రాజన్.

“గంగా స్నానం అయిందా?[2]” అని ఎవరడిగినా రాజన్ ఇచ్చే జవాబు అది.

అతని జీవితంలో దీపావళి దినం మనశ్శాంతిని కాల్చే దినం.

ఆ టపాసుకి ధ్వని ఉంది; కాంతి కూడా ఉంది. కాని దానికి నిప్పు అంటించడమంటే ఎవరూ ఇష్టపడరు; అతని హృదయం పేలవడం ఎవరికీ ఇష్టం లేదు.

అవును, గుంటె గుబేలుమనే ఆ టపాసు వద్దు!

********

**(మూలం ప్రచురణ స్వదేశమిత్రన్, అక్టోబర్ 30, నవంబరు 7, 1948)**

---

[2] తమిళులు సంప్రదాయంగా ఈ వాక్యం దీపావళి పండుగదినం పరివర్తన చేసుకుంటారు


மகான்

# ఆదివారం[1]

లలిత అంగడికి వెళ్ళినప్పుడెల్లా తనతోబాటు తన చిన్నవాడిని తీసుకొని వెళ్ళడం అలవాటు చేసుకుంది. అంగడి అంటే అదెక్కడో ఉందా? వాళ్ళింటి చుట్టూవున్న గోడకి సమీపంలోనే ఉంది. ఆ దుకాణంకి ఒక చిన్న తలుపు. చేతులతో ఇంటిపనులు చేస్తూనే లలిత అక్కడ తనకేం సరకులు కావాలో అవన్నీ కొంటుంది. ఆవశ్యకముగా ఏదైనా కావాలంటేనే లలిత వెళ్తుంది. "రారా, బాబూ!" అని పిల్లవాడిని పిలుస్తుంది. అలాగ కొన్ని సమయాలలో వెళ్ళిన తరువాతే కణ్ణన్ ఆ దుకాణం మీద తన చూపు విసిరాడు; మెల్లమెల్లగా నడిచాడు; తొంగి చూసాడు; వెనకాడాడు; ఆతురతతో నిలబడ్డాడు.

చురుకుగా కనిపించే బాలకుడిని చూస్తే పిలిచి మాటాడాలని ఎవరకనిపించదు? "ఇదిగో, తీసుకో!" ఇని అంటూ యజమాని పంచాక్షరం వాడికి ఒక మిఠాయి అందించారు. ఆతురత, సంకోచం కలిసిరావడంతో అబ్బాయి కదల్లేదు; పంచాక్షరం తలుపు తెరిచి, బయటకి వచ్చి, వాడి చెయిలో ఒక చాకలెట్టు పెట్టారు.

ఆరోజునుంచి పంచాక్షరం వాడికి 'అంకుల్' అనే బంధువులయ్యారు. ఆ తరువాత కణ్ణన్ తరచుగా అతన్ని కలుసుకోడం అలవాటు చేసుకున్నాడు. ఇందులో ఆశ్చర్యమేముంది? పిల్లలకి ధ్యానం తిండిలోనేకదా! అది ఎక్కడ దొరికితే అక్కడ తప్పకుండా మోహం ఉంటుంది. రోజువారీ అతను వస్తున్న దారిని చూస్తూ కణ్ణన్ నిలబడతాడు. వీళ్ళ ఇల్లు గడప దాటిన తరువాతే పంచాక్షరం వాడికి కనిపిస్తారు. అతను ఎడం పక్క నాలుగడుగులు నడిచివెళ్ళి దుకాణం వెనుకనున్న చిన్న తలుపు తెరుస్తారు; లోపల ప్రవేశించగానే ముఖద్వారాన్ని తెరిచి, దుకాణంని వ్యాపారంకి సిద్ధం చేసి ఎడం పక్క తిరిగి చూసారంటే కణ్ణన్ ఆశ్చర్యంతో నిలబడుతూ కనిపిస్తాడు. వెంటనే ఒక చిరునవ్వు నవ్వి వాడికేదో మిఠాయి అందిస్తారు.

కొన్నిసార్లు గభీమని అతను రానేరారు; అవాళ దుకాణం మూసేవుంటుంది. కణ్ణన్కి మిఠాయి దొరకదు. 'అంకుల్ ఎందుకిలాగ చేస్తున్నారు?' అని వాడికి యాతన

---

[1] కలైమగళ్ పత్రికలో 'వారాల కథలు' అనే శీర్షికలో బహుమతి అందుకున్న కథ

కలుగుతుంది.  ఇలాగ మూడుసార్లు నిరాశ అనుభవించిన తరువాత తాళలేక అతన్ని అడిగేసాడు.

“నువ్వు నిన్న ఎందుకు రాలేదు?” అని మొదటి ప్రశ్న వేసాడు.

“నిన్న ఆదివారం కదా, అందుకే రాలేదు!” అని పంచాక్షరం నవ్వుతూ అన్నారు.

“నువ్వు మాటిమాటికీ రావటం లేదు!”

“నేను మాటిమాటికీ రావటం లేదా? ఆదివారం నాకు శెలవు; తక్కిన రోజులన్నీ వస్తాను.”

“అంకుల్, ఇక రోజు వస్తావా?”

“ఆరు రోజులు వస్తాను. ఆ తరువాత ఆదివారం వస్తుంది; అవాళ రాను; ఆ తరువాత మళ్ళీ వస్తాను.”

“ఎందుకీ ఆదివారం? వద్దు! . . . ”

“నాకు కావాలే?”

“వద్దు! నువ్వు రోజు రావాలి.”

“మీ నాన్నగారు నిన్న ఆఫీసుకి వెళ్ళారా? నిన్న మధ్యాహ్నం మీ నాన్నగారు ఇంట్లో నిద్రపోలేదు?”

“నిద్రపోయారు; నేనూ అతనితో నిద్రపోవాలని వెళ్ళాను. నన్ను పొమ్మన్నారు.”

“పాపం, అతను రోజు ఆపీసుకి వెళ్తున్నారుకదా? ఒక రోజైనా ఇంట్లో ఉండవద్దా? నాకూ శెలవు కావాలి; ఒకరోజు మా ఇంటిలో ఉండాలి.”

“ఇదేకదా ఇల్లు?”

“ఇదే నా ఆపీసు. ఆదివారం - ఒక రోజు మాత్రం - నేనిక్కడికి రాకూడదు. తక్కినరోజులన్నీ వస్తాను, నీకు మిఠాయి ఇస్తాను.”

అది చాలు, అప్పటికి కణ్ణన్కి తృప్తి కలిగింది. ఆ దుడుకైన ఆదివారం పేరు పలకడం వాడికి అసాధ్యమైనా, ఆ పదం వాడి భావనలో బాగా స్థిరపడిపోయింది, చికాకుపెట్టింది.[2] మరి, తృప్తి ఎలాగ చోటుచేసుకుంటుంది?

---

[2] తమిళంలో ఆదివారంకి ***జ్ఞాయిట్రుక్కియమై*** అని పేరు; దాని ఉచ్చారణ పిల్లలకి సులభంగా రాదు.

వాడు తల్లిని మాటమాటికీ "అంకుల్ ఇవాళ ఎందుకు రాలేదు?" అని అడిగినప్పుడెల్లా లలిత ఆ పదం కారణంగా చెప్పింది; వాడు నమ్మలేదు, ఒప్పుకోలేదు. కాని ఇప్పుడు అంకుల్ అదే కారణం చెప్పినతరువాత 'సరే కాబోలు!' అని రాజీపడవలసి వచ్చింది. ఆ పదం తరచుగా వాడు వినడమూ జరిగింది, కాని దాని ముఖ్యత గ్రహించలేదు. మరి ఇప్పుడో? అది మళ్ళీ వచ్చేస్తుందేమో అని భయం పట్టుకుంది!

'ఇక అది రాదు! అంకుల్ రోజూ వస్తున్నారే?' అని కణ్ణన్కి నమ్మకం కలిగింది. కాని, అయ్యో, మళ్ళీ ఒక రోజు అతను కనిపించలేదు!

"ఎందుకురా ఎంతసేపూ అలాగ గడప దగ్గర నిలబడతావ్? ఇవాళ అంకుల్ రారు!" అని గుండు పేలినట్టు వాడికి తాతగారు చెప్పారు.

"ఏం, ఎందుకు రారు?"

"ఇవాళ ఆదివారం కదా? ఈ రోజు దుకాణం బంధ్!"

కణ్ణన్ ఉలికిపడ్డాడు; నోటినుంచి మాట పెగల్లేదు.

"రేపు వస్తారు . . . అదిగో, విను . . . " అని గొంతు సవరించుకొని తాతయ్య మనవడి చెవులో గుసగుసలాడారు: "నాయనమ్మ కొబ్బరికాయ గీకుతోంది. వెళ్లు!"

కణ్ణన్ పరుగెత్తాడు; నాయనమ్మ తురుమడం ముగించి కత్తిపీటని కడిగే సమయంలో చేరుకొని "కొబ్బరికాయ్!" అని కేకలు పెట్టి చెయి చాచాడు.


"ఎవర్రా నీకు చెప్పారు?"

"తాతగారు . . . నాకియ్!"

"ఉండు, ఉండు, . . . నామీద పడకు! ఇస్తానులే . . . అబ్బా, ఏం తొందర!" అని అంటూ ఆవిడ మనవడికి ఒక గీకు అందించారు.

"ఇంకా కావాలి. ఇంకా . . ."

"చాలురా . . . కడుపు నొప్పి వచ్చేస్తుంది . . . మీ నాన్న భోజనంకి వచ్చేస్తాడు, అల్లరి చెయ్యకు, వెళ్ళు . . . ఈ ఆదివారంకూడా తొందరపడకుండా వండుదాం అంటే అదీ చేతకాదు . . . హూం . . . "



ఆవిడ మాటలు విని, ఆవిడ ఏమంటున్నారని ఆలోచిస్తూ కణ్ణన్ ఆటాడానికి వెళ్ళిపోయాడు.

ఆ మరునాడు అంకుల్ని మళ్ళీ అడిగాడు: "నువ్వెందుకు రాలేదు?" వాడికి ప్రత్యేకంగా 'నిన్న' అని లేక 'రేపు' అని అడగాలేమో అనుమానం కలిగింది; అందుకే అలాంటి ప్రశ్న వేసాడు.

"నాయనా, నాకు నిన్న శెలవు!" అని బ్రతిమాలుతున్నట్టు పంచాక్షరం అన్నారు. ఇవాళ మళ్ళీ వాడడిగిన ప్రశ్నలకి అతను జవాబు ఇవ్వాలి!

క్రిందటి వారంలాగే అతను వాడికి వివరించి చెప్పాలనుకున్నారు; కణ్ణన్ని దుకాణంలోకి రమ్మని పిలిచారు. వాడిని పక్కన పెట్టుకొని కొంచెంసేపు ఆలోచించారు. సోమవారంతో ఆరంభించి, ఏడు వారాల పేర్లు పలుకుతూ వాడినీ వల్లించమన్నారు. ఆ తరువాత మేజామీదున్న గాజు జాడీలని జాగా మార్చుతూ మాటాడారు:

"ఏదీ, నాతోకలిసి వల్లించు, చూద్దాం! సోమవారం, ద్రాక్ష; మంగళవారం, వేరుశెనగ బెల్లం ఉండ; బుధవారం, బిస్కట్టు; గురువారం, వెన్న; శుక్రవారం, పెప్పర్మెంటు; శనివారం, చాకలెట్; ఆదివారం, ఏమీ లేదు!" అని ముగించారు. వాడికది బోధపడలేదు, కాని ఆ పాఠం చెప్పితీరాలని ప్రయత్నించాడు; అతనూ బలవంతం చెయ్యలేదు. అవాళ వాడి చెయిలో ద్రాక్ష పెట్టి ఇంటికి పంపించారు. ఆ తరువాత అలాగే ప్రతీ రోజూ ఏదో ఒకటి అందించారు. శనివారం ఒక చాకలెట్ ఇచ్చి "ఇవాళ సాయంకాలం రా!" అన్నారు. కణ్ణన్ మరవకుండా వెళ్ళాడు. వాడికి రోజూ నాలుగుసార్లు ఆ దుకాణంకి వెళ్ళడం అలవాటే కదా? "ఇది రేపు పొద్దున్నే తిను. రేపు ఆదివారం కదా, నేను రాను! ఇదిగో!" అని అంటూ రకరకాలుగా ఐదారు మిఠాయిలు ఇచ్చారు. "సరే, అంకుల్!" అని అతని ఎదుట తలూపి, ఇంటిలో కుడిపక్కన, సెమెంటు వసారాలో కూర్చొని కణ్ణన్ ఒకే ఒక మిఠాయి రుచిచూసాడు. ఆ తరువాత ఇంకొకటి; ఆ తరువాత ఇంకొకటి; మూడవసారి వాడు తింటూంటే మల్లెపువ్వులకోసం అక్కడకి వచ్చిన లలిత పిల్లవాడిని చూసి గాబరాతో "ఏంట్రా, అతను వీకు మిఠాయిలు సాయంకాలంకూడా ఇస్తున్నారా?" అని అడిగింది.

"రేపు ఆదివారం!"

"ఓహో," అని లలిత నవ్వేసింది. నవ్వింది కాని మనసులో ముల్లు గుచ్చినట్టనిపించింది. 'పాపం, పంచాక్షరం మన పిల్లవాడికి చనువు చూపిస్తున్నారేమో?' అని అనుమానం కలిగింది. వాళ్ళ ఇంటి కారు షెడ్డు అతనికి అద్దెకి ఇచ్చారు. కణ్ణన్ వాళ్ళింటి అబ్బాయి. ఆ మేలుని తలచుకొని అతను వాడికి ఇస్తున్నారా? ఎందుకు? అతను నెలా తప్పకుండా అద్దె అని 25 రూపాయలు ఇస్తున్నారే? కూలి లేకుండా అతను కణ్ణన్కి ఇచ్చేది అల్పం కాబోలు! కాని అటువంటి కృప రోజూ జరుగుతుంటే ఏమీ అనక ఊరుకోడానికి తనకి హక్కు ఉందా?

"ఇక అంగడికి వెళ్లకు!" అని అబ్బాయిని ఆపడం సులభం; ఐతే దుకాణంకి రేపు శెలవని అతను ఇవాళే ఇచ్చేసారు! ఆ అభిమానం పాడు చెయ్యడమా?

"సరేలే, నువ్వు అంకుల్ని బాగా గుంజుకున్నావ్!" అని వాడిని లాలించుతూ "ఇది రేపు తిను!" అని మిగతా మూడు మిఠాయిలు లలిత లాగ్గొని, తనవశం చేసుకుంది.

మరుదినం కణ్ణన్ ఆ మిఠాయిలు తిన్నాడు. కాని తిన్నట్టు అనిపించలేదు; మనసుకి తృప్తి లేదు.

ఇదేకదా ప్రకృతిలో సహజం? మొట్టమొదట తిండి కావాలి; అది దొరికితే అది మళ్ళీ దొరకనంతవరకూ తిండిగురించి గుటి లేదు! ఆకలని వస్తే, తిండి తప్పిస్తే మరేం లక్ష్యం లేదు.

అంకుల్ దగ్గర తిండి దొరికిన కొత్తలో కణ్ణన్ శ్రద్ధ అంతా భోజనం మీదే. ఆ తరువాత అతను చూపిన ప్రేమ, స్వాభిమానం ఆ మిఠాయిలకంటే వాడికి మేలుగా కనిపించాయి. ఈ ఆదివారం, పొద్దున్నే తనకి మిఠాయి దొరికింది, కాని అంకుల్ రాలేదే? అంగడి తలుపు తాళం భయంకరంగా కనిపిస్తోంది!

'ఎందుకీ ఆదివారం వస్తోంది? ఛీఛీ, అది వద్దు! అది రాకూడదు!' అని చికాకుకూడా కలిగింది.

ఆదివారమని వస్తే ఆ రోజు గమనంలో ఏదో మార్పు చోటుచేసుకోవడం కణ్ణన్ మెల్లమెల్లగా గమనించాడు. "ఇవాళ టపా లేదే? ఉత్తరం రేపు వస్తుందేమో?" అని నాన్నగారు నాయనమ్మకి చెప్పడం వినగానే "ఇవాళ ఆదివారం!" అని అరిచాడు.

"విన్నావా, వీడికన్నీ తెలుసు!" అన్నారు నాన్నగారు.

"పంచాక్షరం అంకుల్ ఇవాళ రాలేదని వీడికి తెలిసినట్టుంది . . . ఏదీ, బాబూ, అంకుల్ నీకు నేర్పించిన 'ఆ సోమవారం - ద్రాక్ష . . . ' వల్లించు, చూద్దాం!" అని లలిత ముద్దాడింది; కణ్ణన్ మరేం అనకుండా వీధిలోకి పారిపోయాడు.

ఎదురింటిలో ఒక అంకుల్ ఉన్నారు. అతను రోజూ ఒక నల్ల కోటు తొడుక్కొని హాయిగా కారులో వెళ్తారు; ఈ రోజుమాత్రం వెళ్ళరు; వెళ్ళినా నల్లకోటు వేసుకోరు. ఆ కారులో మళ్ళీ ప్రయాణం చెయ్యాలని కణ్ణన్కి ఆశ! అవును, ఒకసారి వెళ్ళాడు; ఆ రోజే వాడికి తమ్ముడు పాప పుట్టాడు. వెళ్లినప్పుడు అమ్మని చూడాలని వాంఛ; ఇంటికి తిరిగివచ్చినప్పుడు అమ్మని అంటికొనివున్న పాపని చూసి దుఃఖం; కారు సవారి నచ్చిందా? తమ్ముడు పాపని చూసి జాలి కలిగింది; మిఠాయికి తనతో పోటీకి రాడు; వీడిచ్చినా "వద్దు!" అని అందరూ అడ్డగిస్తున్నారే?

నాన్నగారుకూడా తమ్ముడు పాపని ఆదివారం మాత్రం ఎత్తుకుంటారు. అవును, ఆ రోజు అతను ఆఫీసుకి వెళ్ళరు; అంకుల్ చెప్పినట్టు నిద్రపోతారు. నిద్రలేచిన తరువాత వేడివేడిగా దోశెలు తింటారు. నాయనమ్మ కూడా ఏదో అంటుందే? . . . ఓహో, (ఇప్పుడు కణ్ణన్కి జ్ఞాపకం వచ్చింది!) తన కళ్ళు బాగుండాలని నాయనమ్మకి ఏదో వ్రతమట! ఆదివారం రాత్రి భోంచెయ్యదు. సాయంకాలం దోశలు తిని "నాకిది చాలు!" అని లేచిపోతుంది. తాతగారికి ఇవేవీ లేవు. అతనెప్పూడూ ఒకేలాగుంటారు. ఆదివారం వస్తే అన్నయ్య "నాన్నగారూ, రండి, ఇక్కడకి వెళ్దాం! అక్కడకి వెళ్దాం!" అని తొందరపెడుతుంటాడు; అమ్మకూడా అప్పుడప్పుడు నాన్నతో దెబ్బలాడుతుంది . . .

ఈ రోజు మాత్రం ఎందుకిలా వేఋగా ఉంది? తరచుగా, అంటే ఆరురోజులకొకసారి, అది వస్తోంది. తక్కిన రోజుల్లోనూ కొన్ని మార్పులు కనిపిస్తున్నాయి, కాని ఆదివారం మాత్రం ఎందుకు ముఖ్యంగా కొన్ని సూచనలు కనిపిస్తున్నాయి?

కణ్ణన్కి ఇవేం సరిగ్గా అర్థం కాలేదు; కాని తప్పకుండా ఇదొక సరసమైన విషయం అనిమాత్రం గ్రహించాడు. వాడికున్న మితమైన అవగాహనలో తరచుగా సంభవించే దైనిక ఘటనలు - వర్షం, చలి, ఎండ - ప్రకృతిలో సహజంగా కలిగే మార్పులగురించి - ఎటువంటి ఆలోచనా చోటుచేసుకోలేదు. మనసులో వాటిగురించి ఏదో ఆతురత,

అనుమానం కలిగినా ఆ అగ్నికణం తీవ్రంగా పెరగడానికి ఇంకా కొన్ని రోజులు పోవాలి. ఇప్పుడు వాడికి ప్రత్యక్షంగా కనిపించేది ఈ ఆదివారంలోని అంశం మాత్రమే!

'పిల్లవాడు కణ్ణన్ ఎదుగుతున్నాడు, వాడి లోకజ్ఞానం విశాలమవుతోంది!' అని రూఢీ చేస్తున్నట్టు ఒక పెద్ద మార్పు త్వరలో వచ్చింది. నాన్నగారు శెలవు తీసుకొని కణ్ణన్, వాడి అన్నయ్య, అమ్మతో ఒక ఊరుకి వెళ్ళారు. అక్కడకూడా ఒక తాత, అవ్వ, అంకుల్, ఆంటీ ఉన్నారు. వాళ్ళందరినీ ఇంతకుముందు ఎక్కడో చూసినట్టు కణ్ణన్కి అనిపించింది. కాని "వీళ్లెవరు? ఇదేం ఊరు? ఇల్లూ, వీధీ కొత్తగా కనిపిస్తున్నాయే?" అని భయమూ కలిగింది.

ఒక రోజు లలిత మాటవరుసలో "మనం ఎప్పుడు ఈ ఊరుకి వచ్చాం?" అని తనలో తనే మాటాడుకుంటూ కాలెండరిని చూసి "ఈ మంగళవారంకి ఒక వారం!" అని అనగానే కణ్ణన్ "మరేం అనవద్దు, నేను ఏడుస్తాను!" అని బతిమాలాడు. వాడి మనసులో ఆరాటం; అది ఎవరికీ తెలియలేదు.

"మేం సోమవారం పొద్దున్నే ఊరు చేరుకుంటాం. కణ్ణన్ నాన్నగారు పదిగంటలకి ఆపీసు వెళ్ళాలి" అని లలిత అనగానే కణ్ణన్ "నేను అంకుల్ దుకాణంలో ద్రాక్ష తింటాను!" అన్నాడు.

"ఏంరా, నువ్వది మరిచిపోలేదన్నమాట! మనం ఊరుకి వెళ్ళగానే తాతయ్య, నాయనమ్మతో అన్ని కబుర్లు చెప్పవద్దూ? అంకుల్ని చూడాలని గడపదగ్గర నిలబడితే ఎలాగ? ఈ తాత, అమ్మమ్మ కొని ఇచ్చినవన్నీ అందరికీ చూపవద్దూ?"

"తప్పకుండా! అంకుల్కి చూపిస్తాను!"

"తాతగారూ, నాయనమ్మకి చూపిస్తావా?"

"హూం!" అని మాత్రం కణ్ణన్ అన్నాడు: 'పోనీ, వాళ్ళూ చూడనీ!' అని మనసులో అనుకున్నాడు, అంతే.

అందరూ ఊరు తిరుగు ప్రయాణంకి సిద్ధమైయ్యారు. ఇల్లు చేరుకునే సమయం కణ్ణన్ "అంకుల్ నాకు ద్రాక్ష ఇస్తారు!" అన్నాడు. "ఒరేయ్, ఇవాళ ఆదివారం. అతను రారు; రేపు వస్తారు," అని నాన్నగారు అన్నారు.

"మనం రేపు పొద్దున్న రావాలనేకదా ప్లాను వేసాం?" అని లలిత భర్తని అడిగింది.

"హూహూం, బాగా చెప్పావ్! అంత సులభంగా పుట్టిల్లు వదలుకోడం నీకు చేతకాని పని! అదీ నేనూ మీ ఇంటిలో ఉన్నప్పుడు, అవునా? నేను కేకలు పెట్టినతరువాతేకదా నువ్వు బయలుదేరావ్? రాత్రంతా రైలులో నిద్రపోకుండా నేను ప్రయాణం చెయ్యాలని నువ్వు ఆలోచించావా? ఊరు చేరుకున్నతరువాత, మధ్యాహ్నం రెస్టు లేకుండా ఆపీసుకి నేను పరుగెత్తాలి!" అని అతను కోపం, సరసం కలిసిన కంఠధ్వనితో అన్నారు. కణ్ణన్ మనసులో అంకుల్ లేనిరోజు వచ్చామనే బాధ; కాని 'మనింటికి వచ్చేసాం!' అనే సంతోషమూ కలిగింది.

నాయనమ్మ, తాతగారు కుశలప్రశ్నలు వేసారు. కణ్ణన్ నడిచి వెళ్తున్న దిక్కుని చూసి నాయనమ్మ "ఒరేయ్, ఇవాళ అంకుల్ రారు; రా, నేను నీకు భక్షణం ఇస్తాను. నీకోసం చేసాను" అని పిల్లవాడి చెయికి నాలుగు వేపుడు ముక్కలు అందించింది.

నమలుకుంటూ కణ్ణన్ నడిచాడు; దుకాణం చేరుకొని తలుపుదగ్గర నిలబడ్డాడు. పక్కనేవున్న చెట్టులో ఇప్పుడు చాలా పళ్ళు కనిపించాయి. తను ముందు చూసినప్పుడు అవేవీ లేవే? చాలా రోజులతరువాత ఆ చెట్టు చూస్తున్నాడన్నమాట!

దగ్గఱలో కాలడుగులు వినిపించాయి; అంకుల్ వచ్చేసారు.

"ఏంరా కణ్ణా?" అన్నారు అతను; ఏమనాలో తెలియక కణ్ణన్ జంకుతూ అతన్ని చూసాడు.

"ఒక నెలలో అన్నీ మరిచిపోయావా?" అతని కంఠధ్వనిలో నిరాశ చోటుచేసుకుంది.

"అంకుల్, ఇవాళ ఎందుకు వచ్చావ్?"

"నువ్వు వస్తావని వచ్చాను."

"అంకుల్, ఇవాళ నాకేం ఇస్తావ్?"

"అన్నీ ఇస్తాను; రా, లోపలికి రా!"

"ఇవాళ ఎందుకు వచ్చావ్?"

"ఓహో!" అని పంచాక్షరం నవ్వారు. "ఇవాళ ఆదివారంకదా అని అడుగుతున్నావా? రా, నీకన్నీ చెప్తాను!" అని పిలిచారు.

అది పిల్లలకందరికీ స్కూలు తెరిచే సమయం. దుకాణంలో వ్యాపారం చురుకుగా సాగుతోంది. కొత్త పుస్తకాలు కొనాలని పిల్లలు చెయిలో జాబితాతో వస్తూవుంటారు.

రోజంతా ఒకరితో ఒకరు పోటీ చేసుకొని అబ్బాయిలూ, అమ్మాయిలూ అన్ని రకాల ప్రశ్నలతో దండెత్తుతారు. వాళ్ళకి జవాబు చెప్పడానికి ఇదే మంచి తరుణం; మరి ఉత్తికే ఇంట్లో కూర్చుంటే ఎలాగ?

ఈ వివరాలన్నీ కణ్ణన్కి అనవసరం. వాడికి కావలసినది అంకుల్ అభిమానం, అది వాడికి అత్యంతంగా లభించింది. తను ఊరుకి వెళ్ళివచ్చిన కబుర్లన్నీ అంకుల్కి చెప్పాలని కణ్ణన్ తొందరపడ్డాడు, కాని అదేదో స్వల్పంగానే వాడి నాలికకి సాధ్యమైంది. 'అది చాలు!' అని తృప్తి పడుతూ అంకుల్ ఇచ్చిన ద్రాక్షలో కణ్ణన్ ఇల్లు చేరుకున్నాడు.

ఆ సోమవారం ద్రాక్షతో ఆరంభించిన సంతోషం సాగిందా? ఇంట్లో ఎన్నో మార్పులు; వాడి చిన్నాన్న అని ఒకతను (అతనికి ఛాయలో నాన్నగారి పోలిక ఉంది) కొత్తగా కనిపించారు. అతను కణ్ణన్ని 'అది ముట్టుకోవద్దు!', 'ఇది ముట్టుకోవద్దు!' అని తరచుగా మందలించుతుంచారు. ఇందులో సరసమైన ఒక సంగతి ఉంది. అతనూ ఎదురింటి అంకుల్ లాగ నల్లకోటు తొడుక్కొని కోర్టుకి వెళ్తారు. ఇంటిముందు నాన్నగారి పేరు రాసిన పలక ఉందే, దాని పక్కన అతని పేరులోనూ ఒక పలక ఉంది. బహూశా, అతను ఇంట్లో ఉండరు. ప్రతీదినం పొద్దున్నే ఎవరో ఒక పెద్ద వకీలు ఇంటికి వెళ్ళిపోతారు. 'అదీ మంచిదే,' అని వాడికనిపించింది. గభీమని ఒకరోజు ఒక మామీ, పాప వచ్చారు. "ఎవరీ మామీ?" అని కణ్ణన్ అమ్మని అడిగితే ఆవిడ "నేను మామీ కాదురా, నీ అత్త!" అని చెప్పింది. "నన్ను అత్త అని పిలవాలి, లేకపోతే నీతో మాటాడాను!" అని బెదిరించింది. అబ్బబ్బా, ఎంత గర్వం, ఎంత పొగరు! అత్త కూతురూ అలాగే! తమ్ముడు పాపని ఉత్తికే ఏడిపించుతుంది. కణ్ణన్ తమ్ముడ్ని వెనకేసుకొని ఏమైనా అంటే అత్త "ఒరేయ్, అది నీ పెళ్ళాంరా!" అని గట్టిగా నవ్వుతుంది!

ఇంట్లో గొడవగా ఉందని కణ్ణన్ కొన్నిసార్లు అంగడిలోనే ఉండిపోవడం అలవాటు చేసుకున్నాడు. కొన్నిసార్లు ఇంట్లో అందరూ తమాషాగా ఏమేమో మాటాడుకుంటారు, నవ్వుకుంటారు. ఎప్పుడు చూసినా సందడే!

ఒకరోజు వాళ్ళందరూ కలిసి "కణ్ణన్ని మనం స్కూల్లో చేర్పాలి!" అని నిశ్చయించారు. "ఒరేయ్, వెళ్తావా?" అని అడిగారు.

“వెళ్తాను,” అని అంటూ కణ్ణన్ సరదాగానే బయలుదేరాడు; అన్నయ్యవెంట నడిచాడు. కాని లలిత అన్నయ్య వెళ్ళిన దిక్కులో వెళ్ళకుండా దానికి ఎదుటిగా నడవడం చూడగానే కణ్ణన్కి భయం పట్టుకుంది; కాని అమ్మ దగ్గరే ఉందని ఊఅట కలిగింది. వీధి మలుపు రాగానే లలిత ఒక ఇంట్లో ప్రవేశించింది. ఒక గదిలో కొందరు పిల్లలు కనిపించారు. కొంచెం సమయం ఆగి లలిత “బాబూ, ఇదే మీ టీచరు! నువ్వు బాగా చదవాలి! టీచరు నీకన్నీ నేర్పుతారు,” అని చెప్పింది. టీచరుకూడా కణ్ణన్ చెయి పట్టుకొని అదే బోధన చేసారు.

“బాబూ, నేను వెళ్ళనా? నువ్వు కొంచెం సేపు ఇక్కడ ఉంటావా? టీచర్ నిన్ను ఇంటికి తీసుకొస్తారు” అని లలిత బతిమాలింది.

వాడి మనసులో ఏముందని ఎవరికీ తెలియనట్టు కణ్ణన్ గోడని ఆనుకుంటూ, తల్లిని ఏదోలాగ చూస్తూ “వెళ్ళు!” అని అన్నాడు. “Smart boy, అలాగుండాలి!” అని అభిమానంతో వాడిమీద ఒక చూపు విసిరి లలిత గడప దాటింది. అంతే, “ఓ!” అని ఏడుస్తూ పరుగెత్తుకొనివచ్చి కణ్ణన్ అమ్మని గట్టిగా కౌగిలించుకున్నాడు.

“ఒకరోజు నాతో మీ ఇంటికి వస్తే అలవాటైపోతుంది!” అన్నారు టీచర్.

దారంతా లలిత పిల్లవాడికి సముదాయించుతూ వచ్చింది. “ఆవిడ చాలా మంచి టీచర్, నువ్వూ స్కూల్లో కొత్తగా పిల్లలతో స్నేహం చేసుకోవచ్చు” అని చెప్పింది.

“అక్కడ అన్నయ్య లేడే?” అని కణ్ణన్ మొరబెట్టుకున్నాడు. తన బొటనవేలుని, చూపుడు వేలుతో కలుపుకొని చిటికలా ముద్ర చూపుతూ “స్కూలుకూడా ఎంత చిన్నది!” అని అన్నాడు. లలిత నవ్వుతూ నడిచింది.

“వాడూ నీతో వచ్చేసాడా?” అని అడిగారు తాతగారు. “కొత్త జాగా కదా?” అని అంది నాయనమ్మ; అందరూ నవ్వారు.

ఆ తరువాత రోజు లలిత వాడిని బలవంతంగా లాగ్గొని స్కూలుకి వెళ్ళింది. కణ్ణన్ తల్లితో ఇంటికి తిరిగిరాలేదు; ఆమెకి ఎనిమదడుగులు ముందే వచ్చేసాడు. లలిత జడ్డి నవ్వు నవ్వుతూ, చెయిలో పలకరాయితో పిల్లవాడి వెనుక నడిచింది. ఆ వచ్చే తోవలోనే పంచాక్షరం దుకాణం ప్రవేశద్వారం ఉంది. రోజువారీ అతను “ఒరేయ్, అల్లరి

చెయ్యకుండా వెళ్ళు!" అని అనడం, "ఓహో, ఇవాళకూడా స్కూలునుంచి తప్పించుకొని వచ్చేసావా?" అని అడగడం అలవాటైపోయింది.

కణ్ణన్ అతనిమాటలు పట్టించుకోకుండా త్వరగా నడుస్తాడు; వాడి గుటి అంతా ఇంటిమీదనే. ఇంట్లో అందరూ వాడిగురించే బెంగపెట్టుకుంటున్నారు.

ఒకరోజు సాయంకాలం పంచాక్షరం "నేను రేపు రాను. ఆదివారం," అన్నారు. ఇటీవల వ్యాపారంలో సందడి తగ్గుతూ వచ్చింది. అతనెందుకు శెలవు వదులుకోవాలి?

"ఎందుకు రావ్?"

"చాలామంది చదువుతేనే ఆదివారం దుకాణం తెరవాలి. నీలాగ మొద్దుగా చదవకుండావుంటే ఎవరూ పుస్తకాలు కొనరే?"

"చాకలెట్లు కొంటారే?"

"హూహూం, కొనరు. చాలామంది స్కూలుకి వెళ్తేనే నా దుకాణం తెరిచియుంటుంది. నువ్వెందుకు బడికి వెళ్ళటం లేదు?"

ఇలాగ మాటాడుతూనే అతను కణ్ణన్కి మెల్ల మెల్లగా బుద్ధి నేర్పించారు. వాడి ఆక్షేపణలని అడ్డగిస్తూ చదువుకున్న ఘనత, బడికున్న అంతస్తు వివరించి చెప్పారు.

క్రమక్రమంగా కణ్ణన్ మనసు మారుతూ వచ్చింది; తల్లితో బడికి వెళ్ళి, ఆమె లేకుండా అర్ధగంటలో పరుగెత్తుకొనిరావడంలో కొన్నిరోజులతరువాత తృప్తికరమైన మార్పు కానవచ్చింది.

"అంకుల్, నన్ను మురళీ అని అందరూ పిలుస్తున్నారు!" అని ఒకరోజు గర్వంగా చెప్పుకున్నాడు. "నాకివాళా, రేపూ శెలవు; ఇక సోమవారం స్కూలుకు వెళ్ళాలి!"

"భలే, భలే!" అని పంచాక్షరం ఘోషించారు. ఇప్పుడు కణ్ణన్కి తిండిగురించి శ్రద్ధ తగ్గిపోయింది. త్వరలోనే వాడి అభిరుచి వేరే వేరే దిక్కుల్లో మళ్ళింది.

ఆ రోజు ఆదివారం; కణ్ణన్ వకీలు చిన్నాన్న మధ్యాహ్నం భోజనంకి వచ్చారు.

"ఇదేం గొడవరా! ఇవాళ ఆదివారం , నువ్వు వేళకి మించిన వేళకి భోంచెయ్యాలా ఏమిటి? తక్కిన రోజుల్లో ఒకటే తొందర, హడావిడీ! ఆదివారం నా వంట పదిగంటలకి ఐపోతుంది. మీ అన్నయ్య 'ఆదివారం అంటే కడుపుకి ఆలస్యంగా ఆకలేస్తుందా?' అని

అడుగుతాడు, రోజులాగే భోంచేస్తాడు. ఇవాళైనా మీ ఇద్దరూ కలిసి భోంచెయ్యకూడదా?" అని నాయనమ్మ అంగలార్చుకుంది.

కణ్ణన్ అత్త "మా ఇంట్లో ఆదివారం మాత్రం మేమందరం ఒకే పంక్తిలో భంచేస్తాం; చాలా మజాగా ఉంటుంది!" ఆని గొప్పగా చెప్పుకుంది.

కణ్ణన్ తల్లి లలితకి ఏ బాధా లేదు: ఆదివారం తపాలువాడు రాడు; తన కథలెవీ తిరిగిరావు! అలా వచ్చినా ఆమె సాహిత్యఅభిరుచికి ఎదీ అడ్డు రాదు. ఆ తృప్తి చాలు!

"నువ్వెందుకు తపాలాఫీసుకి ఆదివారం శెలవు ఇవ్వాలంటున్నావ్? నాకది ఇష్టం లేదు!" అని అత్త గట్టిగా తన ఆక్షేపణ చెప్పుకుంది.

కణ్ణన్ అన్నీ విన్నాడు: "నాకు శనివారం, ఆదివారం - రెండూ ఇష్టమే! నాకు స్కూలు లేదు!" అని చప్పట్లు కొట్టాడు! వాడింకా ఏమీ తెలియని పిల్లవాడా?

********

(మూలం ప్రచురణ: కలైమగళ్, సెప్టంబర్, 1950)



# సురభి విన్న సందేశం

స్వామినాధన్కి మళ్లీ బదిలీ వచ్చేసింది. ఆతని ఉద్యోగ అనుభవంలో ఇదేం కొత్తకాదు; ఊరు మారడం మామూలుగా జరిగేదే. కాని మూడు సంవత్సరాలైనా ఈ ఊరులోనే ఉండాలని అతను నమ్ముకున్నారు; కాని ఇక్కడకి వచ్చిన ఒక సంవత్సరంలోనే అతన్ని వేరొక ఊరుకి మార్చేసారు.

"చెల్లం, ఇక మన ఇన్ని గురించి ఏం చెయ్యాలి?" అని స్వామినాధన్ భార్యని బెంగతో అడిగారు. ఇన్ని[1] వాళ్ళ ఇంటిలో గారాబంగా పెరుగుతున్న ఆవు. దానికి కాషాయవర్ణ దేహం; కొంచెం అస్పష్టమైన పసుపు వర్ణంలో కాళ్ళు; బాగా పెరిగిన చిన్న కొమ్ములు; పొడుగాటి తోక; వీటితో ఇన్ని గంభీరంగా ఇప్పుడు పెరడులో గోశాలలో నిలబడివుంది. అతి వాత్సల్యంగా ఆ కుటుంబం పెంచుతున్న జంతువు; దాన్ని వదలేసి వెళ్ళాలెంటే ఎలాగ?

"నాకూ ఏంచెయ్యాలో అర్థం కావటం లేదు. మనకి ఆవు ప్రాప్తి లేదు కాబోలు! ఎన్నో ఊరులు తిరిగాం, ఒక ఆవుని పోషించడం మన వల్లకాదనిపించింది. ఈ ఊరులో అన్ని వసతులూ ఉన్నాయని కొన్నాం. ఇప్పుడు గభీమని మనకీ ఈ బదిలీ ఆర్డరు వచ్చేసింది!" అని చెల్లం అంగలార్చుకుంది.

"మనతోనే దాన్ని తీసుకువెళ్దాం!" అన్నారు స్వామినాదన్.

"వీలవుతుందా?"

"తప్పకుండా! మన కారులో మన బ్లాండి వస్తున్నట్టే ఇన్నీకూడా రానీ! నాకీ ఆలోచన ముందు రాలేదు. ఎందుకో తెలుసా? ఊరు మారితే కొన్ని ఆవులకి సరిపడదని ఎవరో అనడం విన్నాను. అందుకేగా మనం మనకి ఆవు వద్దని చాలా రోజులు ఊరుకున్నాం?"

"ఇప్పుడు మాత్రం సరిపడుతుందా?"

"మనం వెళ్తున్న ఊరు నూరుమైళ్ళ దూరంలోనే ఉంది. భూమిలో, వాతావరణంలో అంత గొప్పగా తేడా ఉండదనిపిస్తోంది."

---

[1] తమిళంలో ఇన్నికి మధురం అనే అర్థముంది

“ఎందుకైనా మంచిది. మన గౌడూని అడుగుదాం,” అంది చెల్లం.

ఆవులకాపరిని అడిగారు; వాడు నవ్వాడు.

“మీరేం బాధపడకండమ్మా! మీరు ఊరు చేరుకున్న పదిరోజులకి ఇన్ని మీ దగ్గరకి వచ్చేస్తుంది! నేనన్ని ఏర్పాట్లు చేస్తాను!” అని అన్నాడు వాడు; ఆవులగురించి వీళ్ళకేం తెలియదని వాడికి బోధపడింది.

“నువ్వేం ఏర్పాటు చేస్తావ్?” అని చెల్లం అడిగింది.

“దాన్ని రోడులో నడిపించుకొనిరమ్మని చెప్తాను. రైలుబండిలో పంపించాలంటే ఖర్చు ఎక్కువవుతుంది. అది నడుచుకుంటూ వచ్చేస్తుంది!”

“అయ్యో, పాపం!” అంది చెల్లం ఇన్నిని జాలిగా చూస్తూ. పొద్దున్నే వంటకోసం మడిగట్టుకొని సిద్ధంగా ఉన్న యజమానిని అసూయతో చూస్తూ నిలబడింది వాళ్ళ కుక్క బ్లాండీ.

“ఏమ్మా, ఈ రోజుల్లో మనుషులే నడుస్తున్నారే? భూదానం అడుక్కుంటూ ఒక పెద్దాయన ఎన్ని మైళ్ళు నడుస్తున్నారు! ఆవంటే ఒకరోజుకి పదిమైళ్ళైనా నడవడం మామూలే! దాన్ని రోడులో నడిపించడానికి మనం కొంచెం ఖర్చు చెయ్యాలి, అంతే! నేనొక మనిషిని ఏర్పాటు చేస్తాను. వాడు ఆవుని భద్రంగా చూసుకుంటాడు.”

“వాడికీ మనం డబ్బు ఇవ్వాలికదూ?”

“రైలుకి ఇంకా ఎక్కువగా ఖర్చవుతుంది. అయ్యగారిని అడిగిచూడండి.”

ఆవులకాపరి సరిగ్గానే చెప్పాడని స్వామినాథన్ అడిగి తెలుసుకున్నారు. రైలుబండిలో పంపించడానికీ, రోడ్డు రవాణాకీ చాలా భేదం ఉందని తెలిసింది. “దూడని వాడు చెయిలో తీసుకొని వస్తాడు. అప్పుడప్పుడు దాన్ని రోడ్డులో నడిపించుతాడు. మీకేం భయం వద్దు!” అని కాపరి దృఢంగా అతనికి మాట ఇచ్చాడు. రోజు, ఆవుని కాస్తున్న మనిషి ఉత్తికే చెప్తాడా? మూడు మాసాలముందు పొన్నన్ పుట్టినప్పుడు ఇన్ని ఎలాగో బతికివుంది; అందుకు ఆవులకాపరి సమయోచిత బుద్ధియే కారణం; లేకపోతే ఇన్ని బతికివుండదు; దూడ పొన్నన్ కూడా ఈ ఇంటిలో ఉండడు; ఇవన్నీ గుర్తుచేసుకొనే చెల్లం భర్తకి నచ్చజెప్పింది; అతనూ సరేన్నారు.

పిల్లలకన్నీ సరదాపే; ఎనిమిదేళ్ళ కూతురు "నాన్నగారూ, మనం కారులోనేకదా వెళ్తాం, ఇన్ని మన వెనకాలే పరుగెత్తుకొని రావొచ్చుగా?" అని అడిగింది.

"నువ్వూ దానిమీద సవారిచేసుకొని వచ్చేయ్! కారులో నీ జాగాలో పొన్నన్ రానీ!" అని ఆమె అన్నయ్య చెల్లెలిని ఎగతాళి చేసాడు.

"ఏమ్మా, కారూ, ఆవూ ఒకటే అంటున్నావా? కారు ఒక యంత్రం, ఆవు నోరులేని ఒక పుణ్య జీవి! ఇన్ని రోడ్డులో నింపాదిగా నడవడంగురించి ఆలోచిస్తేనే నాకు చాలా బాధగా ఉంది !"అన్నారు స్వామినాథన్. తనకి ఇన్ని అంటే ఎంత అభిమానం అని అతను తెలియజేసారు.

ఆవునీ, దూడనీ పిల్లలు పెరడులో కలుసుకొని "ఇన్నీ, పొన్నన్, మీరూ మాతో కొత్త ఊరుకి వస్తున్నారన్నమాట!" అని కుశల ప్రశ్నలు వేసారు.

"మనకి ముందే ఈ రెండూ కొత్త ఊరుకి ప్రయాణం చేస్తాయి!" అని తల్లి పిల్లలని ఉత్సాహపరిచింది.

అవును, అదే పెద్దల ఉద్దేశం; కొత్త ఊరుకి వెళ్ళగానే తెలియని చోట పాలుకి ఎటువంటి ఇబ్బంది రాకూడదని ముందుగానే ఆవుని పంపించాలని నిర్ణయించారు. "ఇన్ని భద్రంగా ఊరు చేరుకున్నవెంటనే నాకీ ఉత్తరం పోస్ట్ చెయ్!" అని బాధ్యతగల ఆ ఆవులకాపరికి స్వామినాథన్ ఒక కవరు అందించారు; దానితోబాటు ఎందుకైనా మంచిదని తన ఆఫీసులోని సిబ్బందికి కూడా రాసారు.

అవుకున్నట్టే ఉత్తరాలన్నీ వచ్చేసాయి. ఆవూ, దూడా ఎవరి సంరక్షణలో, ఎక్కడ ఉన్నాయని వివరాలు ఆ సిబ్బంది తెలియజేసారు. "మనం రెండు రోజులు ముందుగానే వెళ్దాం," అని చెల్లం భర్తకి చెప్పింది. కాని ప్రయాణంకి నాలుగైదు రోజులు ఆలస్యం కావచ్చుననే సూచనలు కనిపించాయి.

కొంపతీసి అధికార సంస్థనుంచి బదిలీ ఆర్డరు రద్దు చేస్తున్నట్టు ఏమైనా వార్త వస్తుందేమో అని స్వామినాథన్ బెంగపట్టుకున్నారు. మంచి వేళ, అలాగేం జరగలేదు. ఆఖరికి, ఒక రోజు అందరూ కలిసి కారు ప్రయాణంకి సిద్ధమైయ్యారు.

ప్రయాణంలో దారంతా ప్రకృతి దృశ్యాలు చూసుకుంటూ, ఆనందిస్తూ, మాటాడుకుంటూ, పాడుకుంటూ వచ్చారు; ఎన్నో ఊర్లు దాటారు. "ఈ ఈ జాగాల్లో



-மகான்-

మన ఇన్ని నడిచియుంటుంది!" అని కొన్ని చోట్ల ఊహించుకున్నారు; "ఈ గడ్డికుప్పని చూసి మన పొన్నన్ ఎలా దూకాడో?" అని చెప్పుకుంటూ నవ్వారు. దారిలో ఒక చోట జరుగుతున్న సంతలో ఆగి చెల్లం ఇన్ని కంఠంకి రెండు గొలుసులు - చిన్న గంటలతో కట్టినది - కొంది. "ఏమండీ, ఇన్నిని నడిపించినవాడు దాని కోసం ఏమైనా కొని దానిమీద ఎక్కించాడేమో?" అని చెల్లం భర్తతో మొరబెట్టుకుంది. "ఇన్నిని నడిపించినవాడేకదా అప్పుడప్పుడు పొన్నన్ని ఎత్తుకొని నడిచివుంటాడు!" అని స్వామినాధన్ ఆమెను ఓదార్చారు.

కొన్నిచోట్ల కారు ఆపారు. వాళ్ళతో ప్రయాణం చేస్తున్న బ్లాండీ 'నాకూ కొంచెసేపు నడవాలని ఉంది, ఎంత సేపు నేను కారులోనే కూర్చోడం?' అని విసుగ్గున్నట్టు కనిపించింది. అంతేకాదు. కారు ఇంజెను చల్లపడడానికీ, ప్రయాణికుల కాళ్ల చలనంకీ అవకాసం ఇవ్వవలసివచ్చింది. ఒక సరస్సుగట్టుదగ్గర ఆగి అందరూ భోంచేసారు; అక్కడక్కడ చెట్లనీడలో విశ్రాంతి తీసుకున్నారు. బయలుదేరిన నాలుగు గంటలకి కొత్త ఊరు చేరుకున్నారు.

అధికారులు స్వామినాధన్ కుటుంబంకి మంచి వసతులు ఏర్పాటుచేసారు. ఉండడానికి ఒక పెద్ద బంగళా. కారు షెడ్డుపక్కనే ఇన్నికోసం గోశాల. 'ఇన్ని మనకోసం కాచుకొని ఉంటుంది,' అని ఆశపడిన కుటుంబంకి నిరాశే మిగిలింది. ఇన్ని కనిపించలేదు. ఏం, ఎందుకు? సిబ్బంది కారణం చెప్పారు. "నిన్న దానికి జబ్బుగా ఉంది. ఇన్నిని నడిపించుకొని వచ్చినవాడు దానికి చికిత్స చేస్తున్నాడు," అని. ఇన్ని పాలు కాచి, తాగి కొత్త ఇంటిలో నిద్రపోవాలనే అభిలాష నెరవేరలేదు. యాజమాన్యం తమదని మనుషులు అర్థించుతే ఇలాగ నిరాశ కలగడం తప్పదా? అలాగే కాబోలు అని కొంచెం అనుమానంకూడా కలిగింది.

ఆ మరుదినం ఇన్ని వచ్చింది; పొన్నన్ కూడా వచ్చాడు. దాని కంఠంని లాలించి, వీపుని తట్టి పిల్లలు తమ ఆహ్లాదం తెలియజేసారు. బ్లాండీకూడా ఇన్ని చుట్టూ చురుకుగా తిరుగుతూ, దూకుతూ దానికి స్వాగతం చెప్పింది. పొన్నన్, బ్లాండీ ఒకరినొకరు నుదుటలో అభిమానంతో ఒత్తుకున్నారు.

"ఇన్నికి ఏమైంది?" అని అడిగితే "అది అజీర్ణరోగంతో బాధపడుతోంది, మందులిచ్చాను," అని కాపరి చెప్పి, తనకి చేరవలసిన కూలి తీసుకొని వేరొక మనిషికి ఇన్నిని అప్పగించి వెళ్ళాడు.

ఇన్ని పాలిచ్చింది, కాని ముందులాగ కావలసినంత కాదు. మేయడానికి వెళ్ళి, అలసటతో తిరిగివచ్చింది. దాని నడక, ప్రవర్తన చాలా నీరసంగా కనిపించాయి. నోరులేని జంతువు, ఇన్నిని నడిపించుకొని వచ్చిన మనిషి దాన్ని సరిగ్గా చూసుకున్నాడా అని తెలియలేదు. కాని స్వామినాథన్ దంపతులు ఆలోచించారు; 'రోడ్డు రవాణా పొరబాటేమో?' అని బాధపడ్డారు. 'ఇన్ని ముందుకంటే ఎక్కువగా తింటోంది, కాని పాలు తక్కువగానే ఇస్తోంది," అని రోజు రెండు సార్లు - పొద్దున్నా, సాయంకాలమూ - చెప్పుకున్నారు.

పదిపన్నెండు రోజుల తరువాత, ఒక సాయంకాలం ఇన్ని పొలంలో మేపేసి ఇంటికి తిరిగివచ్చే సమయంలో స్వామినాథన్ దంపతులు కొందరు స్నేహితులతో మాటాడుతూ పచ్చికబయట్లో కూర్చొనివున్నారు. వృత్తాకారమైన ఆ ఏకాంత ప్రదేశంలో వాళ్ల చుట్టూ పూలకుండలున్నాయి; చెల్లం విశ్రమించే కుర్చీపక్కనే బ్లాండీ సగం నిద్రపోతోంది. గంటం ధ్వని వినగానే అది పరుగెత్తుకొని వెళ్ళి ఇన్నిమీద దూకింది. ఇన్ని ఒకలాగ విసుగ్గుంటూ నడుస్తూ కనిపించింది.

"మీ ఆవా?" అని స్నేహితుడు అడిగారు.

"అవును సార్ . . . అదేంటో వచ్చినప్పటినుంచీ దానికి జబ్బుగావుంది . . . చాలా ముద్దుగా ఆ ఊరునుంచి తీసుకొని వచ్చాం . . . ముందుకంటే బాగా తింటోంది, కాని పాలు తక్కువగా ఇస్తోంది . . . అదేం రోగమో అర్థం కావటం లేదు! ఆ ఊరులోనే దాన్ని అమ్మేసివుంటే బాగున్ను అనిపిస్తోంది," అన్నారు స్వామినాథన్.

బ్లాండీ అరుపు వింటూనే ఇన్ని గడప దాటి, నడమండపం చేరుకున్నతరువాత, కుడి పక్కన తిరిగి గోశాలకి నడిచింది; అదలా లోపలికి వెళ్ళిన తరువాతే బ్లాండీ దాన్ని వెంటాడక, తోకని దులుపుకుంటూ నిలబడింది.

"ఈ ఊరులో మంచి పాలు దొరకడం కష్టం. మీకని ఒక ఆవు ఉంటే మంచిదే," అన్నారు స్నేహితుడిని భార్య.

"దాన్ని పోషించడడానికి మేం పడే శ్రమ ఇంతా అంతా కాదు! 'దేవుడా' అని ఇక్కడే పాలు కొనుక్కుంటే ఏ బాధా ఉండదు! నాకిక ఆవుని పెంచే ఆశ లేదు!" అని చెల్లం విసుగ్గుంది.

అక్కడ గోశాలలో ఇన్ని కాపరికోసం కాచుకొనివుంది; వాడు రావాలి, అప్పుడేకదా తను తన బిడ్డని నక్కి పాలివ్వడం జరుగుతుంది?

ఆ మరునాడూ ఇన్ని మేయడానికి వెళ్ళింది, తిరిగి వచ్చింది. వస్తూనే తలని ఇలా అలా ఊపుతూ వచ్చింది. ఆ సమయం పచ్చికబయట్లో టీ తాగుతూ స్వామినాధన్ దంపతులు కూర్చొనివున్నారు. బ్లాండీ పిల్లలతో వాహ్యాళికి వెళ్ళింది.

"ఎందుకు ఇన్ని ఎలాగో తల ఊపుతోంది?" అని చెల్లం దాన్ని తేరిచూస్తూ అడిగింది.

"బ్లాండీ కనిపించలేదనేమో?" అన్నారు స్వామినాధన్.

ఆ తరువాత మరెవరో స్నేహితులు వచ్చారు, వాళ్ళతో మాటలాడుతూ స్వామినాధన్ దంపతులు కాలం గడిపారు. ఆవులకాపరి వచ్చినప్పుడు ఇన్ని పడుకోని ఉంది; ప్రాణం లేదు.

"ఏదైనా కలుపు మొక్క తింది కాబోలు," అన్నాడు కాపరి.

"అలా తింటుందా? విషమని తెలియదా?ఆవుకని సహజ జ్ఞానం ఉండదా?" అని అడిగింది చెల్లం.

"ఏదైనా పురుగో, పామో కరిచిందేమో? ఇదేదో తప్పకుండా విష ప్రభావంలా కనిపిస్తుంది!" అన్నాడు కాపరి.

స్వామినాధన్ ఏమీ అనక ఊరుకున్నారు. అతని మొహం ఎలాగో ఐపోయింది; త్వరగా అక్కడనుంచి అతను నిష్క్రమించారు.

"ఇన్ని పోయింది! పొన్నా, నీకిక అమ్మ లేదు!" అని చెల్లం జాలితో పిల్లల ఎదుట దూడని తాకి ఓదార్చింది.

ఆ రాత్రి నిద్ర రాకుండా ఇంటిలో అందరూ ఇన్నిగురించే మాటాడారు. స్వామినాధన్ అన్నారు: "ఇన్ని ఆత్మహత్య చేసుకుంది. దాన్ని చంపిన విషం నా నోటిలోనించే వచ్చింది. అందువలనే ఇన్ని కన్ను మూసింది. చెల్లం, నీకు జ్ఞాపకం

ఉందా? నిన్న అది నాకు సమీపంలో నడుస్తూంటే 'ఇన్ని బాగా తింటోంది!' అని నేను అన్నాను. అది విన్నతరువాతే ఇన్ని ఏదో విషం తినేసింది. మన ఇంట్లో, తన పిల్లవాడున్నచోట ప్రాణం పోవాలని పూనుకుంది!"

ఆ మాటలు విని 'అలాగేమైనా ఐవుంటుందా?' అని ఆలోచిస్తూ చెల్లం భర్తని వింతగా చూసింది. అతని కళ్ళలో ఉగ్రత కనిపించింది, కాని కన్నీరుబొట్టు అని ఏదీ లేదు; అతని మనసు బాగా తపించిపోయిందని తెలుసుకుంది.

"మీరేమంటున్నారు? ఇన్నికి అంత మేరగా తెలుసా? ఊరు మారితే దానికి సర్దుకోడం కష్టం అని మనం విన్నాం. అది నిజం అని ఇప్పుడు మనకి బాగా తెలిసిపోయింది! ఇక మనకి ఆవు వద్దు! మన పిల్లల చదువు గురించే బెంగపెట్టుకుందాం!" అని అన్నతరువాత భర్త మనసులోని ఆరాటం గురించి చెల్లం ఆలోచించింది:

'ఇన్నిని మనం చాలా గారాబంగా పెంచాం; అవును, నిజం. కాని అది బాగా తిండి తింటూ తక్కువగా పాలివ్వడం భరించలేకపోయాం. దానిగురించి నేనే తరచుగా మావారితో మొరబెట్టుకున్నాను. అవును మరి, ఇల్లాలు అని నాకూ కొన్ని బాధ్యతలున్నాయిగా? శ్రద్ధ, అనురాగంతో ఇన్నిని పోషించినా ప్రతిఫలం ఎదురుచూసే స్వార్థం నా మనసులో ఒక మూల నక్కుకొని ఉంది, అందుకే అతనితో నా అసంతృప్తి తెలియజేసాను; అతనూ మాటవాసికి దానిగురించి తన మిత్రులతో ప్రస్తావించారు. అందువలనే రోషంతో ఇన్ని కన్నుమూసిందని అతను అంటున్నారు! నమ్మదగిన వ్యాఖ్యానంలాగే కనిపిస్తోంది! కాని ఏం లాభం, అలా అనుకున్నా నాకు మనశ్శాంతి లేదు!'

"మనుషులకే ఆరవ భావం, అందువలనే ఆలోచించే శక్తి ఉంది. అది పశువులకి లేదు! 'వాడేం మనిషా లేక జంతువా?' అనే వచనం మీరు వినివుంటారే! దాన్నే తెలుగులో 'మనిషా, పశువా?' అని అడుగుతారు. దాని కర్మ, ఇన్ని పోయే వేళ వచ్చేసింది, అది పోయింది!" అని చెల్లం అప్పుడప్పుడు భర్తకి చెప్పి అతన్ని ఊరడించేది. కొన్నిసార్లు "మీరెందుకు పిచ్చి పిచ్చిగా ఏమేమో అంటున్నారు?" అనికూడా మందలించేది. కాని స్వామినాథన్ మాత్రం తన మనసు మార్చుకోలేదు. అతను మొండిగా "మా ఆవు ఆత్మహత్య చేసుకుంది

సార్!" అని అందరికీ నొక్కి చెప్పారు. "ఇదేంటి, వింతగా ఉందే?" అని ఎవరైనా అడిగితే "అవును, దాని తిండికే మేం బోలెడు ఖర్చు చేస్తున్నాం అని నేను ఒకరోజు అన్నాను. అంతే, ఆ మరుదినం ఇలాగ చేసేసింది!" అన్నారు.

ఒక రోజు ఇలాగే అతను ఒక కుటుంబ సభ్యులకి చెప్తున్నారు. అప్పుడు బ్లాండీ అతని పక్కనే మసలుతూ కనిపించింది. ఇన్ని అన్న పేరు విన్నాది కాబోలు, అది రెండుసార్లు మొరుగుతూ, స్వామినాధన్ కాళ్ళను నక్కి, అతని కుర్చీకింద పడుకుంది.

అతని మిత్రుడు కూతురు బ్లాండీని చూసి "మేం నాలుగు నెలలముందు చూసిన కుక్క ఇదేనా?ఎంత ఎత్తుగా పెరిగిపోయింది?" అని ఆశ్చర్యపడింది.

"అవునమ్మా, ఆ బ్లాండీయే! బాగా పెరిగిపోయింది. పాలూ, మాంసం తిని ఉత్తికే తిరుగుతోంది! ఇంతకుముందు నాకు జ్ఞాపకం రాలేదు, లేకపోతే  నేను ఇన్నిని తప్పుపెట్టివుండను. 'అది బాగా తింటోంది, సరిగ్గా పాలు ఇవ్వటం లేదు!' అని నేను అనలేదూ! మరి, ఇదేం పాలు ఇస్తోందా, లేదే? నాకది ఎందుకో గుర్తు రాలేదు!" అన్నారు స్వామినాధన్.

అతిథులకి వడ్డించుతున్న చెల్లం అతని మాటలు విని "ఇతను ఇలా అనడం నేను కూడా ఇప్పుడే వింటున్నాను"  అని చెప్పింది.

"'సార్, బాగా పెరిగిపోయింది' అని మీరనగానే నాకూ గుర్తుకి వచ్చింది! కిందటి నెల మీకు మీకు ఫోన్ చేసాను. అప్పుడు మీ మాటలతోపాటు దీని అరుపూ నాకు వినిపించింది!" అన్నారు ఆ స్నేహితుడు, నవ్వుతూ.

"ఓ, అవును, అప్పుడు ఇదీ నా పక్కనే ఉంది!" అని స్వామినాధన్ కూడా నవ్వారు.

ఆతరువాత ఒక సరసమైన ఘటన జరిగింది. చెల్లం తన పాపని పెరడులో ఆడుకోడానికి వదిలేసి కూతురు రమాతో "దాన్ని కొంచెం చూసుకోవే!" అని చెప్పి వంటగదిలోకి వెళ్ళింది.  సుద్దతో నేలమీద రకరకాల బొమ్మలు గీసి వేడుకలు చూస్తున్న రమా పాపకి ఏదైనా ఆట వస్తువు ఇవ్వాలని ఆలోచించింది. తప్పుటడుగులు వేస్తున్న పాప కళ్లకి విందుగా కనిపించినట్టు చిత్రవిచిత్రమైన రెండు చెక్కలు ఇవ్వాలని లోపలికి వెళ్ళింది. తిరిగివచ్చిన తరువాత ఒక దృశ్యం

చూసి “అమ్మా, అమ్మా,  అని గొంతుచించుకొని అరిచింది. కాని బ్లాండీ విపరీత కూతలో రమా కంఠధ్వని అణిగిపోయింది.

“ఎందుకీ ఈ కూత!” అని నిర్లక్ష్యంగా ఉన్న చెల్లం చెవులకి  బ్లాండీ అరుపు తగ్గగానే కూతురు పిలుపు వినిపించింది; పరుగెత్తుకొని వచ్చి చూసింది.

పాపకి కొంచెం దూరంలో బ్లాండీ దొర్లుతూ కనిపించింది; పక్కనే ఒక పాము, బ్లాండీతో పోరాడి తునకలు తునకలుగా పడివుంది.

“అమ్మ, బాబోయ్!” అని పాపని హరించుకున్న చెల్లం పాముని చూస్తూ అలాగే నిలబడిపోయింది. “అమ్మా, బ్లాండీ గభీమని దూకడం నేను చూసాను. పాము ఆ స్తంబం పక్కన వస్తూంటే బ్లాండీ దానిమీదపడి ఎలా దెబ్బలాడిందో తెలుసా? నేను ఎన్నిసార్లు నిన్ను పిలిచానో, నువ్వు రాలేదు!” అని రమా తల్లికి వివరించింది.

“బ్లాండీని చూసుకోడానికి ఎవరూ లేరే! పనిమనిషులందరూ వాళ్ళ వాళ్ల పనులు చూసుకుంటూ ఉన్నారు!” అని చెల్లం నిస్సహాయంగా చేతులు పిసుక్కొని నిలబడింది.

తడబాటు పడుతున్న యజమానిని చూస్తూ  ‘ఇక మీరేం చేసినా లాభం లేదు!’ అని చెప్తున్నట్టు బ్లాండీ ఒక మూలుగుతో తన అంతస్తు, ఘనత ప్రకటిస్తూ కన్ను మూసింది.

మధ్యాహ్నం మకాంనుంచి తిరిగివచ్చిన తరువాత స్వామినాధన్ దుర్ఘటన తెలుసుకున్నారు. ఒక నిమిషం ఆగి “హూం, అది బాగా బలిసిపోయి ఉత్తికే తిరుగుతోందని నేను అనలేదూ? అందుకే ఇలాగ చేసేసింది!” అని ఒక నిట్టూర్పు వదిలారు.

చెల్లం నోటిలో మాట పెగల్లేదు. ‘ఆఖరికి ఇదేనా మన బ్లాండీ గతి? అది మనకి మంచిదేకదా చేసింది? అసలు మనం ఎందుకు కుక్కని పెంచుతున్నాం?  ఆపదలో మనల్ని కాపాడాలనేకదా? ఆపద తాకేవరకూ మనకి దాని ఘనత తెలుసా? అయినప్పటికీ, మనసులో ఆ అపేక్ష ఉన్న కారణంవలనే మనం దాన్ని పెంచడం, పోషించడం జరుగుతోంది. ఆ రోజు  మీరు దుఃఖంతో ఇన్నిగురించి మాటాడారు; ఇప్పుడు  కుక్కగురించి అలాగే అంటున్నారు’ అని చెప్పాలనుకుంది, కాని బ్లాండీ చేసిన ఉన్నత సేవని గుర్తుచేసుకుంటే చెల్లంకి మరేం తోచలేదు. కుక్కా, ఆవూ

ఒకటా? 'కుక్క ఇంటిలో ఉంటే అశుచి, కాని ఆవు తప్పకుండా ఉండాలి!' అని మనం శాస్త్రం చెప్తోంది. "మీరు ముద్దుగా ఒక కుక్క కొన్నారు; నేనూ హాయిగా ఒక ఆవు కొంటాను!" అని కిందటి సంవత్సరం చెల్లం భర్తతో అనలేదూ? అది జ్ఞాపకం వచ్చినతరువాత ఇప్పుడు తనకేం నోరుంది?

నోరు లేని జంతువుగురించి నోరున్న మానవులు నోరాడక నిలిచిపోయే అద్భుతం ఈ ప్రపంచంలో అపూర్వం కాదు!

********

(మూలం ప్రచురణ: కలైమగళ్, డిసంబర్, 1955)



# అణిగిన అగ్ని

నన్ను వెంటనే బయలుదేరి రమ్మని ఒకటి తరువాత ఒకటిగా ఉత్తరాలు చూలుగావున్న కూతురు లక్ష్మీ దగ్గరనుంచి వచ్చేసాయి; నాకూ వెళ్ళాలనే ఉంది. గోరింటాకులు రుబ్బి దాన్ని అమ్మాయి వేళ్ళకి పూయాలనే నా ఆశ; కాని కొంచెం ఆలస్యం చేసి వెళ్ళాలని ఆలోచిస్తున్నాను.

ఆరు మాసాలే అయ్యాయి. లక్ష్మిని చూస్తే కడుపు మాత్రం కనిపించింది. అది ముగ్గురు పిల్లలని పోషించాలి; నలుగురు పనిమనుషులని మేపాలి. ఈ బాధ్యతలవలనేకాబోలు శరీరంలో సగం చిక్కిపోయింది. తన కాపురంగురించి లక్ష్మి నాకు నియమం తప్పకుండా ఉత్తరాలు రాసేది: ఏది చేసినా - ఏ చిన్న పనైనా - కొఱతలేకుండా ఉండాలి, అదే దాని లక్ష్యం. అందువలనే ఇలా బాగా అరిగిపోయినట్టు కనిపించింది.

నేను వచ్చేసానుగా? దానికి అన్నివిధాలా సాయం చెయ్యడానికి సిద్ధంగా ఉన్నాను, అది లక్ష్మికి తెలిసింది. "అమ్మా, నేను పిలిచినవెంటనే నువ్వు వచ్చివుండాలి!" అంది.

లక్ష్మి దాన్ని ఒక ప్రశ్నగా అడగలేదు; నేనూ జవాబు ఇవ్వలేదు. నా ఆలస్యంకి కారణమేమిటో నాజూకుగా నా ఉత్తరంలో సూచించాను. వృద్ధాప్యంలో భార్యాభర్తలు ఒకేచోట ఉంటే మంచిది. ఎవరికి ఎప్పుడు ఏమవుతుందో? పదవి విరమణ తరువాతకూడా మా ఆయనకి విశ్రాంతి అంటూ లేదు. ఇప్పుడు అతను కొన్ని అదనపు బాధ్యతలు పూనుకున్నారు. అన్నీ సరిగ్గా చెయ్యాలి, అతను చేసి తీరుతారు. అతనికి భారం తగ్గినతరువాత నేను బయలుదేరాలనుకున్నాను. కాని లాభం లేదు. సముద్ర కెరటాలని నిలపడం ఎలా సాధ్యం?

ఇప్పుడు నోరు తెరిచి మళ్ళీ చెప్పడానికి నాకు మోమాటం; పదినెలలు మోసిన కూతురుకీ చెప్పడానికి నా నోరు పెగల్లేదు.

** ** **

తొమ్మిది నెలలు కడుపులో పెరిగి పుట్టవలసిన శిశువు ఒక నెల ముందుగానే లక్ష్మికి పుట్టింది.

లక్ష్మి బతికింది; పాప పోయింది.

నేను రకరకాల ఆలోచనలలో మునిగితేలాను. నా ఆలస్యం వలన లక్ష్మిదేహం కృశించిపోయి శిశువుకి హాని కలిగిందా? తన మొదటి మూడు కానుపులకి లక్ష్మి నాదగ్గరకి వచ్చిందే? ఈసారికూడా దాన్ని రమ్మని పిలిచియుంటే? 'నువ్వు రా!' అని అది నన్ను పిలిచినప్పుడు నేను 'నువ్వే వచ్చేయ్!' అని పిలవకపోవడం నేను చేసిన పెద్ద పొరబాటేమో అని బాధపడ్డాను.

నా మనసులోని యాతనన లక్ష్మికి వెళ్ళగ్రక్కుకున్నాను; లక్ష్మి మౌనంగా రెప్పలమూలనున్న కన్నీరు బొట్టుని తుడుచుకుంది.

శిశువుగాని బతికివుంటే లక్ష్మి దేహంలో మళ్ళీ బలం వచ్చేవరకూ ఆమెకి నేను తోడు ఉండాలి. కాని ఇప్పుడో? ప్రవసించిన మహిళలకి చెయ్యవలసినవన్నీ నేను లక్ష్మికి శ్రద్ధగా చేసాను. లక్ష్మి జుత్తు ఆరబోసుకోవడానికి సాంబ్రాణి దూపం వేసాను; అదిచూసి పిల్లలందరూ 'అమ్మకి ఎందుకీ ఈ అపురూపమైన ఉపచారం?' అని వింతగా చూసారు; లక్ష్మికి కూడా అదొక అవమానంగా కనిపించింది.

నాకూ మనసులో అల్లుడుగారి అతిథిగా మెలుగుతున్నట్టు ఒక భావన కలిగింది. దానికి పరిహారంగా మా ఆయన నన్ను రమ్మని పిలిచేసారు. శ్రింగేరీలో ఒక బ్రహ్మాండమైన హోమం; పీఠాధిపతి శ్రీ చంద్రశేఖర భారతిగారి షష్ఠియబ్ధపూర్తిని అనుసరించి ఒక పెద్ద ఉత్సవంని ఆస్తిక బృందాలు జరుపుతున్నారు. అవును, లోక క్షేమంకని ఆ స్వాములవారిని కలుసుకొని అతని అనుమతితో ఆ వేడుక నడుపుతున్నారు.

నేను లక్ష్మితో బయలుదేరాను. స్కూల్లో చదుపుకుంటున్న తన పెద్ద అబ్బాయినీ, భర్తనీ ఇంట్లో ఉండమని చెప్పి లక్ష్మి మా ప్రయాణంకి విపులంగా ఒక పధకం తయారు చేసింది; పనిమనుషులకి తేటగా అన్ని ఆజ్ఞలు ఇచ్చింది; స్నేహితులకి వ్యక్తిగతమైన ఆలోచనలు నొక్కిచెప్పింది. ఐనాకూడా దాని మనసులో లొంగని భయం, ఆరాటం ఆకట్టుకున్నాయి. నేను చూసాను, దానికి చెప్పాను: "ఇదిగో చూడు, నీ పూజ గదిలో ముట్టించిన దీపం గుర్తు చేసుకో. ఆ దీపం జ్యోతిలో

నీ భారమంతా వదిలేసినట్టు కల్పించుకో. నువ్వు రోజు ఆరాధించే జ్యోతి నిన్ను కాపాడుతుంది. వత్తి ఆరిపోయినా, దీపం దీపంగానే ఉంటుంది, ఆ జ్యోతికి అదే గృహం!"

** ** **

మా ఊరుకి తిరిగివచ్చిన మరువారం మా శ్రింగేరీ ప్రయాణం ఆరంభమైంది. మావారు - లక్ష్మి నాన్నగారు - అన్ని ఏర్పాట్లు చక్కగా చేసారు.

రెండురోజుల కారు ప్రయాణంలో, మధ్య మధ్య, మేం కొన్ని చోట్ల ఆగాం. ఆ మజిలీలలో ఒక కొత్తబృందం మమ్మల్ని కలుసుకుంటుంది. మావారి పాండిత్యం అతని మిత్రులందరికీ బాగా తెలుసు. మేం వెళ్ళిన మార్గమంతా మావారు తన వేదాంత ప్రసంగం, వ్యాఖ్యానాలతో అందరినీ ఉత్సాహపరిచారు. మా బృందంలోవున్న స్త్రీలు - నాలాగే - మగవారిమధ్య చీరకొంగు కప్పుకొని, ఇరుక్కొని కూర్చున్నారు. లక్ష్మికూడా అందరితో చనువుగా మాటాడింది. కారులోనే మవారి ఉపన్యాసం విని మేం బాగా ఆనందించాం.

సెలయేరులుగా ఆరంభించి ఆఖరికి ఒక నదిగా మారినట్టు మేమందరం అనేక చోట్ల బయలుదేరి ఆఖరికి ఒక గుంపుగా కలిసిపోయాం; చివరికి తుంగభద్రానదీతీరంలో కొలువున్న శారదా పీఠంకి మా గమనం సాగింది.

బంగళూరులో ఒకతను ఒకానొక స్థలంగురించి చెప్పి అక్కడనుంచి మరుదినం ఉదయం బయలుదేరితే మేం శ్రింగేరి సరైన సమయంలో చేరుకుంటాం అని చెప్పారు. అందువలన ప్రయాణం ఆరంభించిన రెండవరాత్రి మేం ఆక్కడకి వచ్చిచేరుకున్నాం. బస్సునుంచి గబగబమని అందరూ దిగాం; 'ఎవరికీ మనవలన ఇబ్బంది వద్దు, రాత్రి ఇక్కడ విశ్రాంతి తీసుకుందాం!' అని మా ఆలోచన. ఆదొక పెద్ద ఇల్లు. ఇంటి యజమాని ఉత్సాహంతో మాకు స్వాగతం చెప్పారు. మమ్మల్ని ఆహ్వానించిన స్త్రీ కూడా చిరునవ్వుతో కనిపించింది; తరువాత తొందరతొందరగా లోపలికి వెళ్ళిపోయింది. మేం కాళ్ళూ, చేతులూ కడుక్కోడానికి ఇంటి వెనుకతట్టుకి వెళ్ళాం. అక్కడ మేం చూసిన దృశ్యం ఎలా వర్ణించడం? మూడు మట్టి పొయ్యిలలో జ్వాల - హోమకుండం లాగ! ఒక పొయ్యిలో అండా; ఇంకొకదానిలో పెద్ద పాత్ర; మూడవదానిలో ఒక బాణలి. ఆ స్త్రీ అక్కడ నిలబడివుంది.


பாசு..

"వంట జరుగుతోందా?" అని అడిగాను; మా భోజనంగురించి నాకు ఏ ఆలోచనా లేదు.

"అవునండీ," అంది ఆవిడ.

"ఎందుకు వంట ఇంత ఆలస్యం? రోజూ ఇలాగేనా?"

ఒక చిరునవ్వు నవ్వుతూ "మీరు భోంచెయ్యాలికదూ?" అని నిదానంగా అడిగింది.

"మాకా? మా భోజనం ఎనిమిది గంటలకే పాలు, పళ్ళతో ఐపోయింది! మాకు మరేం వద్దు!" అని మేం - ఇద్దరు, ముగ్గురం - అన్నాం.

"దానికేంలెండి? ఒక పులుసు, కూర, చారు - అంతే! నేను మరేం చెయ్యలేదు!"

"వద్దమ్మా . . . అండా ఎందుకు? ఈ అన్నం మాకు వడ్డించడానికికదూ? వద్దు, ఆపేయ్!"

"బాగుంది, దీనికి ఎంత సమయం పడుతుంది?"

"మేమందరం వయసుచెల్లిన వాళ్ళం . . . మేం ఎన్నిసార్లు భోజనం చెయ్యగలం, చెప్పు? అదీ, ఈ అర్ధరాత్రి సమయంలో? మా దేహంకి మంచిదికాదమ్మా. . . ఉత్తికే ఎందుకీ శ్రమ?"

"మీరు పెద్దవాళ్ళు వచ్చారు. ఒకపూటైనా భోజనం చెయ్యకపోతే నాకెలా ఉంటుంది? పదకొండు గంటలకి వంట ఐపోతుంది."

ఆమె ముప్పైమందికి వండాలి; ఆమెను చూస్తే తనకి ముప్పైమంది సాయం చేస్తారనే ధోరణిలో మాటాడుతోంది. వయస్సు ముప్పైదాటినట్టు కనిపించలేదు.

"'మేం వస్తాం' అని నీకు తెలుసా?" అని అడిగాను.

ఇంతలో లక్ష్మి జోక్యం చేసుకొని "అమ్మా, ఇదేం ప్రశ్న? ఇక్కడ రావడంగురించి మనకే ఎప్పుడు తెలిసింది?" అని అడిగి, వెంటనే మన 'ఊరునుంచి ఎవరైనా ఫోను చేసారేమో లేదా టెలిగ్రాం పంపించారేమో?' అని ఆలోచించింది. మా సంభాషణ వింటున్న ఆ స్త్రీ "శ్రింగేరిలో పెద్ద హోమం జరుగుతోంది. దానికి ఈ మార్గంలో వెళ్ళే భక్తులకి నేనీ కైవల్యం చెయ్యకూడదా?" అని మమ్మల్ని అడిగింది.

"నువ్వు శ్రింగేరికి వెళ్తావా?" అని అడిగాను; ఒక చిరునవ్వు నవ్వి "నాకు వీలవదనిపిస్తోంది!" అని అంది ఆ అన్నపూరణి.

“నాన్నగారూ, మనకోసం భోజనం సిద్ధంగా ఉంది!” అని లక్ష్మి వార్త అందించగానే మా ఆయన వచ్చిచూసారు. “పాపం, ఎందుకు ఆవిడ మనకోసం ఇలా బాధపడాలి?” అని అతనికి జాలి కలిగింది.

“మనమూ ఈ అమ్మాయికి సాయం చెయ్యాలి!” అని మేం పూనుకున్నాం.

“ఏదో ఒక చింతపండు పులుసు ఏదో చేస్తే సరిపోను. సాంబారుకి ఇంత కందిపప్పు కావాలా?” అని ఎవరో అడిగారు. “సాంబారుకి కొబ్బరికాయ నూరాలి!” అని అంటూ లక్ష్మి పరుగెత్తింది. కొబ్బరికాయని పగలగొట్టడానికి సిద్ధమైన ఆ ఉపకారి అమ్మాయి అతిథులకి ఏ పనీ ఇవ్వకూడదని ఆ పగిలిన కొబ్బరి చిప్పలని తన చీర కప్పులో దాచుకుంది; తరువాత కొబ్బరిని తురుమడం ఆరంభించింది; లక్ష్మిని రుబ్బురోలు దగ్గరకి రానీయకుండా చూసుకుంది.

“కూర చెయ్యవద్దు, నేను అప్పడాలు తీసుకొని వచ్చాను. నిప్పులమీద కాల్చుకోవచ్చు!” అని అంటూ నేను ఒక పొయ్యిదగ్గరకి వెళ్ళాను. అంతలో ఆవిడ అప్పడాలు వేయించడానికి బాణలిలో నూనె పోసేసింది! దాని పక్కనే ఒక పెద్ద పాత్రలో ఉడుకుతున్న బంగాళదుంపలు కనిపించాయి!

భోజనంలో మొదట మగవారి పంక్తి, ఆ తరువాత స్త్రీల పంక్తి. వంట చేసిన స్త్రీ భోంచెయ్యలేదు. అడిగితే మేం రావడానికి అరగంటముందు ఆమె, ఆమె భర్త, పిల్లలూ భోంచేసారట; మేమందరం తనివితీరా భోంచేసాం.

తెల్లవారుజామున పళ్ళు తోముకోవాలని నేను లేచి వచ్చాను, అలాగే నిర్ఘాంతపోయాను! ఒక పొయ్యిలో కాఫీ, ఇంకొకదానిలో ఉప్పుమా! వంటగదిలో ఆవిడ కనిపించింది!

ఇటీవల నేను కృత్రిమ దంతాలు పెట్టుకున్నాను. వాటిని శుభ్రంచేసి తొడుక్కున్నప్పుడు ఎవరూ చూడకూడదని  మంచి చీకటిలోనే లేవడం అలవాటు చేసుకున్నాను. ఐతే ఈవిడ నాకుముందే లేచి చురుకుగా పనిచేస్తోంది! మంచి వేళ, ఈ రాత్రి మమ్మల్ని చూసినతరువాత దోశలు చెయ్యడానికి రాత్రంతా రుబ్బురోలు పక్కనేకూర్చోలేదు!

మరుదినం ప్రాతఃకాలంలో మగవాళ్ళందరూ సంధి జపం చేసుకున్నారు. మేం ఫలహారం ముగించుకొని బయలుదేరాం. మేమందరం ఆతురతతో రాబోయే

వేడుకలగురించి ఆలోచిస్తున్నాం. ఆరంభమే ఇంత అద్భుతంగా ఉందే? ఇక్కడ మేం దర్శించిన సహస్ర ఛండీ హోమం, రుద్ర హోమం ఉత్సవాలు చూసి ఆస్తిక హృదయాలుకూడా భ్రమించి పోయారు.

సహస్ర ఛండీ హోమంకి పది అగ్నికుండాలు. ఒక కుండం చుట్టూ ముప్పైరెండు హోమ బ్రాహ్మణులు. అంటే మొత్తం మూడువందల ఇరవైమంది పసుపుపచ్చని పంచెలు ధరించి, యజ్ఞం ఆరంభించారు, మంత్రాలు వల్లించారు. హోమకుండంలో నెయ్యి, పాలు, ధాన్యం, భక్తులు తీసుకొనివచ్చినవన్నీ ధారపోసారు. కొందరు మంచి అమూల్యమైన పట్టుచీరలు తెచ్చారు; అవికూడా బ్రాహ్మణులు అగ్నికి అర్పణం చెయ్యడమైంది.

ఏకాదశ (పదకొండు) రుద్ర రూపాలలోనూ శివపూజ జరిగింది. రుద్రహోమంకి పదకొండు అగ్నికుండాలు; లక్షోపలక్షలుగా వచ్చిన అతిథులకి అన్నివిధాల వసతులూ లభించాయి. పళ్ళెం, పళ్ళెంగా పిండివంటలు, దువ్వెనలు, కుంకం, తాంబూలం అందించే పుణ్యస్త్రీలు; నీరు, మజ్జిగ, పానకం వినియోగించే స్వచ్ఛంద సేవకులు; అందరి మనసులోనూ 'ఆహా, ఇదొక దివ్యమైన వైభవం!' అనే భావన స్థిరపడిపోయింది.

వేడుకలుచూసి మాకు కళ్ళలో ఆనందం, ఆనంద బాష్పాలు పొంగుకొచ్చాయి. హోమాగ్ని ఆరిపోయినా మేం అనుభవించిన ఉల్లాసం తగ్గనేలేదు. మేం ఊరుకి తిరుగుప్రయాణం ఆరంభించాం. మైసూరులో చాముండేశ్వరీ దేవిని దర్శనం చేసుకొని, మా గుంపునుంచి వేరై, మా ఊరుకి రైలు ప్రయాణం సాగించాం.

** ** **

ఊరుకి రాగానే అందరికీ విభూతి, కుంకం ప్రసాదంగా ఇవ్వడమైంది. అడిగినవాళ్ళతో అన్ని వివరాలు చాలా ఆతురతతో పంచుకున్నాం.

కొన్ని సమయాల్లో నేను హోమంగురించి మాత్రం మాటాడాను. పక్కనేవున్న లక్ష్మి "అమ్మా, 'ఆవిడ' గురించి ముఖ్యంగా చెప్పు!" అని నాకు జ్ఞాపకం చేసేది. నేనూ ఆమెగురించి చెప్పి త్వరగా ముగించేదాన్ని: "చాలా చురుకైన స్త్రీ. కాని ఇవన్నీ ఆవిడ తరచుగా చేసేవే. ఇంటిలో తయారుగా మూడు పొయ్యిలున్నాయి.

కావలసిన పాత్రలు, సామగ్రి అందుబాటులో ఉన్నాయి. పెరడులో నాలుగైదు ఆవులున్నాయి. కాఫీకి పాలు వెంటనే దొరికింది!" అన్నాను.

లక్ష్మి కళ్ళు ఆరసి నన్ను చూసింది. "అమ్మా, అలవాటుంటే మాత్రం చాలా? విసుగ్గుండా పని చెయ్యడానికి త్రాణ వద్దా? అంతే కాక . . . " అని అడిగింది.

నేను వెంటనే జోక్యం చేసుకున్నాను: "అవును, అవును! నేను కాదని అన్నానా? నాకూ చాలా ఆశ్చర్యం! ఇంతకీ ఆ రోజుల్లో నేనుకూడా ఒంటిగా యాభైమందికి విందుకు వండాను. ఐనా నాకూ ఆశ్చర్యంగా కనిపించింది!" అని ఒప్పుకున్నాను.

ఇంకొకసారి లక్ష్మి "అమ్మా, నువ్వు ఆవిడని మరిచిపోయావ్!" అని నన్ను తప్పుపట్టింది.

"లేదు. హోమంగురించి అడిగిన వాళ్ళకి దానిగురించే ముఖ్యంగా చెప్పాను," అని అన్నాను నేను.

నా మనసులో మేం ఒక దివ్యమైన వైభవంకి వెళ్ళే మార్గంలో ఒక ఆదర్శవంతమైన స్త్రీ మాకు అతిథి సత్కారం చేసిన ఘటన స్థిరంగా నిలిచిపోయింది; ఆమె మా ప్రసంశకీ, మెచ్చుకోలుకీ అర్హురాలైంది అనే భావనని నేను రెండుమూడుసార్లు నా స్నేహితులకి చెప్పాను.

నా స్నేహితులతో లక్ష్మికి పరిచయం లేదు. అందువలన అదేం అనలేదు. పెళ్ళయి మొట్టమొదట అత్తగారింటికి వెళ్ళినప్పుడు లక్ష్మికి పుట్టిల్లంటే ప్రీతి ఉండేది; ఇప్పుడు దానికి అది కొత్తగా కనిపించింది.

అంటే ఇక్కడ లక్ష్మికి చికాకుగా ఉందా? ఊహూం, అలాగేం కాదు! తనకని ఒక ఇల్లూ, కాపురం అని వస్తే పుట్టిల్లుగురించి అపేక్ష తక్కువగానే ఉంటుంది; మజ్జిగలో తేలుతున్న వెన్న ఎన్ని రోజులు ఉంటుంది? లక్ష్మి తన ఊరుకి వెళ్ళిపోయింది.

** ** **

ఉత్తరదేశంలో లక్ష్మి జీవితం పనితొందరలోనే ఉంటుంది; ఇంటిలో చురుకుగా అన్ని పనులూ చెయ్యాలి; బయట కార్యదర్శిగా దానికి మరి కొన్ని బాధ్యతలున్నాయి. విందులు, లలిత, కళాత్మక ప్రదర్శనలు అన్నీ ఘనంగా నిర్వహించుతుంది. ఐనా దానికి దేవునిపట్ల భయభక్తి ఉంది. మేం శృంగేరి

వెళ్ళినప్పుడు లక్షోపలక్షలుగా భక్తులు కొనియాడిన ఉత్సవాళ్ళో లక్ష్మికూడా కలుసుకుంది, దానిగురించి అందరికీ చెప్పింది. కాని ఆ ఆచారకర్మలన్నీ విడచిపెట్టి తన మనసులోని ముఖ్యమైన వంతు ఆ ఉపకారి స్త్రీకే నిర్ణయించింది.

ఊరుకి వెళ్ళగానే లక్ష్మి నాకు ఉత్తరం రాసింది: "మనం చూసిన హోమం లెక్కలేనన్ని భక్తుల సహకారంతో జరిగింది. కాని ఒక సామాన్య కుటుంబ స్త్రీ మనకందరికీ అపూర్వంగా కనిపించడం నాకు చాలా ఆశ్చర్యంగా ఉంది!"

దానితో లక్ష్మి ఆగలేదు; తన అనుభూతిని ఇలా వర్ణించింది:

ఒకరోజు సముద్రరాజు తన్ను చేరుకున్న నదులని చూసి "మీరు పెద్ద పెద్ద వృక్షాలు పీక్కొని రావడం నేను చూస్తున్నాను. కాని ఎప్పుడూ వెదురు చెట్లేవీ కనిపించకపోవడం నాకు ఆశ్చర్యంగా ఉంది!" అని అన్నాడట. అతనికి దొరికిన జవాబు ఇది. "అహంకారంతో ఎదురొచ్చిన వృక్షాలని పీకడం సులభం. కాని వొంగి అణకువతో మేం దాటినతరువాత తలెత్తే చెట్లని పీకడం అంత సులభం కాదు!" నమ్రత శక్తి గురించి ఈ కథ మనకి చెప్తోంది. ఒక మంచి ఉదాహరణ.

లక్ష్మి మనసులో గర్వం లేదు. కాని ఆమెలో ఇప్పుడు అణకువే చోటుచేసుకుంది. అదే దాని ఉత్తరం నాకు చెప్తోంది. సాధువుగా కనిపించిన ఆ ఉపకార స్త్రీని చూసి నేను ముందు జంకాను. తరువాత ఆమె దృఢసంకల్పం నాకు బోధపడింది. ఆవిడ మనసులో ఈర్ష్య రవంతైనా లేదు. "ఎంత విచిత్రమైన వ్యక్తి!" అని లక్ష్మి ఆవిడని పొగడుతోంది!

"ఎనిమిది మాసాలు మోసి ఆఖరికి నా శిశువుని పోగొట్టుకున్నాను. ఏం, ఎందుకు? గర్భం ధరించిన రోజు మొదలుకొని నేను అనుభవించిన మనోవ్యధే కారణం. పుట్టిల్లుకి హాయిగా వెళ్లకుండా ఇక్కడే అన్ని బాధ్యతలు మోస్తున్నాననే బాధ. తన దేహాన్ని లక్ష్యం చెయ్యక నిండు మనసుతో మనకి సేవ చేసిన ఆ పుణ్య స్త్రీ - ఉపకారి- నిండు చూలాలు కడుపులో శృంగేరి నివాసిని శ్రీ శారదాదేవి పుట్టాలి."

లక్ష్మి తనలాగే కడుపుతోవున్న ఇంకొక స్త్రీ సేవని చూసిన తరువాత తన 'పొరబాటు' గ్రహించింది. ఆ ఉపకారి అగపరచిన శక్తి జ్వాలలో లక్ష్మి మనసు కరిగిపోయింది.

‘మన అమ్మాయి చిన్నబుచ్చుకుంటోంది’ అని నేను బాధపడలేదు; నా అజ్ఞానమూ మాయమైపోయింది! మా శ్రింగేరి ప్రయాణం గురించి అడిగినవారితో హోమాలగురించి మాత్రం మాటాడాలని నేను పూనుకున్నాను. దానికి కారణం ఏమిటో తెలుసా? ఎవరైనా, ఎప్పుడైనా లక్ష్మి మనసు చెదరగొట్టినట్టు ఏమైనా పలుకుతారో అని నాకు భయం! ‘చూలు పాడైన స్త్రీ, గర్భవతి ఎదురుపడకూడదు’ అనేది ఒక పూర్వకాల నమ్మకం. అందువలనే లక్ష్మితో వెళ్ళిన చోట ఒక నిండు చూలాలు ఉన్నట్టు నేనెవరికీ చెప్పలేదు.

లక్ష్మికి సంస్కారం తెలుసు! అది ఇప్పుడు నాకు తెలిసింది! అజాగ్రత్తవలన ఎవరైనా అలా మాటాడివున్నా లక్ష్మి బాధపడివుండదు; ఆమె తల వంచి ఆ ఉపకారి స్త్రీ దగ్గర శరణుకోరింది.

పాలని మరుగపెట్టి, పెరుగుగాచేసి పెరుగుని చిలిపి పెరుగునుండి వెన్నతీసినట్టు - నేను కని, పోషించిన నా కూతురు లక్ష్మి ప్రవర్తన గురించి నాకు తెలియదా?

లక్ష్మిలో సభ్యత, సంస్కారం నిత్యమూ చోటుచేసుకున్నాయి. అందువలనే ఆ స్త్రీతో రాజీపడింది; అది యాత్రమార్గంలో లక్ష్మికి లభించిన అదృష్టం!

హోమాగ్నికంటే పొయ్యిలో అణిగిన అగ్ని గొప్ప అని లక్ష్మి అంటోంది. నెయ్యితో వివిధ పదార్థాలను మింగే హోమాగ్ని కంటే నెయ్యితో రకరకాల వంటకాలని పక్వం చేసి మనకి అందించే పొయ్యిలోని అగ్ని శ్రేష్టమైనది అని ఆమె ఉద్దేశం. అదే అణకువతో, పరోక్షంగా చేసే సేవ ఎంత శక్తివంతమైనది అని మనం గుర్తించాలి.

** ** **

ఊరుకి తిరిగివెళ్ళిన లక్ష్మి అక్కడ నెయ్యిలాగ పరిమళించింది; నేను దూరంనుంచే ఆ సుగంధం అనుభవించాను.

నేను దాన్ని రమ్మని పిలిచాను, కాని లక్ష్మి రాలేదు. ఇల్లు వదిలి నా దగ్గరకి రావడానికి సాధ్యం కాలేదు; దానికని బాధ్యతలున్నాయిగా!

నాకిప్పుడు బోధపడింది: లక్ష్మిని దోషారోపణ చెయ్యకూడదు! నాకు మాత్రం అన్నీ తెలుసని భ్రమ కూడదు! వెన్న కరిగి తేమ తొలగిన తరువాత నెయ్యి లేత పసుపురంగులో మారుతుంటే అదెక్కడ మాయమైంది అని విడ్డూరంగా

చూస్తున్నాను! నాకు జబ్బుగా ఉంది, లక్ష్మి రాకూడదా అని నా దుఃఖం. అందువలనే మనసులో ఈ ఆరటం. ఎలాగో, పోనీ! నేను ఇంకొక తీర్థయాత్రకి వెళ్ళాలనుకుంటున్నాను! నా కూతురు నాతో రానక్కరలేదు. అది అక్కడే ఉండనీ!

********

**(మూలం ప్రచురణ: స్వదేశమిత్రన్, అక్టోబర్ 9, 1955)**

# మరో ప్రపంచం

తోటలో, ఒక మూల, పిల్లలు రాళ్ళు, కొయ్యపుల్లలు, ఇసుక, పచ్చగడ్డి - వీటితో ఒక కోట కట్టుకుంటున్నారు; ఆ ముచ్చట చూస్తూ నేను నిలబడ్డాను. యుద్ధభూమిగా మారిన ఇంటిలోకి తిరిగి వెళ్ళడానికి నేను జంకాను. లోపల వదిన ఏమేమో చెప్పుకుంటూ వాపోవడం ఆరంభించగానే ఇవతలకి వచ్చేసాను; కనీసం పదినిమిషాల తరువాతే వదిన నోరు మూసుకుంటుంది కాబోలు!

"అత్తయ్యా, కోట బాగుందా?" అని అడిగింది మేనకోడలు కలా. ఆరేళ్ళ మేనల్లుడు శేఖర్, నాలుగేళ్ళ బాల కలా కట్టే కోట ఎలా ఉంటుంది? నేను వెటకారంగా నవ్వేసి, "బాగానే ఉందిలే!" అని అన్నాను. "నాకు తెలుసు, ఇదేం బాగా లేదు!" అని అంటూ కోటని కాలుతో ఒక తన్ను తన్ని, అది కూలిపోవడం లక్ష్యం చెయ్యక, నన్నూ, కలాని నవ్వబెట్టి, తను నవ్వుతూ, శేఖర్ పరుగెత్తాడు; కలాకూడా వాడివెనుక పరుగెట్టింది.

నేనెక్కడికి వెళ్తాను? ఇరుగుపొరుగులవారితో నాకింకా పరిచయం కాలేదు. ఇంట్లోకి వెళ్దామంటే బాధగా ఉంది. వదిన వైఖరి నాకు బోధపడితేనా? "వేసవి శెలవులకి మా ఊరు ప్రసిద్ధి, తప్పకుండా నువ్వు రావాలి!" అని పదే పదే వదిన పిలవడం వలన నేను కిందటి వారం వచ్చాను. కాని అంతలోనే వదిన రెండుసార్లు తనకీ ప్రపంచంమీదున్న విరక్తిని నాకు వల్లించేసింది! అది చాలామందిలాగ, మామూలుగా మాటాడిందని నేను ఊరుకోవచ్చు; నాదగ్గర వదినకి ఎటువంటి ఉదాసీనత లేదని నాకు బాగా తెలుసు. కాని అన్నయ్యతో మాత్రం ఎందుకు ఆ సణుగు? వదినతో స్వేచ్ఛగా మాటాడుకుందాం అనేకదా నేనిక్కడికి నేను రావడం? కాని అది ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ అంగలార్చుకోడమే నేను రోజు చూస్తున్నాను. వదిన పిలిచిందని నేను ఇక్కడకి రావడం నేను చేసిన పెద్ద పొరబాటేమో? ఇరుకుగా ఉన్నట్టు ఆకాశంలో తారలు కనిపించినా వాటిమధ్య బ్రహ్మాండమైన దూరం ఉందికదా? అలాగేనా నాకూ వదినకూ మధ్య ఉన్న దూరం?

అంత ఎందుకు, వదిన అన్నయ్య మధ్యకూడా అలాగానేమో అనిపిస్తోంది! అబ్బబ్బా, దాంపత్య జీవితం వద్దని నేను ఉద్యోగంలో చేరినది ఎంత మంచి పని!

ఇందులో వినోదం ఏమిటంటే భర్త అదుపులో చిక్కకూడదనే ఉద్దేశంతోనే నేను పెళ్లి చేసుకోలేదు; ఉద్యోగంలో చేరినది సముచితమైన పని అని ఇప్పుడు ఋజువైంది!

వదిన అన్నయ్యకి రెండో పెళ్ళాం కావడం వలన ఇలా బాధపడుతోందా? అదీ సహజమేకదా? "నేను పోతే మీకేం నష్టం? ఇంకొక భార్య వస్తుంది!" అవి తరచుగా, ఆవేశంతో వదిన అనడం నేను వింటున్నాను. అవును మరి, మొదటిభార్య పోయిన రెండు సంవత్సరాలలో రెండవ భార్యని చేపడ్డిన మగవాడిని మరెలా వర్ణించడం? కాని అందుకోసం వదిన ఇంత కఠినంగా మాటాడాలా? అన్నయ్యకీ ఇంత వైరాగ్యం వద్దనిపిస్తోంది . . . 'నా జీవితంలో ఇతనికి మాత్రమే స్థిరమైన ఉనికి!' అనే ధ్యానం వదిన అణచుకోవాలి. అన్నయ్యకూడా ఎప్పుడైనా ఒకసారి, "అవునే, విను! ఇది నిజం, నువ్వు పోతే నేనేం కూలిపోను!" అని వదినకి చెప్పితీరాలి! భర్త భార్యమీద అధికారం చెలాయించడం నా నియమంకి విరుద్ధమే! కాని ఊగులాడుతున్న పురుషత్వంని ప్రేరేపించకపోతే ఎలాగ?

ఇంతకీ వదినకి మంచి ఆరోగ్యం ఉంది; అన్నయ్యే నాలుగు మాసాలముందు ఒక వారం హాస్పిటల్లో ఉన్నాడు. మరెందుకు వదిన తన ప్రాణం గురించి, తను కన్ను మూయడం గురించి నిత్యమూ మాటాడుతోంది?

ఇక్కడ వచ్చినప్పటినుంచి నా మనసులో ఏదో తెలియని ఆందోళన; ఇప్పుడుగాని నాకు విద్యార్థుల వ్యాసాలు దిద్దే బాధ్యతవుంటే ఎంత బాగున్ను అనిపిస్తోంది! ఈ తోట చిన్నదే, కాని బాగుంది; ఐనా ఎంతసేపు దాన్ని చూస్తూ నిలబడడం?

కొంతసేపు తరువాత నేను ఇంట్లోకి వెళ్ళాను; తిన్నగా వంటగదికి నడిచాను. వదిన పొయ్యిని రెప్పవాల్చకుండా చూస్తూ కూర్చొనివుంది.

నన్ను చూడగానే వదిన లేచి పక్కనేవున్న అల్మారా తెరిచింది.

"భామా, చూసావా ఈ గందరగోళం? ఇదెలా భరించడం, చెప్పు? శుక్రవారం కంచు గిన్నె విరిగితే అశుభం! ఇదేం గరిటె, చెంచా కాదు, పెద్ద పాత్ర! చూడు,

రెండుగా పగిలిపోయింది! మరింటి గతి ఏమౌతుందో ఎవరికెరుక? అడిగితే 'చెయినుంచి జారిపోయిందమ్మా!' అని పనిమనిషి చెప్తోంది! ఈ తొమ్మిది మాసాలలో ఎన్నిసార్లు అది పడలేదు? ఇవాళ మాత్రం ఎందుకు విరగాలి, చెప్పు! ఇక ఏ ఘోరంవచ్చి మన నెత్తిమీద పడుతుందో? నాకు భయంగా ఉంది! . . . చూడు, ఇది చాలా మేలైన కంచు, ముట్టుకొని చూడు!"

అలా అంటూ వదిన విరిగిన రెండు ఖండాలు నాకు అందించింది; గతించిన శిశువుని మోస్తున్న దీనమైన తల్లిలాగవుంది దాని వాలకం.

"వదినా, ఎన్నిసార్లో కింద పడినందువలనే ఆ గిన్నె ఇవాళ విరగడం జరిగింది. ఐతేనేం, మీకెందుకు గాబరా? దాన్ని లోపల ఉంచేయండి! . . . రండి, మనం 'వాకింగ్ వెళ్దాం!'" అని పిలిచాను. 'కంచుగిన్నె విరిగితే ఆ ముక్కలు అమ్మి ఆ డబ్బుతో ఇంకొక గిన్నెకొనవచ్చుకదా?' అని అడగాలని నాకనిపించింది - కాని నోరు మూసుకున్నాను. అలా అడిగితే వదిన మనసు ఇంకా తీవ్రంగా బాధపడుతుంది; ఒక భార్య పోతే ఇంకొక భార్య లాగ - అదీ సులభంగా సాధ్యమని నేను సూచించినట్టవుతుందికదా?

ఐనాకూడా వదిన దిగులు పిచ్చితనం అనవచ్చా? కంచు గిన్నె విరగడానికీ వదిన బెంగకీ అన్యోన్య బంధం ఉందేమో? మంగళం వదినలాగ దీనికీ అదే గతి వస్తే? . . . మళ్ళీ అన్నయ్య . . . ఛీ, ఛీ . . . ఇదేం జన్మ! . . . మగ జన్మ వద్దు! . . . ఆడ జన్మా వద్దు! . . . ఈ ప్రపంచంలో నాకెది చూసినా రోతగా ఉంది!

నాకు వెంటనే అన్నయ్యమీద అసంతృప్తి, వదినమీద జాలి కలిగాయి. "వదినా, మీరు కొత్త చీర కట్టుకొని రెడీ అవండి, నేను పూలు తీసుకొని వస్తాను!" అని నేను తోటకి వచ్చిచేరాను. నా మనసు తారుమారైంది; భర్త లేకుండా జీవితం గడపాలని నిశ్చయించిన నేనిప్పుడు పువ్వులతో వాటిని గూర్చడానికి దారం లేకుండా తిరిగి వస్తున్నాను! ఎంత చోద్యం! నా ఆలోచనలు, భావనలు, పటాపంచలైపోయాయి!

మేమిద్దరం ఇరుగుపొరుగులకి వెళ్ళకుండా తిన్నగా కోవెలకి వెళ్ళాం. అక్కడ పూజారి ఎవరికోసమో కుంకుమార్చన చెయ్యడం చూసాం. చాలా సొగసుగా అతను నామావళి వల్లించడం చూస్తూ నేను నిలబడ్డాను. ఒకసారి తలతిప్పి వదినని చూసాను. ఆశ్చర్యం, దాని కళ్ళు బాగా తడిసిపోయాయి! నాలుగురోజులముందు

ఇదే సన్నిధిలో వదిన ఆవేశంతో నిలబడినది నాకు జ్ఞాపకం వచ్చింది, కాని అప్పుడు ఇలా కన్నీరు కార్చలేదు! ఇప్పుడు ఏమైందని? కంచు గిన్నె విరిగిందనా? అవును, అదే కారణమైవుండాలి.

కోవెలనుంచి తిరిగివచ్చినప్పుడు నేను వదినని అడిగేసాను.

"మీరు ఏంకావాలని వేడుకున్నారు? కళ్ళ నీళ్ళుపెట్టుకున్నారు . . . " అని అడిగాను. "మరేం ప్రార్ధన? 'దేవుడా, నన్ను రక్షించు! అని వేడుకున్నాను," అని బదులు చెప్పింది.

రెండురోజుల తరువాత ఇంటిలో మళ్ళీ ఆరాటం. మేయడానికి వెళ్ళిన ఆవు ఇంటికి తిరిగిరాలేదు. ఉదయం మేతకి వెళ్ళే ఆవు మధ్యాహ్నం మూడుగంటలకి రాలేదని వదిన కలవరపడింది. "వదినా, రేపు వచ్చేస్తుంది," అని నేను ధైర్యం చెప్పాను. కాని రెండురోజుల్లో దాని గతి తెలిసిపోయింది; వదిన వెక్కివెక్కియేడ్చింది. సకునాలు, సూచనలతో మానసిక వ్యధ మరింత తీవ్రంగా పెరుగుతుందని నేను వదినకి హెచ్చరిక చేసాను. కాని అశుభమైన ఘటనలు చూసి వదిన కంపించిపోతే నేనేం చేస్తాను? నా మనసులోకూడా జరుగతున్నవన్నీ అశుభ ఘటనలేమో అని చిన్న అనుమానం కలిగింది.

శెలవులని వచ్చిన రోజుల్లో ఇంకా నాలుగవ వంతుకూడా అవలేదు, కాని చాలా రోజులైనట్టు నాకనిపించింది. ఇక మిగిలిన రోజులు మగ్గిపోయి సారంలేకుండా ఇక్కడే గడపడానికి నాకు ఇష్టం లేదు. ఇంతలో ఒక మంచి తరుణం వచ్చింది. ఒక తరగతిలో పాసయి ఇంకో తరగతి వెళ్తున్నట్టు, సంతోషంతో మా పెద్దన్నయ్యని కలుసుకొనే ప్రయాణంకి నేను సిద్దమైయ్యాను. ఇక ఈ వదినగారి మొఱలు, ఆర్తనాదం మరెవరు వింటారు? రెండునెలల నివాసంకి వచ్చి ఇరవైరోజులవకముందే నేను వెళ్తున్నానని అన్నయ్యా, వదినా బాధపడ్డారు. బయలుదేరే సమయం నాకూ ఒక ఆలోచనతోబాటు భయమూ కలిగింది: 'నేను ఈ ఇంటి ఆడపడుచుగా వచ్చాను. ఇన్నిరోజులూ ఏమీ అనకుండా ఇప్పుడు గభీమని ఈ ప్రయాణంకి సరేనన్నాను! అందువలన వీళ్ళకేమైనా హాని కలుగతుందేమో?' దేవున్ని వేడుకున్నాను; అన్నయ్య, వదిన దగ్గర సెలవు తీసుకున్నాను.

సెలవులలో చాలా రోజులు పెద్దన్నయ్య ఇంటితో సాగాయి. నా స్కూలు తెరిచే వేళ మా ఊరుకి వచ్చి చేరాను. ఒకరోజు క్లాసులో బాబర్ పాదుషా తన కొడుకు హుమయూన్ కోసం తన ప్రాణం త్యాగం చేసిన చోద్యం వివరించాను.

"'ప్రాణం అంటే అందరికి తీపే!' అనే సామెత నాకు తెలుసు. కాని నా మనసులో మాత్రం వేరే విధమైన అభిప్రాయం ఉంది. మనకని చావు వచ్చినా లక్ష్యం లేదు, కాని ఇతరులు కన్ను మూయడం చూస్తే శ్రమగా ఉందనిపిస్తోంది. "చివరికి  చావని వస్తే ప్రతీ వ్యక్తికి అది తీపిగా ఉంటుందేమో?" అని ఒక ప్రశ్న అడుగుతున్నట్టు నా మనసులోని సొంత భావనలు నేను క్లాసులో తెలియజేసాను. అప్పుడు ఆకాంశంలో కనిపింటే ఒంటి తారలాగ మిణకరించుతూ వదిన ముఖం నా మనసులో కనిపించింది. 'వదినా, మీది అపూర్వమైన మనసు! మీ ఆలోచనంతా నిత్యమూ  మీ ప్రాణం గురించే! అది మంచిదికాదు! మీరు పోయినతరువాత అన్నయ్య ఇంకొక పెళ్ళి చేసుకుంటేనేం, చేసుకోకపోతేనేం? అతని కొత్త జీవితం మిమ్మల్ని ఏమీ చెయ్యదుకదా?' అని దుడుకుగా  కన్నుగీటుతూ చెప్తున్న ఇంకొక తారలాగ మిణుకుతున్నట్టు నా ముఖమూ కనిపించింది; నిగనిగమని మెరుస్తూ ఒక గ్రహంలాగ అన్నయ్య ముఖమూ కనిపించింది!

గభీమని ఒకరోజు ఆకాశంలోనుంచి  ఆ దృశ్యం జారుకుంది! వదిన - నేను మూడు నెలలు కలిసి మెలగిన వదిన - కన్ను మూసేసింది! "వదినా, మీ భయమే మిమ్మల్ని చంపేసింది!మీరన్నట్టే ఐంది!" అని నేను ఏడ్చాను.

స్వయంగా వెళ్ళి నేను అన్నయ్యకి సానుభూతి ఇవ్వలేకపోయాను. అందుకు నాకు మనసూ లేదని చెప్పాలి. అన్నయ్య పడుతున్న దుఃఖం నేను కొంచెం తక్కువగానే అంచనా వేసాను. కాని ఈ సమయం వాడు  బాధ పడుతుంటాడుకదా? ఒక ఉత్తరం రాసాను.

"అన్నయ్యా, వదిన మాటలన్నీ మళ్ళీ మళ్ళీ గుర్తు చేసుకుంటే నాకు చాలా బాధగా ఉంది. తన అంతిమకాలంగురించి వదినకి ముందే ఎలాగ తెలిసిందని నాకు వింతగా ఉంది. దాని స్థానంలో ఇంకొక స్త్రీ రాకూడదు అని నా ఉద్దేశం!" అని నిష్కపటంగా రాసాను.

అన్నయ్య ప్రత్యుత్తరం మరుటపాలో వచ్చేసింది:

"భామా, దాని స్థానంకి ఎవరు రాగలరు, చెప్పు! నీ వదిన నాకోసం తన ప్రాణం త్యాగం చేసేసింది. నువ్వన్నట్టు అది తన ప్రాణంకోసం బాధపడలేదు. తనకి అమంగల్యం వస్తుందేమో అనే దానికి బెంగ! నాగురించే దాని ఆరాటమంతా! తను రెండో భార్య అనే కారణం వలన కాబోలు వైధవ్యం తనకి తప్పనిసరి అని భయపడుతూనే రోజులు గడిపింది. 'మీకింకో బతుకుంది, నాకేముంది?' - ఇదే దాని మాటల్లోని సందేశం. నేను హాస్పిటల్లో ఉన్న రోజులనుంచి ఇదే పాట! దానికి తగినట్టుగా ఇంట్లోనూ అశుభంగా ఘటనలు చోటుచేసుకున్నాయి . . .

నీ వదిన ప్రేమానురాగాన్ని దాని మోటుతనం పూర్తిగా కప్పేసింది, ఇతరులకది అర్థంకాదు. ఆ మోటుతనం ఖాధీ వస్త్రంలాగ. నాకోసమే అది సణుగుతోందని నాకు బోధపడింది. కాని నేను దాన్ని సవరించలేకపోయాను. పాపం, అది నా ప్రాణంకోసం తహతహలాడిపోయింది. ఒకరోజు కొబ్బరిచెట్టుమీద పిడుగు పడింది. అంతే, అపసకునం అని జ్వరంలో పడిపోయింది!"

ఇదే అన్నయ్య రాసాడు.

నేను పెళ్ళి చేసుకోలేదు. వదినా, అన్నయ్య మధ్య ఉన్న దాంపత్యంలో దాగివున్న రహస్యం - అన్నయ్య మౌనంగా పాటించిన అనుకంప, వదిన సణుగుల్లోని గూఢార్థం - నేను గ్రహించలేకపోయాను.

స్కూలు వరాండాలో నిలబడుతూ ఒక అమ్మాయి స్కిప్పింగ్ తాడుతో గంతులేయడం నేను చూస్తున్నాను. ఆమె ఆ రోజు నా హిస్టరీ క్లాసులో నన్ను ఒక ప్రశ్న అడిగింది: "బాబరు తన కొడుకు రోగి హుమయూన్ బతకాలని తన ప్రాణం త్యాగం చెయ్యడం నిజంగానే జరిగివుంటుందా?" అని. నా వదిన జీవితంలో జరిగిన వింతగురించి ఆమెకి చెప్తే నా మనసు కొంచెం కుదుడపడుతుందేమో అని నేను ఆలోచించాను, కాని ఏమీ అనక ఊరుకున్నాను. 'నాకూ మరో ప్రపంచం కాచుకొనివుంది. నా ఆత్మీయతని

పంచుకోడానికి ఒక partner తప్పకుండా కావాలి!' అని నా వైరాగ్య మనసులోనూ ఒక అభిలాష లేచింది. రాబోయో మావారికు నా మనసు విప్పి అన్నీ చెప్పేయాలని నేను ఆతురతో ఉన్నాను!

********

**(మూలం ప్రచురణ స్వదేశమిత్రన్, ఏప్రల్ 5, 1951)**

# భలే, మంచి ప్రశ్న!

భళ్ళుమని తెల్లవారిజామున చెల్లమ్మాళ్, కొడుకు కిట్టు అతనున్న ఊరుకి ప్రయాణం చేస్తూన్నారు; మనసులో ఆవిడకి ఏవేవో ఆలోచనలు. ఆవిడకి ముగ్గురు కొడుకులు. కిట్టు మాత్రం ఉద్యోగరీత్యా బదిలీయై వేరేవేరే ఊరులకి మారుతూ ఉంటాడు. కిట్టుని చూడాలని వచ్చినప్పుడెల్లా ఆవిడ ఒక కొత్త ఊరుకి రావడం జరుగుతుంది; అదే ఆవిడ పడుతున్న బెంగకి కారణం. తక్కిన ఇద్దరు అబ్బాయిలని చూడడానికి వెళ్తే అక్కడ సుపరిచితమైన ప్రజలుంటారు, వాళ్ళూ స్వాగతం చెప్తారు. కాని కిట్టు ఉన్న ఊరుకి వచ్చినప్పుడెల్లా కొత్త పరిసరాలు, ఇరుగుపొరుగుల్లో కొత్త ముఖాలు చూసి ఆవిడ మనసులో ఆందోళన చోటుచేసుకుంటుంది. కోడలు, మనవడు, మనమరాలు - వీళ్ళ ప్రేమానురాగాలు మాత్రమే చెల్లమ్మాళ్ అనుభవించడం జరుగుతుంది. తక్కిన కోడళ్ళలాగే కిట్టు భార్య సరళ అతిధి సత్కారంలో చెయితిరిగిన మనిషి. ఐనాకూడా కిట్టుని చూడడానికి వచ్చినప్పుడెల్లా చెల్లమ్మాళ్కి ఉత్సాహం కొంచెం తక్కువే. ఇప్పుడూ ఆవిడ మనసులో ఆరాటం ఏలుకొనివుంది.

కిట్టు రైలుస్టేషన్ లో తల్లిని కలుసుకున్నాడు. ఇప్పుడు ఇంటికి వస్తున్నప్పుడు దారిలో కనబడిన స్థలాలు, ఊరు కబుర్లు చెప్పుకుంటూ వచ్చాడు.

“మన వీధి వచ్చేసింది! అదిగో, అదే మన ఇల్లు!” అని కిట్టు చెయి ఎత్తి తల్లికి చూపించాడు.

దాన్ని చూడకుండా చెల్లెమ్మాళ్ ఆ పొడుగాటి వీధిలోవున్న తక్కిన చాలా ఇళ్ళని చూసారు. ‘అబ్బోయ్, ఇక్కడ చాలామంది ఉన్నారన్నమాట!” అని ఆవిడ గుండేయదరు పెరిగింది.

గుర్రంబండి ఇంటిముందు ఆగింది; కిట్టు దిగినతరివాత తల్లి దిగారు.

దిగినవెంటనే ఆవిడ దృష్టి పక్కింటి వసారాలో నిలబడి ముగ్గులు వేస్తున్న ఒక పిల్లకి ఏమో చెప్తున్న ఒక మహిళ మీద పడగానే - ఆవిడకూడా ఒక తల్లి, తనలాంటి మనిషే - అని చెల్లెమ్మాళ్ ఒక క్షణంలో అంచనా వేసారు. వెంటనే ఆ నమ్మకంతోబాటు

ధైర్యమూ వచ్చింది; ఓర్పు కలిగింది. తనకి తగిన ఒక మంచి స్నేహితురాలు ఈ ఊరులో దొరికిన సంతోషంతో కిట్టువెనుక ఆవిడ ఇంటిలోకి నడిచారు.

శుభం పలికిన తరువాత సరళని చెల్లమ్మాళ్ అడిగిన మొట్టమొదటి ప్రశ్న ఆ పక్కింటి స్త్రీ గురించే; ఆ రోజు మధ్యాహ్నమే పక్కింటికి వెళ్ళి ఆవిడతో పరిచయం చేసుకోవాలని అభిలాష కలిగింది. అది గ్రహించి సరళ అత్తగారువెంట వెళ్ళింది.

ఆ మహిళకూడా తాళిబొట్టు కోల్పోయిన స్త్రీయే. 'మా ఇద్దరికీ పొత్తు ఉంది. దానిగురించి ఇతరులెవరైనా ఊసులాడుతారేమో? కాని సుబ్బలక్ష్మి అమ్మాళ్ నాకు తగిన నేస్తురాలు, ఈ కొత్త ఊరులో నాకు దొరికిన జట్టు,' అని చెల్లమ్మాళ్ ఆలోచిస్తూ వెళ్ళారు.

సుబ్బలక్ష్మి అమ్మాళ్ ఇద్దరికీ స్వాగతం చెప్పారు. సరళతో చనువు లేకపోవడం వలన ఆవిడ చెల్లమ్మాళ్ తోనే ఎక్కువగా మాటాడారు. 'అది సహజమేకదా?' అనే భావన చెల్లమ్మాళ్  మనసులో ముందు చోటుచేసుకుంది. కాని క్రమేపి ఆవిడ మాటల్లోని విరక్తి, ఎడబాటు గమనించిన తరువాత ఆ ఉత్సాహం శమించింది. జరుగుతన్న సంభాషణలో ఎటువంటి శ్రద్ధ చూపించనట్టు సుబ్బలక్ష్మి అమ్మాళ్ కోడలు హేమా కనిపించింది; చెల్లమ్మాళ్ కూడా తన మానసికశ్రమ అలాగేవుందని బాధపడ్డారు.

చాలా ఆతురతతో వచ్చిన చెల్లమ్మాళ్ వచ్చిన పది నిమిషాలలోనే నిష్క్రమించాలని తొందరపడ్డారు. "ఇక మనంవెళ్దామా?" అని ఆవిడ సరళని అడగ్గానే సరళ హేమాతో ఒకటో రెండో మాటలాడి, సుబ్బలక్ష్మి అమ్మాళ్ దగ్గర సెలవు తీసుకొని ఇంటికి బయలుదేరింది.

చెల్లమ్మాళ్ మనసు తారుమారైంది. పొరుగింటిలో సుబ్బలక్ష్మి అమ్మాళ్ యజమాని! అందుకే అధికారం అలా చెలాయిస్తోంది! ఈ ఇంటిలో ఆ హోదా సరళ వహిస్తోంది! వయసు మళ్ళిన రోజుల్లో తన కొడుకుల ఆశ్రయంలో జీవించే తనకేం హోదా ఉందని? తన భర్త కొడుకులకని గొప్పగా ఆస్తి వదలిపెట్టలేదు, కాని తన భార్య ఆస్తిని పుత్రులు, కోడళ్ళు పంచుకోవాలని అతని ఉద్దేశం; అసవరమని వస్తే ఏ అబ్బాయికైనా ఆర్థిక సాయమూ, ఆ కోడలికి స్వాతంత్ర్యమూ నిష్పక్షపాతంగా ఇవ్వాలనిఅతని కోరిక.

సుబ్బలక్ష్మి అమ్మాళ్ తనతో సరిగ్గా మాట్లాడలేదంటే అందుకు కారణం లేకపోలేదు; ఆవిడకి సిరిసంపదలు, గౌరవం ఉన్నాయి. వితంతుపైనా ఆవిడ రెండు చేతుల్లోనూ బంగారు గాజులు, మెడలో గొలుసు, విలువైన పట్టుచీర ధరించి కనిపిస్తున్నారు. ఆవిడతో తన్ను పోల్చుకొని ఆవిడ స్నేహంకోసం తాపత్రయపడడం పెద్ద పొరబాటని చెల్లమ్మాళ్ ఇప్పుడు గుర్తు చేసుకున్నారు. అసలు నిజమేమిటంటే స్వభావంగా సుబ్బలక్ష్మి అమ్మాళ్ పరువు, ప్రతిష్టతో తన కొడుకు, కోడలుతో ఉంటూ ఇరుగపొరుగుల మర్యాదకీ, అభిమానంకి అర్హులయ్యారు. దారిలో పోతున్న తనవంటి వ్యక్తిని లెక్కచెయ్యకుండా ఆవిడ సరళతో మాటాడితే అందులో ఆశ్చర్యమేముంది?

ఈ ఆలోచనలతోబాటు చెల్లమ్మాళ్ అనుభవించిన నిరాశ, అలసట తగ్గనేలేదు. రెండుమూడు సంవత్సరాలుగా తనేదో దేశదిమ్మరిలా ఊరక తిరుగుతున్నట్టు ఆవిడకనిపించింది. ఇంతవరకూ 'మనకిది చాలు, మరేం వద్దు!' అనే భావనలో ఆవిడ ఏదీ పట్టించుకోలేదు. కాని ఇప్పుడు వెళ్ళినచోట తను అనుభవించిన ఉదాసీనత చూసి ఆవిడ అల్లాడిపోయారు.

పొరిగింటి మహిళతో స్నేహం కావాలనే ఆతురత కొంతమట్టుకు అణగింది; ఎప్పుడైనా వసారాలో లేక వీధిలో ఆవిడని చూస్తే చెల్లమ్మాళ్ గభీమని చూసీ చూడనట్టు తల తిప్పుకున్నారు; పరిచయమైన ఇతరులతోకూడా ఎక్కువగా సంప్రదించడం మానుకున్నారు. వీలైనంతవరకు తన భావనలు తనలోనే దాచుకొని, తన పనేదే దాన్ని చూసుకొని రోజులు గడిపారు. చాలామట్టుకు తనలాగ కనిపించిన సుబ్బలక్ష్మి అమ్మాళే తన్ను నిర్లక్ష్యం చేస్తే ఇతరులు తన్ను ఇంకా చులకనగా చూస్తారేమో అన్న భయం ఆవిడకి కలిగింది కాబోలు! పక్కింటిలో సుబ్బలక్ష్మి అమ్మాళ్ తన పనిమనిషినిగాని, నౌకరీనిగాని తిట్టితే ఇక్కడ చెల్లమ్మాళ్ నోరు పెగలదు! ఇక్కడ కోడలు సరళకదా ఇంటికి యజమానిగా, పనిమనుషులని ఏలుతుంది! తనకది సాధ్యం కాదే! కాని మనసులో 'ఇలా ఉపేక్ష వహించడం నేను చేస్తున్న పొరబాటేమో?' అని చెల్లమ్మాళ్ బాధపడ్డారు.

ఇటువంటి పరిస్థితిలో మనసు కుదుటపడాలని చెల్లమ్మాళ్ తన ప్రవర్తన మార్చుకున్నారు. ఇంటిలో అత్యంత పనుల్లోనే పాల్గొనాలని నిశ్చయించి అలాగే

మెలిగారు. ఆవిడ ఎది, ఎలా చేసినా అడ్డుచెప్పడానికి ఎవరూ లేరు. 'వయసు మళ్ళితే అత్తగారు క్రమంగా బాధ్యతలు త్యజించడం సహజమేకదా?' అని ఊహించి సరళ ఏమీ అనకుండా ఊరుకుందేమో?

ఈసారి తన మనశ్శాంతికి భంగం కలిగిందని చెల్లమ్మాళ్ తొందరగానే ఇక్కడనుంచి ఇంకోక అబ్బాయిని చూడడానికి వెళ్ళాలని నిశ్చయించారు. దానిగుంచి పరిచయమైన ఇద్దరు ముగ్గురితో ప్రస్తావించారు; బయలుదేరడానికి ముందురోజు సుబ్బలక్ష్మి అమ్మాళ్ని చూసి సెలవు తీసుకోవాలనుకున్నారు.

ఈవిడ బయలుదేరడానికి నాలుగురోజులముందు సుబ్బలక్ష్మి అమ్మాళ్ ఏదో పనిమీద వచ్చారు. కోడలిని లేక పనిమనిషిని పంపకుండా తనే ఏదో సరకు కావాలని ఆవిడే రావడం జరిగింది. వచ్చిన పని పూర్తవగానే తిరిగి వెళ్ళకుండా చెల్లమ్మాళ్ని చూసి "ఏంటి, మీరు ఊరుకి వెళ్తున్నారని విన్నాను. ఎందుకు తొందరపడుతున్నారు? వచ్చి రెడుమాసాలుకూడా అవలేదే?" అని అడిగారు.

"ఆ కోడలికి జబ్బుగా ఉంది . . ." అని చెల్లమ్మాళ్ ఈడ్చారు.

"జబ్బంటే వెళ్ళవలసిందే! కాని ఇంత త్వరగా వెళ్ళాలా? సరళాకి అన్నీ తెలుసు, మిమ్మల్ని కూచోబెట్టి అన్ని విధాలా సేవ చేస్తోంది! ఇంకో నాలుగు మాసాలుండి వెళ్ళవచ్చు! తొందర ఎందుకు?" అని గట్టిగా సుబ్బలక్ష్మి అమ్మాళ్ అన్నారు. అధికార ధ్వనితో పలికే అత్తగారి మాటలవి. చెల్లమ్మాళ్కి ఒక పక్క మనోవ్యధ, ఇంకొక పక్క ఓదార్పు కలిగాయి.

సుబ్బలక్ష్మి అమ్మాళ్ అలా అంటున్నారంటే అది ఆవిడమట్టుకు సరే: ఆవిడకి ఒకడే కొడుకు; వాడితోనే ఉండాలనే నియమంతోనూ, హక్కుతోనూ, గౌరవంతోనూ ఒకే చోట ఆవిడ అధికారం చెలాయిస్తూ ఉంటున్నారు. ఆవిడలాగ మెలగడానికి తనకేం ఉంది? మానసిక బాధ పడుతూనే మెల్లగా చెల్లమ్మాళ్ నవ్వారు.

"అక్కడ పరిస్థితి అలాగుంటే నేను వెళ్ళకుండా ఉండగలనా?" అని అడిగింది.

'ఇక్కడ పరిస్థితి ఇలాగున్నప్పుడు . . . ' అని అనాలని నోరాడింది; కాని ఎలా అడగడం?

"అవును, వెళ్ళవలసిందే! మీ అబ్బాయిలందరూ బాగా చూసుకుంటున్నారు. వాళ్ళు పిలుస్తే తప్పకుండా వెళ్ళాలి!"

చెళ్ళమ్మాళ్ మరేం అనలేదు. అప్పుడు సరళ అక్కడికి వచ్చింది. "సరేలేండి, మా అత్తగారు మిమ్మల్ని ఒప్పించేసారన్నమాట! రెండు మాసాలలో మన ఊరు కోవెల ఉత్సవం వస్తోందికదా, దాని తరువాత వెళ్ళవచ్చని చెప్పండి! మేం ఎంత చెప్పినా 'సరే, చూద్దాం! చూద్దాం!' అనే అంటున్నారు, ఆఖరికి ఊరుకి వెళ్ళడానికి శుభదినం చూసేసారు!" అని అంది.

"నువ్వు మనసారా అంటున్న మాటలే చాలమ్మా!" అని చెల్లమ్మాళ్ అంటూంటే సరళ వెళ్ళిపోయింది. అందుకే సుబ్బలక్ష్మి అమ్మాళ్ చెల్లమ్మాళ్ని చూసి "అవును, మీరు సంబరాలు చూసి వెళ్ళండి. ఎందుకు తొందర? మా ఇంటికీ వస్తూవుండండి . . . సరళ అన్నిపనులూ చేస్తూంది . . . మీరెందుకు రాకూడదు?" అని ఆఖరిసారిగా బలవంతపెట్టి వెళ్ళారు.

తనకెటువంటి బాధ్యత లేదని సుబ్బలక్ష్మి అమ్మాళ్ గుర్తుచేస్తున్నారని గ్రహించి చెల్లమ్మాళ్ బాధపడ్డారు; కాని ఇవాళ ఆవిడ నిమ్మళంగా మాటాడారని ఆశ్చర్యం కలిగింది.

"నాకెలాగో అనిపించింది. ఆవిడ నింపాదిగానే మాట్లాడుతున్నారు!" అని చెల్లమ్మాళ్ సరళతో అన్నారు.

"మాటలకేం? మీరు రావడానికి ముందే ఆవిడ మీ గురించి చాలా కబుర్లు అడిగితెలుసుకున్నారు. మంచి స్వాబావం ఉన్న మనిషే . . . నాకు మాత్రం ఒకటి నచ్చలేదు!" అంది సరళ.

'ఇంతవరకూ సుబ్బలక్ష్మి అమ్మాళ్ గురించి ఏదీ తప్పుపట్టని సరళ ఇప్పుడెందుకి ఇలాగంటుంది? తను ఇంకా కొన్నిరోజులు ఇక్కడ ఉండాలని ఆవిడ అన్నారుగా, అదే కారణమా?' అని చెల్లమ్మాళ్ ఉలికిపడ్డారు. తడబడుతూ, మెల్లగా, "నీకెది నచ్చలేదు?" అని అడిగారు.

"ఈవిడకి ఇంట్లో అన్నిపనులూ తనే చెయ్యాలి! ఆ తరువాత కోడలికి ఏ పనీ తెలియదని అందరికీ చెప్పాలి! ఎందుకూ, ఆ అమ్మాయికి ఒక ఛాన్సు ఇస్తే,

అదేంచేస్తుందో చూడవచ్చుగా?" అని అంటూ ఒక నూరేళ్ళ ముసలమ్మలాగ సరళ ఒక నిట్టూర్పు వదిలింది.

"ఆవిడ ఎందుకలా ఉన్నారు? ప్రారబ్ధమా?" అని చెల్లమ్మాళ్కి అడగాలనిపించింది.

'ప్రారబ్ధం కాదు! ఆవిడకి తన హోదా, గౌరవం పదలడానికి ఇష్టం లేదేమో?' అని తనలో చెప్పుకున్నారు.

కాని ఇంతలో సరళ జోక్యం చేసుకొని "ప్రారబ్ధం అంటూ ఏమీ లేదు . . . ఆవిడ చాకిరీ కావాలనీ ఎవరూ బలవంతం చెయ్యలేదే?" అని ఆ వ్యాక్యం ముగించింది.

సుబ్బలక్ష్మి అమ్మాళ్ తనతో మాటాడిన ధోరణి చూసి చెల్లమ్మాళ్కి కొంచెం తృప్తి కలిగింది; తను ఊరికి వెళ్ళేదినంకి ముందు ఆవిడని చూడాలన్న ఆలోచన మార్చుకున్నారు. "నేను ఉరుకి వెళ్ళేముందు ఓరెండుసార్లు ఆవిడని చూద్దాం!" అని సరళతో అనగానే ఇద్దరూ కలిసివెళ్ళారు.

"హూం, ఈ ఊరుకి వచ్చినరోజు మా ఇంటికి వచ్చారు . . . ఆ తరువాత ఇవాళ బయలుదేరేముందు మళ్ళీ వచ్చారు . . . ఏమే, సరళా? నువ్వూ మీ అత్తగారిని వెనకేసుకుంటున్నావన్న మాట!" అని కొంచెం అధికారధ్వనితో సుబ్బలక్ష్మి అమ్మాళ్ దాన్ని మందలించారు.

"నేను పిలిచినా ఎక్కడికీ రారే?" అని అంది సరళ.

"ఏంటో, ఈ సారి ఇలాగైంది. బతికి బాగుంటే కిట్టు బదిలీ అవకుండా ఇక్కడే ఉంటే నేనూ తరచుగా వస్తూంటాను!" అని నవ్వుతూ చెల్లమ్మాళ్ ఊరడించారు.

"హూం. తలచుకుంటే చాలు, మీరు ప్రయాణంకి రెడీ ఐపోతారు. నాకు ఇంటినుంచి ఇలా అలా కదలడం చేతకాదు!" అన్నారు సుబ్బలక్ష్మి అమ్మాళ్.

సరళ ఇప్పుడు తన అత్తగారి మొహం చూసింది: 'ఆరోజు నేను ఈవిడ గురించి మీకు చెప్పినది నిజమేకదూ? అని తన చూపుతో అడుగుతున్నట్టు ప్రశ్నించింది; ఆ తరువాత హేమాని చూసింది; హేమా దూరంలో నిలబడివున్నా ముడుచుకున్న ఆమె మొహం సరళకి కనిపించింది.

సరళ సుబ్బలక్ష్మి అమ్మాళ్ని చూసి "మామీ, నాకో సంగతి చాలా చోద్యంగా ఉంది!" అని దుడుకుగా పలికింది.

“నువ్వేమంటున్నావ్?”

సరళ మళ్ళీ ఒక చిరునవ్వు నవ్వింది. కనురెప్పలు మెల్లగా పైకెత్తి ఆవిడని చూసింది.

“ఇంట్లో చాకిరీ చెయ్యాలని కోడళ్ళు బాధపడతారని, కోడళ్ళు సరిగ్గా పనిచెయ్యడంలేదని అత్తలు అంగలార్చుకుంటారని అందరూ మామూలుగా చెప్పుకుంటారు. కాని మన ఇళ్ళల్లో దానికి పూర్తిగా విరుద్ధం! చూసారా? అత్తగారు తన్ను పనిచెయ్యడానికి అనుమతించరని మీ కోడలు బాధపడుతోంది! ఇక మా అత్తగారు కోడళ్ళు తన బాధ్యతని పూర్తిగా లాగ్గొని తన్నొక బొమ్మగా చేసి మూల పడేసారని వాపోతున్నారు! ఇది వింతగా లేదూ?”

సరళ సమర్ధవంతంగా అన్న మాటలవి: గొప్పగా చెప్పింది; బలంగా చెప్పింది; ఆవేశంగా చెప్పింది; అందరికీ అర్ధమైయ్యేలాగ చెప్పింది.

చెల్లమ్మాళ్ విస్తుపోయి చూసారు; సుబ్బలక్ష్మి అమ్మాళ్కి ఆశ్చర్యం! హేమా మెలకువతో తన్ను సర్దుకుంది. అందరూ సరళని చూసారు. సరళ అందరినీ చూసింది - ఇదంతా ఒక క్షణంలో!


“మామీ, చూసారా, ప్రపంచంలో ఎన్ని రకాలో?” అని నవ్వుతూ సరళ సంభాషణ ముగించింది.

ఆ రాత్రి సరళ అత్తగారితో “మీరింకా రెండు మాసాలు మాతో ఉండాలి!”అని అనగానే చెల్లమ్మాళ్ వెంటనే సమ్మతించారు.

ఆ తరువాత చెల్లమ్మాళ్, సుబ్బలక్ష్మి అమ్మాళ్ తరచుగా, జతగా కోవెలకి వెళ్ళడం ఆరంభించారు. సరళ, హేమ ముందులాగ తప్పించుకోకుండా ఇరుకుగా కలిసిమెలిగారు. సరళ అడిగిన ప్రశ్నకి సరిగ్గా బదులు చెప్తున్నట్టు “ఆ ఆ సమయాల్లో ఆ ఆ వయస్సులో అలాగలాగ ఉంటేనే అందరికీ మంచిది!” అని రెండు జతలూ తమకుతామే చెప్పుకొని తృప్తి పడ్డారు.

********

**(మూలం ప్రచురణ స్వదేశమిత్రన్, జనవరి 21, 1951)**



# పేరులో తారుమారు

"స్వామినాథా!"

జవాబు లేదు; వసారాలో వాలుకుర్చీలో ఉత్తరాలు చదువుతున్న రామయ్యర్ తలెత్తి, ఇంట్లోకి దృష్టి మళ్ళించి, రెండుసార్లు పిలిచారు.

జవాబు లేదు; అతను లేవబోతుంటే అతని ఐదేళ్ళ పిల్లవాడు గభీమని వీధిలోనుంచి ఇంట్లోకి ప్రవేశించాడు.

"సీను, లోపల స్వామినాథన్ ఉన్నాడేమో చూడు . . . వాడ్ని ఇక్కడకి రమ్మని చెప్పు. . . "

ఇంతలో శ్రీను హాలు దాటేసాడు.

"అదిగో బావ! పేపర్ చదువుతున్నాడు . . . బావా, నాన్నగారు నిన్ను పిలుస్తున్నారు!" అని చెప్పి తన బాధ్యత నెరవేర్చి శ్రీను ఇంట్లోకి మాయమయ్యాడు.

రామయ్యర్ ఒకక్షణం ఉలికిపడ్డారు. చెయిలో వార్తాపత్రిక చదువుతూనే మేనల్లుడు నిద్రపోతున్నాడా? చూడాలని లేచివచ్చారు; వార్తాపత్రికని మడుపుతున్న శబ్దం వినిపించింది.

"స్వామినాథా!"

ఇప్పుడూ జవాబు లేదు. హాలు పక్కన ఉన్నగదిలోకి అతను తొంగిచూసారు.

"ఇదేంట్రా? నిన్ను పిలిచి పిలిచి నా గొంతుక పట్టేసింది; నీ నోరు పెగల్లేదు!"

"నన్నా పిలిచారు? నాపేరు స్వామినాథన్ కాదే? నా పేరు సీను!" అని అంటూ మంచంలో కాలు చాచి పడుకొనివున్నవాడు దాన్ని మడిచి తలెత్తాడు.

ఆశ్చర్యంతో వాడిని ఒక సారి చూసి "అంటే ఇవాళ టపాలో వచ్చిన ఉత్తరం నీకు కాదన్నమాట! ఎవరో నటరాజన్ . . . పోతనూరునుంచి రాసాడు!" అని అంటూ రామయ్యర్ చెయిలోని కవరుని మేనల్లుడికి చూపించారు.

"నటరాజనా? అది నాకే!"

"మరి అడ్రసులో స్వామినాథన్ అని ఉందే?"

“ఆ స్వామినాథన్ నేనే! ఈ నటరాజన్ నా స్నేహితుడు, పోతనూరులో ఉద్యోగం చేస్తున్నాడు!”

“సరే స్వామినాథా, ఇదిగో!” అని నవ్వుతూ రామయ్యర్ వాడికి కవరు అందించారు.

“ఇవాళ పొద్దున్న రైల్లో వచ్చావ్, మధ్యాహ్నమే నీకు ఉత్తరం వచ్చేసింది! నువ్వుంటున్నది ఉత్తరదేశంలో, నీ స్నేహితుడు దక్షిణదేశంలో! అతను ఉద్యోగం చేస్తున్నాడు, నువ్వు కాలేజులో చదువుతున్నావ్! Friends అంటే ఇలాగే ఉండాలి!” అని ఇద్దరినీ దీవించే ధోరణిలో పలుకుతూ రామయ్యర్ బయటకి వచ్చారు. అతని చెయిలో ఇంకా మూడు ఉత్తరాలున్నాయి; వాటిని చదవాలిగా?

అతను వసారాకి వస్తూనే “సీను!” అన్నారు.

జవాబు రెండు కంఠాల్లో వచ్చింది. సన్నగా వినిపించిన స్వరంకి సన్నగానే “స్వామినాథా, నిన్ను పిలవలేదయ్యా!” అని మేనల్లుడికి చెప్పి, బిగ్గరగా వచ్చిన ధ్వనికి బిగ్గరగానే “నా కళ్ళద్దాలు తీసుకురా!” అని అబ్బాయిని ఆజ్ఞాపించారు.

నాన్నగారు వాలుకుర్చీలో వాలడానికిముందే శ్రీను వచ్చి కళ్ళద్దాలని ఒరతో అతనికి చాపాడు. దాన్ని అందుకొని “భలే, భలే!” అని అబ్బాయిని మెచ్చుకొని “సరే, నువ్వు ఇప్పుడెక్కడికి పరుగెత్తాలి?” అని అడిగారు.

“అమ్మ కొత్తిమిరి కొనితెమ్మంది,” అని చెప్పి శ్రీను వీధిలోకి దూకాడు.

‘వీడిని దేవుడే కాపాడాలి, ఐదేళ్ళ పిల్లవాడు, ఈ ఇంటికి ఎన్ని విధాలా సాయం చేస్తున్నాడు!’ అనే ఆలోచన రాగానే అతని కళ్ళు చెమ్మగిల్లినట్టనిపించింది; కళ్ళద్దాలు మళ్ళీ తొడుక్కునేముందు రామయ్యర్ కళ్ళు తుడుచుకున్నారు.

ఇతను ఇక్కడా, స్వామినాథన్ లోపలా తమకి వచ్చిన ఉత్తరాలలోని రహస్యాలు చదువుతూంటే మనమూ కొన్ని రహస్యాలు తెలుసుకుందాం.

స్వామినాథన్ పేరు స్వామినాథనే. అది వాడి నాన్నగారి తండ్రి పేరు; సాంప్రదాయంగా వాడికి నామకరణం చేసిన పేరు. కాని వాడికి ఇంకొక ముద్దుపేరు ఉంది. ముద్దుపేర్లు పెట్టి పిల్లల్ని పిలవడం మంచి అలవాటే. రాజగోపాలన్, వెంకటసుబ్రమణ్యన్ అనే పొడుగాటి పేర్లని చక్కగా తగ్గించి పిలవడం మామూలే.

పెద్దలకీ, దేవుళ్ళకీ భయపడి పిల్లలకి ఈ పొడుగాటి పేర్లు పెట్టినా, ఆ దేవుడి భక్తికి, పెద్దల భక్తికి అసలు ఏ పొత్తూ లేనట్టు విధిగా ఆ పిల్లల తలలో మొత్తడం, తిట్టడం జరిగితే 'రాజు', 'నాణు', 'సుబ్బు', అనే ముద్దుపేర్లు ఎంత సలభంగా మన అందుబాటులో ఉన్నాయి! ఐతే, స్వామినాధన్కి దొరికిన ముద్దుపేరుకి ఎటువంటి సంబంధంలేని పేరు 'శ్రీను.' అదెలా వచ్చిందంటే స్వామినాధన్ తాతగారు పేరుని అతని కోడలు - స్వామినాధన్ తల్లి - పిలవడం అమర్యాద అనే భావనతో ఆవిడ తల్లి నిర్ణయించిన పేరు శ్రీను. అమ్మమ్మ పెట్టిన పేరే స్వామినాధన్కి ఆఖరికి దక్కింది. అందరూ అతన్ని ముద్దుగా 'శ్రీను' అనే పిలిచారు; వాడ్ని స్కూల్లో చేర్చినప్పుడు వాడి నాన్నగారు 'స్వామినాధన్' అనే పేరులో రిజిస్టరు చేసారు.

తన బాల్యంలో - ఇంట్లో ఒక పేరు, స్కూల్లో ఒక పేరు - అనే అవస్థలో ఆ పిల్లవాడు ఎలా బాధపడ్డాడో, ఏంచేసాడో, ఇప్పుడెవరికీ గుర్తులేదు. కాని ఇప్పుడు, తన ఇరవైయేళ్ళ వయసులో కాశీ విశ్వవిద్యాలయంలో M.Sc చదువుతున్న ఈ రోజుల్లో 'స్వామినాధన్' అనే పేరు వాడి చెవులకి వెగటుగా ఉంది. మామయ్య తన పిల్లవాడిని 'శ్రీను' అని పిలిచినప్పుడు ఆ కంఠధ్వనిలో ప్రేమానురాగాలు ఎంత చక్కగా వినిపిస్తున్నాయి! అదే అభిమానం, విశ్వాసం తన తల్లిదండ్రులు పిలిచినప్పుడు చోటుచేసుకుంటాయి. కాని తన స్నేహితులు 'స్వామినాధన్' అని పిలిస్తే ఎంత అసహ్యంగా ఉంది! 'స్వామినాధన్' అని తన్ను పిలచిన ఎవరూ తన మిత్రుడు కాదని వాడి ఉద్దేశం! వాడి సాహచర్యంకి అర్హులు వాడ్ని సీను అనే పిలుస్తారు. పోతనూర్ మిత్రుడు కవరుమీద 'స్వామినాధన్' అని రాసాడు. కాని, లోపల, అతని ఉత్తరం "ప్రియమైన సీను!" అనే ప్రారంభమైంది. కాలేజీ గణితశాస్త్ర ప్రొఫెసరు ఒకనాడు వీడిని 'సీను' అని పిలిచారు. ఆ సమయంలో వీధిలోగాని జనుల సందడి లేకపోతే అతన్ని అలాగే కౌగిలించుకునేవాడు! సీను అని తన్ను ధైర్యంగా పిలవని ప్రొఫెసర్లమీద వాడికి అభిమానం కొంచెం తక్కువే. అందుకని వాళ్ళమీద గురుభక్తి తగ్గలేదు; B.Sc ఫస్టుక్లాసులో పాసయి, ఇప్పుడు కాశీలో M.Sc చదువుతున్న రోజుల్లో వాడిని అందరూ పొగడుతున్నారు. తన M.Sc చదువు పూర్తవగానే ఏ పదో, పదిహేను రూపాయలు అధికారులకి పారేసి తన పేరుని శాశ్వతంగా 'శ్రీను' లేక 'శ్రీనివాసన్'

అని మార్చుకోవాలి; భవిష్యత్తులో ఎప్పుడైనా 'శ్రీమాన్ శ్రీనివాసన్ సేలంకి ఎలెక్ట్రికల్ ఇంజనీయరుగా బదిలీ అయ్యారు' అని ప్రభుత్వ సమాచార పత్రికలో తనగురించి ఒక ప్రకటన వెలుబడాలి. ఇదే ప్రస్తుతం తాత్కాలికంగా స్వామినాధన్ అనే పేరుతో మెలుగుతున్న వీడు కంటున్న కల!

ఈ పరిస్థితిలో మామయ్యే తన్ను స్వామినాధన్ అని పిలిస్తే వీడికెలా ఉంటుంది?

అవాళ పొద్దున్న పదిగంటలకి రైలునుంచి దిగగానే మామయ్య "సీను, రా!" అని ముద్దుగా వాడికి స్వాగతం చెప్పారు. ఆ తరువాత దారంతా "బాగా నిద్రపోయావా? ప్రయాణం బాగా సాగిందా?" అని అడుగుతూ వచ్చారు. అప్పుడెల్లా "సీను", "సీను" అనే పిలిచారు. ఇప్పుడు అతని పిలుపులో మార్పు చూసి వాడికి కటువుగా ఉంది.

కాని, పాపం, రామయ్యర్ ఏంచేస్తారు? అతనికి ఈ మాఱకం అత్యవసరమనిపించింది.

స్వామినాధన్ ఇంటికి వచ్చిచేరిన కొంచెం సేపట్లోనే అతనికి ఒక సంకటస్థితి తటస్థించింది. "ఒరే, సీను, థెర్మాస్ బుడ్డిని అలాగెవరైనా ఎత్తుతారా? దాన్ని ముందు కింద పెట్టు!" అని అతని ఆజ్ఞ విని మేనల్లుడు అదిరిపడి తిరిగిచూసాడు; మామయ్యకి ఎవరిమీద కోపం అని తెలుసుకున్నతరువాత నవ్వేసి ఊరుకున్నాడు. కాని రామయ్యర్ గిజగిజలాడిపోయారు. ఒక దూకు దూకి, బుడ్డిని పిల్లవాడి దగ్గరనుంచి లాగ్గొని "నేను ఈ చిన్న సీనుకి చెప్పాను!" అని అన్నారు. ఆ తరువాత అతని మనసులో మరెన్నో ఆలోచనలు లేచాయి: వాళ్ళిద్దరినీ 'చిన్న సీను', 'పెద్ద సీను' అని గురుతు పెట్టి పిలుస్తే బాగుంటుందా? రోజుకి కనీసం ఇరవైసార్లు తన అబ్బాయిని అతను కోపించుకోడం, మందలించడం జరుగుతుంది. అలాంటప్పుడు ఆ చివాట్లన్నీ తనకే అని మేనల్లుడు తప్పుగా అర్థంచేసుకుంటే? అసలు వాడికలా అనిపించకపోయినా, తనకే అది సముచితంగా తోచలేదే?

'ఈ ప్రశ్నకి ఒకటే దారి; ఇద్దరిలో ఒకరి పేరు మార్చాలి. తన అబ్బాయి సీనుని పూర్తిగా 'శ్రీనివాసన్' అని పిలవడం సులభం. కాని అందువలన పిల్లవాడికి తత్తరపాటు కలుగుతుంది. ఇంట్లో పని-పాటు అని వస్తే వాడెప్పుడూ సిద్ధంగా ఉంటాడు, సీను అనే

పేరు వాడికి అలవాటైపోయింది. 'శ్రీనివాసన్' అని పిలుస్తే కలవరపడతాడు. అందువలన కాశీ సీను పేరుని మార్చి పిలవాలి . . . కాని ఏమని పిలవడం?'

మంచి వేళ, అప్పుడే అతని మేనల్లుడు "మామయ్యా, నాకేమైనా ఉత్తరాలు వచ్చాయా? 'నేనిక్కడ ఉంటాను, ఈ అడ్రసుకి రాయండి!' అని నేను నా స్నేహితులకి చెప్పాను," అన్నాడు.

"ఏవీ రాలేదు," అని తెలియజేసి రామయ్యర్ వసారాకి వచ్చారు.

"'స్వామినాధన్' అనే పేరుకి అక్కడ నాకు ఉత్తరాలు రావొచ్చు. వస్తే, భద్రంగా ఉంచండి. నేను వచ్చి తీసుకుంటాను," అని రెండురోజులముందు మేనల్లుడు ఉత్తరంలో రాసినది అతను గుర్తుచేసుకున్నారు.

వెంటనే 'అరేరే, అదేకదా పెద్దలు వాడికి నామకరణం చేసిన పేరు, స్కూల్లో అందరూ పిలిచే పేరు!" అని తనలో తనే చెప్పుకున్నారు; 'ఇక మనమూ ఆ పేరుతోనే పిలుద్దాం!' అని నిశ్చయించారు.

రేడియో నాటకాల్లో - ఏం, అచ్చువేసిన నాటకాల్లో కూడా - శ్రోతల, పాఠకుల స్పష్టతకోసం పాత్రల పేర్లు కొంచెం ఎక్కువగానే పరివర్తన చేసుకోడం మనం చూస్తాం; రామయ్యరూ ఆ విధంగానే తన అభ్యాసం ఆరంభించారు. 'స్వామినాధన్' అనే పేరుని నిరుద్దేశంగా 'సీను' అని పిలవకూడదని తనే, మళ్ళీ మళ్ళీ, 'స్వామినాధా?', 'స్వామినాధా?' అని పిలవడం అలవాటు చేసుకున్నారు. ఆవశ్యకం లేనప్పుడుకూడా "స్వామినాధా, భోజనంకి రా!", "స్వామినాధన్ని రమ్మను!" అనే వాక్యాలు తరచుగా అతని నోటినుంచి వచ్చాయి. ప్రతీసారి - రామయ్యర్ అలా పిలిచినప్పుడెల్లా - అతని మేనల్లుడుకి తన చెవుల్లో ఎవరో బాదినట్టనిపించింది!

తను పుట్టినది ఇక్కడే. తనకి 'సీను' అని ముద్దుపేరు ఇచ్చినది తన అమ్మమ్మ, ఈ మామయ్యని కన్న తల్లి! ఇతనూ ఇన్నిరోజులూ 'సీను' అని పిలిచి, ఇప్పుడు ఎవరో పరాయివాళ్ళలాగ 'స్వామినాధన్' అని తన్ను పిలుస్తున్నారని వాడికి పట్టరాని కోపం! అందువలనే 'స్వామినాధా?' అని అతను పిలిచినప్పుడు జవాబు ఇవ్వక ఊరుకున్నాడు.

"నేను సీను, స్వామినాథన్ కాదు!" అని నొక్కిచెప్పిన మరుక్షణమే "నేనే ఆ స్వామినాథన్! ఆ ఉత్తరం నాకే!" అని మామయ్యదగ్గర తను ఒప్పుకోవలసి వచ్చింది! ఎంత పెద్ద అవమానం!

వాడికి ఉత్తరం అందించినతరువాత రామయ్యర్ వసారాలో నిలబడి తనకి వచ్చిన ఉత్తరాలు చదువుతూ కనిపించారు.

తన ఉత్తరం చదివిన తరువాత మేనల్లుడి మనసులో ఒక ఆలోచన లేచింది; 'అవును, అలాగే చెయ్యాలి! ఇక్కడనుంచి తప్పించుకోవాలి!' అని నిశ్చయించాడు.

"స్వామినాథా, ఉత్తరంలో ముఖ్యంగా ఏమైనా కబురు ఉందా?" అని అడుగుతూ రామయ్యర్ వచ్చారు.

"ఉంది, మామయ్యా! ఒక vacancy గురించి. నన్ను వెంటనే బయలుదేరి రమ్మని నా స్నేహితుడు రాసాడు. రైల్వే ఇంజనీరు ఉద్యోగంకి interview వచ్చింది. నేనివాళ సాయంకాలం బయలుదేరాలి. ఇప్పుడు మూడుగంటలేగా అయింది?" అని అంటూ వాడు ఎడం మణికట్టు ఎత్తి వాచీ చూసుకున్నాడు. ఆలా చూసినప్పుడు ఒక క్షణం వాడి చూపు గోడమీదున్న ఒక ఫోటోమీద పదిలమవడం రామయ్యర్ గమనించారో లేదో?

"ఈ ఉద్యోగంలో చేరాలంటే నీ కాశీ చదువు ఏమౌతుంది? దాన్ని మధ్యలో ఆపేయాలంటున్నావా? నువ్వు వెళ్ళకూడదు! ఇప్పుడు ఈ ఉద్యోగం దొరక్కపోతే ఏ నష్టమూ లేదు!" అన్నారు రామయ్యర్ కొంచెం కలవరుడుతూ.

"అదేంటి, మామయ్యా? ఇక్కడ మీతో నాలుగురోజులు ఉండాలనే ఉద్దేశంతోనే నేను వచ్చాను, కాని ఇలాంటి మంచి ఛాన్సు వస్తే పదులుకోడం ఎలాగ? నేను ఎలాగైనా వెళ్ళితీరాలికదా, ఇవాళే వెళ్తాను!" అని అన్న స్వామినాథన్ దృష్టి ప్రయాణంకి కావలసిన మూటాముల్లెమీద వాలింది.

"ఇదేంట్రా? ఒక సంవత్సరం పైగా చదివేసి, వేయిలకొలదీ డబ్బు ఖర్చుచేసి, ఆఖరికి ఇదేనా నీ ప్లాను? మీ అమ్మా, నాన్నా సమ్మతించరు! స్కూలుకి వెళ్ళిన పిల్లలు తిరిగివచ్చేముందే నువ్వు రైల్వే స్టేషన్కి వెళ్ళవలసి ఉంటుంది. వాళ్ళని చూడాలని నీకు రవంతైనా ఆశ లేదనిపిస్తోంది! పాపం, వాళ్ళందరూ నాలుగు

రోజులుగా ‘బావ వస్తున్నాడు!’ ‘బావ వస్తున్నాడు!’ అని గంతులేస్తున్నారు! మరి నువ్వేమో పదిగంటలకి వచ్చి మూడు గంటలకి వెళ్తానంటున్నావ్! బాగుంది! సరేలే, నీ ఇష్టం!” అని తన మనోవ్యధని జాడచూపుతూ రామయ్యర్ నిష్క్రమించారు.

“నాకేం తొందరలేదు మామయ్యా! పిల్లలు రానీ, కొంచెం పిచ్చాపీటీ తరువాత నేను వెళ్తాను, సరేనా? మంచి సమయంలో వచ్చే ఛాన్సుని వదులుకోడం నాకు ఇష్టం లేదు . . . ” అని స్వామినాధన్ మళ్ళీ నొక్కిచెప్పాడు.

“M.Sc పాసయితే నీకు ఇంకా పెద్ద ఉద్యోగం దొరుకుతుందికదా? కాశీలో నువ్వు చదవాలని మీ నాన్న బ్రహ్మప్రయత్నం చేసాడు . . . నీకు జ్ఞాపకం ఉందా?”

అది విని స్వామినాధన్ నిర్ఘాంతపోయాడు. కాని సర్దుకొని “అవును, మీరన్నది నిజం. కాని, ఆ మాటకి వస్తే, అదేం పెద్ద చదువు? మాటిమాటికి అక్కడ విద్యార్థులు సమ్మె చేస్తున్నారు. క్లాసులు నియమంగా జరగడం లేదు. ఈ సంవత్సరం నేనేం కొత్తగా ఏ పాఠమూ నేర్చుకోలేదు!” అన్నాడు.

“నాయనా, మంచి విశ్వవిద్యాలయన్ని దూషించకు! నువ్వేం కొత్తగా నేర్చుకోపోయినా ఆ గుంపులతో కలిసి ‘జైహింద్!’ అని ఘోషణ చెయ్యలేదుగా, అదే చాలు, ఉత్తమం! స్వాతంత్రదేశంలో నీకు మంచి ఉద్యోగం దొరుకుతుంది . . . ఏదో, నాకు తెలిసినది చెప్పాను, తరువాత నీ ఇష్టం!” అని రామయ్యర్ అంటూంటే దడదడమని అతని పిల్లవాడు సీను అక్కడికి పరుగెత్తుకొని వచ్చాడు.

“సీను, ఇదిగో, నాలుగణాలు! పోస్టాఫీసుకి వెళ్ళి ఎనిమిది కార్డులు కొని తీసుకురా!” అన్నారు రామయ్యర్.

“పోస్టాఫీసు ఎక్కడ ఉందని నాకు తెలియదే?” అన్నాడు అతని మేనల్లుడు.

“నిన్ను కాదయ్యా, మా సీనుకి చెప్తున్నాను!” అన్నారు రామయ్యర్, నవ్వుతూ.

“పిల్లవాడిని ఒంటరిగా పోస్టాఫీసుకి పంపిస్తున్నారా?”

“ఇక్కడ, పక్కనే ఉంది . . . వాడు వెళ్తాడు . . . ఒరే, సీను, వెళ్ళి రా!” అని పిల్లవాడిని పంపించేసి, రామయ్యర్ “చూసావా? పొరబాటున వాడ్ని ‘మా సీను!’

అనేసాను. నువ్వు మాత్రం మాకు పరాయి వాడివా? ఈ గడబిడకి ఈ పేరు చేసే తారుమారే కారణం! అవునా?" అని నవ్వారు.

వీధిలో, ఇంటిముందు, ఒక గుర్రపుబండి వచ్చి ఆగింది.

"పద్మ వచ్చేసింది కాబోలు! ఇంకా నాలుగు గంటలు అవలేదే, అంతలోనే వచ్చేసిందే?" అని అంటూ కిటికీద్వారా స్వామినాథన్ వీధిలోకి చూసాడు.

"స్వామినాథా, చెప్పు . . . నువ్వు రైల్వే స్టేషన్ వెళ్ళడానికి ఈ జట్కాని రమ్మని చెప్పమంటావా? బండిలో ఇంకా ఇద్దరు ఆడపిల్లలు ఉంటారు, వాళ్ళని దింపేసి రావాలి! నీ ప్రయాణం ఖాయమేనా?" అని రామయ్యర్ అడిగారు.

స్వామినాథన్ జవాబు చెప్పలేదు; నివ్వెరపడి అలాగే నిలబడిపోయాడు. అతని మాటలు వాడి చెవులకి అందాయో లేదో? కాని పద్మకి బాగా వినిపించాయి.

"ఎవరి ప్రయాణం? బావ ఇవాళే వెళ్ళాలా?" అని అడుగుతూ పద్మ గడప దగ్గరకి వచ్చి నిలబడింది.

"నీ జవాబేదో వినకుండానే జట్కా వెళ్ళిపోయింది!" అన్నారు రామయ్యర్. అందువలన అతనికి దుఃఖమా, సంతోషమా అనే సూచనలేవీ అతని మొహంలో కనిపించలేదు.

"ఏం, మీ ఊరులో మరేం జట్కా లేదా?" అని అడిగి పద్మను చూస్తూనే స్వామినాథన్ నవ్వాడు. ఇంతలో పద్మ గడప దాటి, నేలమీద చెప్పులు వదిలేసి, "నాన్నగారూ, బావ ఇవాళే ఊరుకు వెళ్ళాలని అంటున్నాడా?" అని అడుగుతూ ఇంట్లోకి ప్రవేశించింది. ఒక మేజామీద పుస్తకాలు పెట్టి "మామయ్యా, మేనల్లుడూ జగడమాడుతున్నారా?" అని కొంటెగా అడిగింది.

స్వామినాథన్ మెల్లగా నవ్వాడు.

"ఏం, బావకి మధ్యాహ్నం టిఫను నచ్చలేదేమో? అవునా? బావా, అలాగైతే నాకు చెప్పు! నేను అమ్మతో చెప్పి నీకేది ఇష్టమో చెయ్యమంటాను!" అంది పద్మ.

"పద్మా, నీ పిచ్చిమాటలు ఆపు! స్వామినాథన్కి ఏదో ఉద్యోగం దొరికిందట! . . . " అని లాగారు రామయ్యర్.

"ఎవరా స్వామినాథన్? ఎక్కడ ఉద్యోగం?"

“వీడే స్వామినాథన్ . . . ”

“బావపేరు సీను కదూ? నాన్నగారూ, మీరేమంటున్నారు?”

“మనింట్లోనూ ఉన్నాడుకదూ - నీ తమ్ముడు - ఒక చిన్న సీను? ఇద్దరినీ ఒకే పేరు పెట్టి ఎలా పిలవడమని నాకు బోధపడలేదు!”

“ఓహో, అదా మీ బాధ? మన సీను పేరు మార్చి . . . ”

“‘మన ‘సీను’ అంటే ఎవరు, నీ చిన్న తమ్ముడా లేక నీ బావా? బావని నువ్వు ఇలా రెచ్చగొట్టావంటే వాడెందుకు ఇప్పుడే  మూటకట్టడు?” అని అతను కోపించుకున్నట్టు అడిగారు.

“అవును, అవును! నిజం, బావా, I am sorry!  నాన్నగారూ, మీరన్నట్టే బావ పేరు మార్చవలసిందే! కాని ‘స్వామినాథన్’ అని ఎందుకు మార్చాలి? ఆ పేరులో ఎందుకు మోహం?”

“వాడ్నే అడుగు!” అని మంచంమీదున్న- ఆ రోజు వచ్చిన -  ఉత్తరాన్ని కూతరికి రామయ్యర్ అందించారు.

“బావా, ఇదేనా నీకు వచ్చిన ఉత్తరం?” అని పద్మ తన చెయిలోని  ఉత్తరం వాడికి చూపించింది.

“అవును!” అని అన్నాడు కాని ఆ ఉత్తరాన్ని తీసుకోవాలని స్వామినాథన్ ప్రయత్నించలేదు.

“బావా, అడ్రసులో స్వామినాథన్ అనే ఉందే?”

“నేనలా పిలవడం వాడికి రోతగా ఉందేమో? అందుకే వెళ్ళాలని హఠం చేస్తున్నాడు!”  అన్నారు రామయ్యర్ గభీమని.

“మామయ్యా, అలాగేం కాదు . . . నేనేమో . . . ” అని స్వామినాథన్ లాగాడు.

“బావా, నీ పేరు సీను, స్వామినాథన్ ఏదైనా కానీ . . . ఇక్కడెవరూ నిన్ను పేరుపెట్టి పిలవరే? మేమందరం నిన్ను బావ అనే పిలుస్తాం . . . మరి నీకెందుకు ఆరాటం?” అని పద్మ ప్రేమతో అడిగింది.

స్వామినాథన్ ఆమె మొహంలోని కాంతి చూస్తూనే నిల్చున్నాడు. రామయ్యరు ఒక దగ్గు దగ్గారు.

"పద్మా, నువ్వేమంటున్నావ్? నాకుకూడా వీడు బావ అవుతాడా? నీ అమ్మకి కూడానా? మేం వీడిని ఇక ఏమని పిలవాలి? ఆ గందరగోళం వలనే నేను వీడి పేరు మార్చి పిలిచాను . . ."

"అది భరించలేక నాకూ పారిపోవాలని ఉంది . . . " అని నవ్వాడు స్వామినాథన్.

"ఇక కాశీ చదువు వద్దంటున్నాడు నీ బావ; ఉద్యోగంలో చేరుతానంటున్నాడు. అందుకోసం ఇవాళే వెళ్లాలంటున్నాడు."

"అవునా? బావా, నిజంగానా?" పద్మ ఆశ్చర్యంతో అడిగింది.

"అవును . . . నేను వెళ్ళాలి . . . "

"కాశీకి వెళ్ళి వచ్చినవాళ్ళు ఏదైనా వదిలేయడం సంప్రదాయం; నువ్వేమో చదువునే త్యాగం చేస్తున్నావన్నమాట!" అని పద్మ ఎగతాళి చేసింది.

"అవును, అలాగే కాబోలు! అసలు, చదవడం ఎందుకు? ఆఖరికి ఒక ఉద్యోగంలో చేరాలనేకదా? ఇప్పుడే ఉద్యోగం దొరికింది. అందుకే . . . " స్వామినాథన్ జంకాడు.

"ఎటువంటి ఉద్యోగం?" అని అడిగారు రామయ్యర్.

"అవన్నీ మీకు తరువాత చెప్తాను!" అని మొండిగా స్వామినాథన్ జవాబు చెప్పాడు.

"ఇందులో ఆ వివరాలు ఉంటాయికదూ?" అని అడిగి, ఒక గెంతు గెత్తి, పద్మ చెయిలో ఉత్తరంతో అక్కడనుంచి నిష్క్రమించింది.

"ఇదేంటి? నాకువచ్చిన ఉత్తరం తీసుకొని ఎక్కడకి పరుగెతున్నావ్!" అని స్వామినాథన్ అరిచాడుకాని, ఆ ఉత్తరాన్ని పద్మ దగ్గరనుంచి లాక్కొనడానికి వాడు ప్రయత్నించలేదు.

"చూసావా దాని ధైర్యం? తనకి వచ్చిన ఉత్తరం అనే ధోరణిలో చదువుతోంది!" అని కొంటెగా రామయ్యర్ నవ్వారు.

అది తను చూసినా స్వామినాథన్ చూడనట్టు 'సరే, అది చదవనీ! ఆఖరికి నాతో ఏకీభవిస్తుంది,' అని తనలో చెప్పుకున్నాడు.

వాడికి మనసులో ఇప్పుడు ఆరాటం: ఊరుకి వెళ్ళితీరాలని మొండిగా మాట్లాడేసాడు. కాని వాడి మనసు 'ఎందుకురా అలా అన్నాను?' అని అంగలార్చుకుంటోంది.

ఆ మధ్యాహ్నం భోజనం తరువాత స్వామినాధన్ తన గదికి వచ్చినప్పుడు గోడమీదున్న పద్మ ఫోటోని చూడగానే 'అది ఎప్పుడు స్కూల్లోనుంచి ఇంటికి తిరిగివస్తుంది? దాన్ని నేను ఎప్పుడు కలుసుకుంటాను? అని తొందరపడ్డాడు; ఆ తరువాత చాలా సేపు పద్మగురించి ఆలోచించాడు.

ఈ ప్రపంచంలో మరెవరూ పధ్నాలుగు సంవత్సరాలలో S.S.L.C. చదువు పూర్తి చెయ్యలేదా? అదేదో పద్మ సాధించిన అసాధరణ ప్రజ్ఞ అని వాడికి ఆశ్చర్యం! దాన్ని చూసి ఆరు సంవత్సరాలయ్యాయి, అందువలన తనతో మాట్లాడడానికి పద్మ జంకుతుందని అనుకున్నాడు. పద్మ తన తమ్ముడ్ని 'సీను!', 'సీను!' అని పిలచినప్పుడెల్లా అది తన చెవులకి ఎంత ఇంపుగా ఉంటుందని కల్పించుకొని మురిసిపోయాడు. ఆమె తమ్ముడిని పిలుస్తే తనూ, తమాషాగా, ఆమె ముందు నిలబడి 'నీకేం కావాలి? నీ సేవకి రెడిగా ఉన్నాను!' అని తన్ను అర్పించుకోవాలి! ఇలాంటి ముచ్చటలు వాడి మనసులో చోటుచేసుకున్నాయి.

కాని పద్మ వచ్చినతరువాత ఏం జరిగింది? సంతోషంతోపాటు వాడికి ఒక విధమైన ఆశాభంగమూ కలిగింది.

బావ పేరు మార్పు గురించి పద్మ ఏకీభవించేసింది. అంటే తన కల్పనలో లేచిన వేడుకలు, తమాషాలన్నీ వ్యర్ధమన్నమాట! కాని పద్మ మోమాటంలేకుండా తనతో నిష్కపటంగా మెలగడం, వాదించడం చూసి స్వామినాధన్ ఆనందించాడు. తనకి వచ్చిన ఏదో జడ్డికోపంలో తను ఊరుకి వెళ్ళాలని చెప్పినందుకు స్వామినాధన్ ఇప్పుడు బాధ పడ్డాడు. కాని, ఇక తను చేసేదేముంది?

మరేం తోచక ప్రయాణంకి మూటకట్టాలనుకున్నాడు.

"నాన్నగారూ, ఇదిగో కార్డులు!" అని పిలుపు వినిపించింది; ఎనిమిది కార్డులతో సీను వచ్చాడు. రామయ్యర్ వాటిని అందుకున్నారు.

"స్వామినాథా, నువ్విక్కడికి క్షేమంగా వచ్చిచేరావని మీ నాన్నగారికి రాయాలనుకుంటున్నాను. నువ్వు ఇవాళ మధ్యాహ్నం పోతనూర్ వెళ్తున్నావని రాయనా? మరేం కబుర్లు ఉన్నాయా, రాయడానికి?" అని రామయ్యర్ మేనల్లుడిని అడిగారు.

"దానికి ఇప్పుడేం తొందర?" అని స్వామినాథన్ గొణిగాడు.

ఇంతలో పద్మ అక్కడ వచ్చి నిలబడింది.

"బావా, ఆ ఉత్తరంలో ఏమనివుందో చెప్పమంటావా?" అని వాడిని బెదిరించినట్టు అడిగింది.

"చెప్పు, నాకేం?" అని తలూపుతూ స్వామినాథన్ కనుసైగ చేసాడు. అది రామయ్యర్ గమనించారోలేదో?

పద్మ ఇప్పుడు కొంచెం జంకినట్టు కనిపించింది.

"సరే, చెప్పు . . . అదేం ఉద్యోగం?" అని మొండిగా అడిగారు రామయ్యర్.

"నాన్నగారూ, నాకూ సరిగ్గా అర్థం కావటంలేదు . . . ఇదేదో దిక్కుమాలిన పనిలాగ అనిపిస్తోంది! . . . బావా, నీకు బొగ్గుగనిలో పనిచెయ్యాలని ఉందా? బాగుంది! నీ పేరు స్వామినాథన్! . . . ఇదేం నీకు తగిన పని కాదు!" అని అంటూ పద్మ ఇద్దరినీ - ఒకర్ని మార్చి ఒకర్ని - చూస్తూ మాటాడింది.

"ఏదీ, అది నాకియ్, నేను చదువుతాను!" అని రామయ్యర్ అడగలేదు; అతను ఇద్దరినీ కొంచెం కొంటెగా చూసారు, అంతే! స్వామినాథన్ ఉత్తరం చదవడానికి పద్మకి ఉన్న హక్కు తనకి లేదన్నట్టు ఊరుకున్నారు!

"సరే, మామయ్యా, నాకా ఉద్యోగం వద్దు! మీరన్నట్టు నా కాశీ చదువు సాగనీ! పెద్ద ఉద్యోగం దొరికే ఛాన్సు రావొచ్చు. 'ఇక్కడ నేను ఒక వారం ఉంటాను!' అని మా నాన్నగారికి రాసేయండి!" అని నవ్వుతూ స్వామినాథన్ పద్మ సలహాతో రాజీపడ్డాడు.

"భలే, అలా చెప్పు! అంటే నీ పేరు స్వామినాథన్ అని మాతో ఏకీభవించావన్నమాట! అదీ రాయమంటావా?" అని అడిగారు రామయ్యర్.

"'కాశీకి వెళ్ళి వచ్చినవాళ్ళు ఏదైనా వదిలేయడం సంప్రదాయం' అని పద్మ అనలేదూ? నేను నా చదువుని వదల్లేదు; నాకు నచ్చిన 'సీను' పేరుని త్యాగం

చేస్తాను. ఇక, నేను అందర్కీ స్వామినాథన్!” అని అన్నాడు స్వామినాథన్. అలా అంటూన్నప్పుడు వాడికి తన్నెవరో ఒక నిండు సభలో గౌరవించి మెడలో పూలదండ వేసినట్టు భ్రమ కలిగింది.

రామయ్యర్ వంటగదికి వెళ్ళి భార్యకి చెప్పారు: “తంగం, విను! నువ్వుకూడా వీడిని ఇక ‘స్వామినాథన్’ అనే పిలవాలి!”

“పద్మా, మంచివేళ, నువ్వు నా పరువు కాపాడావ్! ఆ ఉత్తరం గురించి నువ్వు ఏం చెప్తావో అని నేను గిజగిజలాడాను . . . You are really smart!” అని అంటూ స్వామినాథన్ ఆమె బుగ్గని మెల్లగా తాకాడు.

“పెళ్ళిలో కాశీయాత్రలో జరిగేది పేరు మార్చడంతో ఆగదే! ఆ తరువాతే . . . ” అని అంటూ తంగమ్మాళ్ రామయ్యర్ వెంట నడిచింది.

“పెళ్ళికొడుకు కోపంతో కాశీయాత్రకి బయలుదేరినట్టు నువ్వూ ఊరుకి వెళ్తానని హఠం చేసావని విన్నాను; ఆఖరికి మా పద్మే నిన్ను ఆపేసిందన్నమాట!” అని ఆవిడ మేనల్లుడిని మందలించారు.

********

**(మూలం ప్రచురణ: స్వదేశమిత్రన్, డిసంబర్ 28, 1947)**

# పాపం, మణి!

మనదేశంలో ఎవరో ఒక మహానుభావుడు అన్నారట: 'పద్నాలుగు సంవత్సరాలు ఒక అకటవికటమైన వయసు' అని.

అవును, నిజం. పదమూడు నుంచి పదహారు వరకు కుఱ్ఱవాళ్ళ నడవడి కొంచెం విచిత్రంగానే ఉంటుంది. పద్నాలుగు-పదిహేను అనేది విసుగుపుట్టించే ఒక ఘట్టం అని ఒప్పుకోవలసిందే!

సాధువు, సభ్యత గలవాడు అని అందరూ కొనియాడే ఈ మణియే - వయసు మాఱుపాటు వలన - నిందమోపులకి గురి ఐపోయాడంటే ఆ పెద్దల ఘోషణకి మరేం నిదర్శనం కావాలి? మణికి ఇప్పుడు సరిగ్గా పద్నాలుగేళ్ళు నిండాయి; పదునాలుగు భువనాల ధోరణిలో వాడి జీవితం సాగుతోంది. మారని పసితనం, నిలకడలేని యవ్వనం - ఈ రెండూ - వాడిలో కొత్తగా లీనమైనట్టు కనిపిస్తున్నాయి. ఒక గాలిపటంలాగ రకరకాల దశల్లో, రకరకాల సొగసుల్లో వాడు ఆహ్లాదించడం, అనుభవించడం, స్పందించడం జరుగుతోంది. అవును, పసితనంతోబాటు తన బాధ్యతలు నిరవేర్చాలనే యాతన వలన ఇప్పుడు వాడు చాలా చురుకుగా పని చేస్తున్నాడు!

పనిమనిషి తప్పు చేస్తే నాన్నగారు కోపించుకంటారు, అది చాలదా? మణికీ కోపం వస్తుంది. పనిమనిషిదగ్గర వాడూ తన అధికారం చెలాయిస్తాడు.

"నీకేం పోయిందిరా?" అని నాన్నగారు అడిగితే "నాకూ అడగడానికి హక్కు ఉంది," అని జవాబు వస్తుంది.

"పిల్లవాడితో నీకేం పోటీరా? ఊరుకో? ఏ అల్మారాలో వాడు తన పుస్తకాలు పెట్టుకుంటే నీకేం పోయింది?" అని తల్లి అడిగితే "హూహూం, నేను ఊరుకోను! పిల్లలకి దొరతనం కూడదు!" అని గదమాయించుతాడు.

వాడి ధోరణి ఇంట్లో అందరినీ ప్రభావితం చేసింది. పిల్లలూ, పెద్దలూ, అందరికీ మణి సహకారం కావాలి; వీడికీ వాళ్ల ఆత్మీయత కావాలి. మంచీ, చెడూ, ఎదైనాసరే వాడితో సంపర్కం ఉంది. అందువలన వాళ్ళకి నిండుగా దొరికినది

మేలు, ఉపకారం అన్నది నిజం,  కాని బయటకి కనిపించేది వాడిలోని వైరుధ్యం మాత్రమే!

పుట్టినిల్లులోనూ, అత్తమామలదగ్గరా వంచనలేకుండా రెండు తరపులనీ తృప్తిపరచే యువతిలాగ మణి పెనుగులాడాడు. వాడిలో పసితనం, వివేకం రెండూ చోటుచేసుకున్నాయి. అందువలనే ఇతరులకి వాడి చేష్టలు చికాకు కలిగించాయి.

ఈ నేపథ్యంలో ఇంకొకటి చెప్పాలి. సాధారణంగా మణి చదువులో పెద్ద మేధావీ కాదు, మూఢుడూ కాదు. ఏం పెద్ద విజయంమో, పరాభవమో ఎరుగని ఒక సామాన్య విద్యార్థి. కాని ఈసారి ఎందుకో పరీక్షల్లో వాడు వెనుకబడిపోయాడు. మామూలుగా మూడూ, నాలుగు అనే వరుసలో  క్లాసులో రాణించేవాడు గభీమని పదకొండో వరుసకి జారిపోయాడు. పాపం, వాడికే ఆ పతనం బాధగా ఉంది.

చాలారోజులవరకూ దానిగురించి వాడి నోరు పెగల్లేదు. ఆఖరికి, ఒక రోజు, ఒక గొణుకుగా, విసుగ్గా, చెప్పడానికి ఇష్టంలేని మనోవ్యధగా, చెప్పేసాడు.

“అవునులే, ఇలా రేంక్ తగ్గితేనే నీకు బుద్ధి వస్తుంది! ఎంత సేపూ ఒళ్ళు వంచకుండా ఇంట్లో చెస్, కేరం  అని ఆడుతూంటే శరీరంకీ, మెదడుకీ హాని రావడంలో ఆశ్చర్యమేముంది! అలాగే నీ చదువూ పాడైంది!” అని వాళ్ల నాన్నగారు అరిచారు.

‘ఏదో నెపం కావాలని నాన్నగారు కాచుకోనివున్నారు; సరేలే, ఇవాళ చెస్, కేరం  అతనిదగ్గర చిక్కుకున్నాయి!’ అని మణి సణుగ్గున్నాడు. అదేం లెక్కచెయ్యక నాన్నగారు తిన్నగా వంటగదికి వెళ్ళారు. “లక్ష్మీ, విను. నేనవాళ అనలేదూ, కొంతమందికి కిరికెట్టు, టెన్నిస్, అంటే ఎంత మోజు అని? ‘ఎంతసేపూ వాటిగురించే తర్కించుకుంటూవుంటారు, చదవడం పూర్తిగా మానేస్తారు!’  అని వార్తాపత్రికలో ఎవరో రాసారని చెప్పాను. కాని మన అబ్బాయి  కిరికెట్టు, టెన్నిస్, అనే ధ్యానం లేకుండానే తన చదువు పాడు చేసుకున్నాడు! చూసావా ఈ చోద్యం?” అని మణిని ఎగతాళి చేసారు.

ఇక మణి భరించలేకపోయాడు.

“రోజూ సాయంకాలం ఇంటికి వస్తే ఇగే గొడవ!” అని చిరచిరలాడాడు.

అదీ నిజమని ఒప్పుకోవలసిందే.

ఇటీవల మణికి అటల్లోవున్న వ్యామోహం గురించే అతని నాన్నగారు సుందరమయ్యర్ విమర్శించేవారు. స్కూలునుంచి రాగానే మణి రేడియో మీటని నొక్కేసి, దాని పక్కనే కూర్చొని, అమ్మ ఇచ్చిన కోకో కొంచెం కొంచెం తాగుతూ, ఏదో భక్షణం నమలుతాడు. ఆ తరువాత పొరుగింటి స్నేహితుడు చెస్ లేక కేరం బోర్డు తీసుకొనివస్తాడు. రేడియోలోని కార్యక్రమాలు వింటూనే నేలమీద వీళ్ళ ఇద్దరి ఆట సాగుతుంది; బాగా చీకటి కప్పుకున్నతరువాతే ఆట ఆపుతారు.

ఇది చూసి నాన్నగారికి పట్టరాని కోపం వచ్చింది.

"అసలు physical exercise అనేదే లేకపోతే ఎలాగ? ఈ వయసులో బంతి వెనుక పరుగెత్తడం, గెంతులేయడం - ఇవన్నీ చెయ్యకుండా - ఎవరైనా సాయంకాలమంతా ఒకే చోట కదలకుండా కూర్చుంటారా? యౌవనం పాడవడానికి ఇదే దారి!" అని తరచుగా అతను బొబ్బలుపెట్టేవారు.

నాలుగుకాళ్ళబల్లమీద రెండు తలగడలు ఎత్తుగా సవరించుకొని, వాటిమీద ఆనుకొని మణి ఏదో చదువుతుంటాడు. "సరేలే, నీ శరీరంని ఎన్ని విధాలా పాడుచెయ్యాలో అవన్నీ చెయ్!" అని అంటూనే వాడిని దాటి నాన్నగారు వెళ్తారు. అతని తల మాయమవగానే మణి, అతని 'ఆజ్ఞ పాటించినట్టు' లేచి కూర్చుంటాడు. కాని అతను మళ్ళీ ఆ దారిలో వచ్చినప్పుడు అతని నిందారోపణకి అర్హుడులాగ మళ్ళీ ఆ బల్లమీద పడుకొనివుంటాడు.

ఇన్నిరోజులూ మణి నాన్నగారి మాటలు సహించుతూవచ్చాడు. కాని ఇవాళ జరిగిన సంఘటన తరువాత వాడి మనసులో ఒక మార్పు, ఇంకొక మార్పుకి దారితీసింది. వాడి శరీర పరిశ్రమ, మనో ఆరోగ్యం గురించి ఇంతవరకు విమర్శించిన నాన్నగారు ఇప్పుడు వాడి చదువునికూడా ఆక్షేపిస్తున్నారు. ఆ దాడి న్యాయమైనా వాడికి అదొక పెద్ద అవమానంగా కనిపించింది.

"అబ్బబ్బా, ఇదేం రోత!" అని విసుగ్గుంటూ మణి రేడియో వినాలని మీట నొక్కాడు. ఏదో లోపం కాబోలు, రేడియో పని చెయ్యలేదు. కొంచెసేపు వాడికీ, రేడియోకీ, పోరాటం; ఆఖరికి రేడియోపే గెలిచింది.

'ఇదీ నాన్నగారి పనే!'

వాళ్ళ అమ్మ పకోడా, కోకోతో వస్తుందని తెలిసే మణి అలా గొణుక్కున్నాడు.

“ఒరేయ్, ముందు ఈ పకోడా తిను, ఆ తరువాత మేడమీదకి వెళ్ళు!” అని తల్లి చెప్పింది. ఆవిడ ఎదుట కోకో రెండు గుక్కెడుగులు మింగేసి, పకోడా వద్దనేసి, మణి మేడమెట్లు ఎక్కాడు.

దానితో వాడికి అప్పుడు మనసులో తృప్తి! కొన్నిరోజులముందు ఇలాగే నాన్నగారు వాడిమీద నేరం మోపారు; తనూ ఇప్పుడు అతనిమీద ఒక ఆరోపణ తోసి పారేసాడు!

అవును, నాన్నగారు అన్యాయంగా వాడిని నిందించుతున్నారు; తనూ ఏమీచెయ్యకుండా ఊరుకోవాలా?

ఈ వయసులో మణి చేసే అల్లరి చేష్టలకి కారణముంది; పిల్లలమీద తన అధికారం చెలాయించాలని మొదలుబెట్టాడు. ముఖ్యంగా తమ్ముడు నరసుని తిప్పలుపెట్టడం వాడికి అలవాడైపోయింది. ఆ పిల్లవాడూ నిత్యమూ ఏదో అల్లరి చేస్తూవుంటాడు, అన్నయ్య తిట్లకి అర్హుడవుతుంటాడు. నరసుని మణి ‘నచ్చు’[1] అని పిలవడం సహజమైపోయింది. నరసుకూడా విసుగ్గోకుండా “నేనుకూడా ఇక నిన్ను ‘మణి’ అని పిలవను, ‘మన్ను’ అనే పిలుస్తాను!” అని అరుస్తాడు; మణి కోపంతో తమ్ముణ్ణి మొత్తుతాడు, నరసు మరేం గతిలేక వాడి దౌర్జన్యం అనుభవిస్తాడు. పిల్లలు లొంగేది ప్రేమకి, అన్యాయంకి కాదు. కాని అది - అకటవికటమైన వయసులో - మల్లాడుతున్న మన మణికి బోధపడితే మరేం కావాలి?

ఇలాంటి పరిస్థితిలో పెరంబూరునుంచి సైకిళులో మద్రాసు బీచుకి వెళ్ళిరావాలని మణి, వాడి స్నేహితుడు నిర్ణయించారు. తమకుతామే ఒంటరిగా వెళ్ళకుండా తలకి తోడుగా ఒక పిల్లవాడిని సైకిళులో తీసుకొని వెళ్ళిరావడం మంచిది, గొప్ప అని ఆ స్నేహితుడు వాదించాడు. అతనికుండేది ఒకడే తమ్ముడు, ప్రియమైన తమ్ముడు. అతని కోరిక విని మణి సరేనన్నాడు; నరసు తనతో బీచుకి వస్తాడని అమ్మకి చెప్పాడు. చెల్లెలికి పదకొండు నిండాయి; ఆఖరి తమ్ముడికి ఐదేళ్ళు; అందువలన నరసుపే తన ఎంపిక అని కొంచెం తడబడుతూనే వివరించాడు. అమ్మ నాన్నగారికి చెప్పింది - అతని అనుమతి కావాలనే ధోరణిలో.

---

1 తమిళంలో ‘నచ్చు’ అంటే విషం అనే అర్థముంది

అతనప్పుడు ఏ మానసికావస్థలో ఉన్నారో - లేకపోతే అంత క్రూరంగా అతనెందుకు ఆక్షేపించాలి? "వీడు తమ్ముడు మెడని పట్టుకొని ఏ సముద్రంలో ముంచుతాడో ఎవరికి తెలుసు?" అని అతను అన్నారు! మణి నరసుని తరచుగా హింసపెట్టడం చూసి ఆ తల్లిదండ్రులు వాడిని ఖండించడం మామూలుగా జరిగేదే. కాని అవాళ అతనలా అనగానే ఆవిడ "మీరెందుకు అలా అంటున్నారు? పాపం, మణి!" అని కొడుకు మనసెలా బాధపడిందో అని బెంగతో వాడిని చూసింది. శుష్కించిన  మొహంలో కన్నీళ్ళు రాకముందే మణి గబగబమని లోపలికి వెళ్ళిపోయాడు. ఆఖరికి మణి, స్నేహితుడు మాత్రం సైకిళులో బీచుకి వెళ్ళివచ్చారు. 'ఆరోజు నాన్నగారు అన్యాయంగా నా మీద మోపిన నేరంకి ఇదే నా జవాబు!' అని గర్వపడుతూ మణి మేడమీద డాబాలో అడుగులు తీసాడు.

వాడ్ని వెతుక్కుంటూ అమ్మ డాబాకే వచ్చేసింది. "ఒరేయ్, ఇది నీకు నచ్చిన ఉల్లిపాయల పకోడీ!" అని ఒక పళ్ళెం చెయికి అందించింది.

"సరేలే!" అన్నాడు మణి. తల్లి పళ్లెం పెట్టేసి మెట్లు దిగి వెళ్ళినతరువాత ఆ పకోడీలు రుచిచూసాడు. తృప్తితో తినడం ఆరంభించాడు.

'సరే, రేడియో వినలేకపోతే, చెస్ ఆడదాం!' అని ఏవేవో ఆలోచనల్లో పడ్డాడు.

"ఇక వాడేమో సాయంకాలం Badminton ఆడాలంటున్నావా? చూసావా, వాడి వీపు ఎలా వంకరటింకరగా ఐపోయిందో? వాడికి గూనితనం వచ్చేసింది; చదువూ పాడైంది. ఇక సాయంకాలమంతా ఇంట్లో కూర్చొని చెస్, కేరం ఆడకండి! . . . మీకే చెప్తున్నాను . . . "

నాన్నగారి హెచ్చరిక విని మణి అదిరిపడ్డాడు.

'అయ్యయ్యో, నాన్నగారు బాబుతో మాటాడుతున్నారా? పాపం, వాడు నా స్నేహితుడు!'

మణి పరుగెత్తుకొని మెట్లు దిగి కిందకి వచ్చాడు; చుట్టూ తిరిగిచూసాడు. బాబు కనిపించలేదు. నాన్నగారు ఏమీ ఎరుగనట్టు కనిపించారు.

'ఇదేం అన్యాయం! నిరుత్సాహం - ఒకటి తరువాత ఒకటి కప్పుకొని వచ్చింది! ఇంటికొచ్చిన స్నేహితుడ్ని నాన్నగారు వెళ్ళగొట్టారు! ఎంత అవమానం! ఇక ఈ ఇంటిలో ఒక నిమిషంకడా ఉండకూడదు!'

కోపంతో మణి మేడమీదకి తిరిగి వెళ్ళాడు.

డాబామీద నిలబడి, తలెత్తి చూసాడు: 'ఈ ఆకాశంలాగే నా బతుకూ శూన్యమేమో?' అని వాడికి అనుమానం కలిగింది. అక్కడనుంచి చూస్తే ఆ చుట్టుపక్కలకి అవతలవున్న ప్రాంతంలోని దృశ్యాలు, ఆ ప్రపంచం, ఎంత విశాలంగా కనిపిస్తున్నాయి! అక్కడ తనకి చోటులేదని ఎవరూ అనలేదే? వాడి మనసు కుదుటపడింది; ఒక నిర్ణయంకి వచ్చాడు. వెంటనే . . .

మణి కిందకి దిగివచ్చాడు; తన గదికి వెళ్ళాడు; ఒక సంచిలో నాలుగు నిజార్లు, నాలుగు షర్టులు, నింపాడు. గదినుండి బయటికి వచ్చాడు.

అమ్మ కనిపించింది; సహజంగా, నిమ్మళంగా, వసారాకి మణి దారితీసాడు.

కన్నతల్లి మనసుకి ఏమనిపించిందో? "మణి, ఎక్కడకి వెళ్తున్నావ్? సంచిలో ఏముంది?" అని అడిగింది.

"బాబూ ఇంటికి చెస్ సెట్ తీసుకొని వెళ్తున్నాను. అక్కడ ఆడతాను," అని జంభంగా బదులుచెప్పాడు మణి.

వీధిలో నడుస్తూంటే ఒక ఆలోచన తట్టింది: 'ఏమైనాసరే బస్ స్టాండులో నిలబడకూడదు!'

అంటే, వెంటనే ఊరు వదలి ప్రయాణం చెయ్యడం ఎలా సాధ్యం! రైలు ప్రయాణం! కాని ఆ సమయంలో మద్రాసుకి సూటిగా రైలు లేదు కనుక తను తిరువెళ్ళూర్కి వెళ్ళవచ్చు! ఇప్పుడే రైలెక్కి పారిపోవడం మంచిది. మద్రాసులో పరిచయం ఉన్నవాళ్ళు చాలామంది ఉన్నారు. ఒక్కక్కోరింట్లో ఒక రోజని తను పదిరోజులు సులభంగా గడపవచ్చు!'

ఇటువంటి ఆలోచనలతో మణి ఇంట్లోనుంచి బయలుదేరాడు. కాని మద్రాసుకి రైలు లేదని తెలియగానే మద్రాసు ప్రయాణం మానుకోడమే మంచిదని నిశ్చయించేసాడు.

విల్లివాక్కంలో జరిగే కాళీ మాత సంబరాలకి ఆ రోజు ఉదయం తన స్నేహితుడు, తన తల్లిదండ్రులతో వెళ్ళాడని మణికి ఆ మధ్యాహ్నం కబురు అందింది. తిరువెళ్ళూర్ బండి ఎక్కి మధ్య విల్లివాక్కంలో దిగాలని నిశ్చయించాడు. అక్కడ నాన్నగారి స్నేహితుడు ఒకతను ఉన్నారు. మణి ఇంతకుముందు

రెండుసార్లు అక్కడకి వెళ్ళివున్నాడు. అక్కడ రెండు మూడు రోజులు తను బస చెయ్యవచ్చు. తన్ను వెతకాలంటే నాన్నగారు మద్రాసుకే వెళ్తారు, విల్లివాక్కం గురించి అతను ఆలోచించరు! అతను మద్రాసులో వెనుగులాడుతుంటే తను సంబరాలు చూసి హాయిగా ఆనందించవచ్చు! అదే మణి ప్లాను.

అది సఫలమైంది కూడా!

** ** **

'చెస్ ఆటకి వెళ్ళినవాడు తిరిగి రానేలేదే?' అని బాబుని సుందరమయ్యర్ అడిగితే వాడు అసలు అక్కడకి రానేలేదని తెలిసింది. ఏమైందని తెలియక అందరూ కంగారుపడ్డారు. పిల్లవాడు కనిపించక తల్లి వాపోయింది. అప్పుడే పరిస్థితి ఎంత తీవ్రంగా మారిందని మణి తండ్రి గ్రహించారు; మద్రాసుకి పరుగెత్తారు. ఒక్కొక్క స్నేహితుడిని కలుసుకొని "మా మణి మీ ఇంటికి వచ్చాడా?" అని అడిగి తెలుసుకున్నారు.

విల్లివాక్కంలో రామయ్యర్ ఇంటిలో మణి చెప్పినది పూర్తిగా నమ్మారు: కాళీ మాత సంబరాలకి వాడు వచ్చాడని వాళ్ళకి చాలా సంతోషం! 'నీ తల్లిదండ్రులు కూడా వచ్చివుంటే ఎంత బాగున్ను!" అని అన్నారు.

ఆ మరుదినం సుందరమయ్యర్ బాగా పనిలోవున్నారు. రామయ్యర్ ఇంటిలో వేరే విధమైన సందడి. సంబరాల్లో భక్తులు పాల్గొనే జ్వాలాతోరణం[2] ఆగమం చూడడానికి రామయ్యర్ ఇంటి డాబా ఒక మంచి స్థానం. వాడుకగా జనులు అక్కడ జమా అవుతుంటారు. ఆ రాత్రి జరుగబోయే వైభవంకి వచ్చే పోయేవారికి అన్ని వసతులూ చెయ్యడంలో రామయ్యర్ కుటుంబ సభ్యులు చురుకుగా, ఉత్సాహంగా కనిపించారు. మణికికూడా ఆ కోలాహలంలో రామయ్యర్ కొడుకు గోపీతో స్నేహం కలిగింది; ఇంటిలో తనగురించి ఆయాసపడుతుంటారనే తృప్తికూడా కలిగింది; సమయం వడిగా గడిచింది.

తనకి స్కూల్లో రెండురోజులు సెలవని, ఆ రెండురోజులూ తను వాళ్ళ ఇంటిలోనే గడపాలని తన ఉద్దేశమని మణి గోపీకి తెలియజేసాడు. వాడూ తన తల్లిదండ్రులకి

[2] అందులో పాదరక్షలు లేకుండా భక్తులు అగ్నిగుండం తొక్కుతారు

చెప్పాడు; దానిగురించి పెద్దలు ఏమీ ఆలోచించలేదంటే అందులో ఆశ్చర్యం లేదు. “సరేలే, మనతో ఉండనీ!” అని అన్నారు.

ఆ మరుదినం, పొద్దున్న తొమ్మిది గంటలయివుంటుంది. గోపీ చెల్లెలు, ఆరేళ్ళ బాల, మణి మనసుని రేకెత్తించింది.

“చూసావా, ఇది నా ఫోటో, మద్రాసులో తీసినది!” అని ఒక ఫోటో తెచ్చి చూపించింది.

“మీ ఇంటిలో చాలా ఫోటోలున్నాయా? తీసుకురండి, చూద్దాం!” అని మణి గోపీని, వాడి చెల్లెల్ని అడిగాడు. వాడికి ఫోటోలంటే చాలా సరదా; సమయం గడపడానికి అదొక మంచి వేడుక కదా?

గోపీ ఏవో ఐదారు ఫోటోలు ఎంచి తీసుకొనివచ్చి స్నానంకి వెళ్ళిపోయాడు; వాడికే సిగ్గేసిందేమో - ఐదారు ఫోటోలే ఉన్నాయని?

అప్పుడే, గభీమని, గోపీ తన ఇల్లూ, అక్కడ కూడబెట్టిన ఫోటోలు గుర్తు చేసుకున్నాడు:

‘ఆహ్, మనింట్లో ఎన్ని ఫోటోలు! నాన్నగారు అందరి ఫోటోలూ తీసివున్నారు! అవన్నీ గోడల్లో వేలాడానికి వీలుకాదని పోగుచేసి అలాగే పెట్టెలోనే ఉన్నాయి!’

పిల్లల్లో మణియే అందరికంటే పెద్ద! వాడికది గొప్పగా ఉంది! వాడికని ఒక ఫోటో ఆల్బంకూడా ఉంది!

“మన పిల్లలు భవిష్యత్తులో తమ బాల్యం గురించి గుర్తు చేసుకోవాలి, సంతోషించాలి! అది చాలా ముఖ్యం! పిల్లలని ఫోటో తీయడానికి మనం ఎప్పుడూ వెనుకాడకూడదు!” అని అతని నాన్నగారు తరచుగా అనేవారు.

‘ఆల్బం’, ‘నాన్నగారు’ అనే జ్ఞాపకాలతోబాటు ఇంకొకటీ మణికి గుర్తుకి వచ్చింది. ఒక్కొక్క సంతతికి నాన్నగారు ఒక డైరీ రాసి ఉన్నారు! బిడ్డ పుట్టినరోజునుంచి దైనిక ఘటనలు, మనోభావాలు, అందులో అతను గురుతు చేసారు. ఎంత శ్రద్ధతో నాన్నగారు అవన్నీ చేసారు! కొన్ని తేదీల తరువాత ‘ఇవాళ బోర్లించాడు’, ‘ఇవాళ నవ్వాడు’, ‘ఇవాళ జలుబు పట్టేసింది!’ అనే వివరాలు కనిపిస్తాయి; అలాగ రాయని రోజుల్లో “నువ్వు నవ్వుతూ జీవించాలి!”, “వర్ధిలిలు గాక!” అనే దీవెనలు కనిపిస్తాయి.

కళాకారుడుకి కల్పనాశక్తి అని వస్తే విసుగు పుట్టదు; అలాగే మణి మనసు ఇప్పుడు ఒక నిలకడకి వచ్చింది.

తనగురించి డైరీలో ఒక ఘటన మణి మళ్ళీంచుకున్నాడు:

“ఇవాళ తల్లీ, పిల్లవాడూ పాచికలు ఆడారు. లక్ష్మి 101 పాయింట్లతో జయించింది. మణికి 32 పాయింట్లు. నేను మణిని తమాషాగా ‘మణి, ఎది పెద్ద - 101 లేక 32?’ అని అడిగాను. వాడు మొహం ముడుచుకోలేదు. ఒక సుద్ద తీసుకొనివచ్చి, నేలమీద పెద్ద అక్షరాలతో 32 రాసాడు. చిన్న అక్షరాలతో 101 రాసాడు. ‘నాన్నగారూ, ఇందులో ఎది పెద్ద?’ అని నన్ను అడిగాడు! నాకు ఒకటే ఆశ్చర్యం!”

“ఓటమిని ఇలాగేకదా మనం నవ్వుతూ ఒప్పుకోవాలి? జీవితంలో మంచీ, చెడూ - రెండిటిని - ఇదే మనోభావంతో వాడు ఏలుకోవాలని నా అభిలాష!” అని అతను రాసారు.

ఈ ఘటన మణి ఎనిమిదవయేట జరిగింది. వాడది మరిచిపోయాడు. సుమారు ఆరు మాసాలముందు ఆ డైరీ పేజీలు తిరగేసినప్పుడు, అది గమనించగానే, “నేనా అలా చెప్పాను?” అని వాడికే ఆశ్చర్యం కలిగింది. ఇన్నిరోజులవరకూ అది మళ్ళీ మరిచిపోయాడు. కాని ఇప్పుడు గుర్తుకి వచ్చేసింది!

తను ఎవరికీ చెప్పకుండా ఇల్లు వదలిరావడం, ఆ రోజుల్లో నాన్నగారికి తనమీదున్న భావనలు గుర్తుకి రాగానే వాడికి ఎలాగో అనిపించింది:

‘భక్తులు ఏ విధమైన పాదరక్ష ధరించకుండా వట్టి కాళ్ళతో ఫెళఫెళమంటూ కణకణమండే ఎఱ్ఱని నిప్పు మధ్య నడుస్తున్నారంటే దానికి కారణం వాళ్ళ మనసేకదా? ఒక ఆసక్తి, పట్టుదల అని వస్తే మనసుకి అగ్నికూడా పువ్వులాగ కనిపిస్తుంది! ఈ ప్రపంచంలోని కష్టాలని సుఖాలుగా భావిస్తే, జీవితమంతా సుఖంగానే ఉంటుంది! అదే జ్వాలాతోరణం వైభవంనుంచి మనం గ్రహించవలసిన సత్యం!’

ఇలాగ ఆ ముందురోజు రామయ్యర్ పిల్లలకి చెప్పడం మణికూడా విన్నాడు. కాని అప్పుడు దానిగురించి ఆలోచించనివాడు ఇప్పుడు అందులో

నిమగ్నుడైపోయాడు. ఆరాటంతోబాటు ఈ భావనా వాడిని తరుముకుంటూ వచ్చింది!

ముత్యాలహారంలాగ వాడి మనసులో భావనలు వరుస వరుసగా చోటుచేసుకున్నాయి. ఆఖరికి ఒక భావన - అది కంఠహారంలో వేలాడే బిళ్ళలాగ వాడి హృదయాన్ని హత్తుకుంది. ఆ కౌగిలులో, తన మనసులోని అహంకారం కరుగుతున్నట్టు అనిపించింది.

'అయ్యో, నాన్నగారు నాగురించి ఎటువంటి కలలు కంటున్నారు! నా ధోరణి దానికి ఎంత విరుద్ధంగా ఉంది!

అసలు తనేదో భరించలేనట్టు ఆ ఇంటిలో ఏం జరిగింది? అవును, తీవ్రంగా ఏమీ జరగలేదు! తనలా కల్పించుకోడమే తను చేసిన పెద్ద పొరబాటు!

అక్కడ అమ్మా, నాన్నా ఎలా బాధపడుతున్నారో? తన్ను శిక్షించడానికి వాళ్ళకి అధికారం లేదా? తను తమ్ముడిని ఎలా ఇష్టం వచ్చినట్టు గదమాయించలేదు! అమ్మా, నాన్నా తన మంచికోసం చెప్తున్నారు, అది తప్పా?

అది తప్పని కోపించుకొని తను ఇంటినుంచి పారిపోవడమే పెద్ద పొరబాటు!'

మణి మనసు కుదుటబడింది. ఇంటికి తిరిగి వెళ్ళడమే సరైన పని అని గ్రహించాడు; కాని అది నెరవేర్చడానికి తగిన బలం వాడికి లేదు.

ఆ రాత్రి భోజనం అయింది. గోపీతో ఆడుతూ, మాటాడుతూ మణి కాలం గడిపాడు. 'సరే, ఇలాగే ఇంకా రెండు రోజులు గడిపేసి ఊరుకి వెల్దాం!' అని కూడా ఆలోచించాడు.

కాని వాడి మనసు చెల్లాచెదరినట్టు ఒక ఘటన కాచుకొనివుంది.

సాయంకాలం నాలుగైదు గంటలైవుంటుంది. రామయ్యర్ భార్య ఇంట్లో ఇలాగా అలాగా అడుగులు వేస్తూవున్నారు. రెండుమూడు సార్లు ఆవిడ గోపీని పిలిచారు. వాడేదే పిచ్చాపాటీలో ఉన్నాడు; తల్లిమాటలు వినిపించుకొనేలేదు.

ఆఖరికి ఆవిడే వచ్చి సూటిగా వాడిని అడిగారు. "ఏంరా గోపీ, నిన్ను ఎన్నిసార్లు పిలవాలి? టైమైంది. నువ్వు వెళ్ళి నీ చెల్లెల్ని పిలుచుకొని రా!" అని అన్నారు.

"అవునులే, నేను వెళ్ళి రాణీగారిని పిలుచుకొని రావాలట! నేను వెళ్ళను! దానికేం దారి తెలియదా?" అన్నాడు గోపీ. మణి ఎదుట తనేదో మించినట్టు కనిపించాలని పనితొందరగా ఏదో పుస్తకం తిరగేసాడు.

"దానికి దారితెలియదని ఎవరన్నారు? టైమైందని నాకు బెంగగా ఉంది. వచ్చే మార్గంలో ఒక చెరువుంది. అమ్మాయి క్షేమంగా వచ్చచేరాలని నా బాధ. నిన్న అమ్మవారి సంబరాలని జనులు గుంపులుగుంపులుగా జమా అవుతున్నారు. దాని చెయిలోని గాజులుకూడా తీయకుండా నేను పంపించేసాను! ఇప్పుడే అన్నీ గుర్తుకి వస్తున్నాయి. అందుకే చెప్తున్నాను. వెళ్ళివస్తావా? మణికీ నీ స్కూలు చూపించినట్టవుతుంది. సరేనా?" అని ఆవిడ అబ్బాయిని ప్రోత్సాహించారు.

"నేనిప్పుడు కదలడం జరగదు. సాయంకాలం మణికి స్కూలు చూపిస్తాను!" అన్నాడు గోపి.

"సరేలే, నీ ఇష్టం!"

మణికి గోపి ధోరణి నచ్చలేదు. "గోపీ, మనం వెళ్దాం," అని అన్నాడు.

"ఇంకా టైముంది. అమ్మకి ఉత్తికే భయం. ఈ తంగం ఈ సంవత్సరం స్కూలుకి వెళ్ళడం ఆరంభించినరోజునుంచీ అమ్మకి తరచుగా ఇదే భయం! ఒక పదినిమిషాలు ఆగు! తంగం రాలేదంటే మనం వెళ్దాం!" అన్నాడు గోపి.

కొంచెం సేపైంది. మణి మళ్ళీ తొందరబెట్టాడు, గోపీ బయలుదేరాడు. కొంతదూరం నడవగానే పాములాట చూస్తున్న ఒక గుంపులో వాళ్ళకి తంగం కనిపించింది.

"రావే, ఇంటికి!" అని దాన్ని బెదిరించి, దానితో వెళ్ళి, గోపి అమ్మకి అప్పగించాడు.

మణి మనసు ఇప్పుడు స్థిరపడింది: 'ఈ ఘటనతరువాత ఇంటికి వెళ్లడమే నేను చెయ్యవలసిన పని!' అని నిశ్చయించాడు;దానితోబాటు ఆతురతా పెరిగింది.

ఆఖరి రైలులో తిరుగు ప్రయాణం చేస్తే, తను వెళ్ళినప్పుడు అందరూ నిద్రపోతుంటారు. తలుపు తట్టుతే వచ్చి తెరుస్తారు. మరే మాటా గీటా అనకుండా తిన్నగా వెళ్లి పడకమీద దొర్లాలి! పొద్దున్న అన్నీ 'మామూలుగా', రోజూలాగ సాగుతాయి! అంతే, తనకేం మరే బాధా ఉండదు!

వాడి మనసులోని పోరాటం రామయ్యర్ ఇంట్లో ఎవరికీ తెలియదే! మణి వాళ్ళదగ్గర సెలవు తీసుకున్నప్పుడు 'మణి సంబరాలకి రెండురోజులు మనింటికి వచ్చాడు!' అనే వాళ్ళు చెప్పుకున్నారు. "'మీ అమ్మా, నాన్నా నీతో రాలేదని మాకు కోపం!' అని వాళ్ళకి చెప్పు!' అనే సందేశం కూడా మణితో వాళ్ళకి పంపించారు.

** ** **

అదిగో, వీధి మలుపు వచ్చేసింది! మణి గుండె దడదడమని కొట్టుకుంది. కొన్ని ఇళ్ళలో మిణుకు మిణుకుమని దీపాలు వెలుగుతున్నాయి. బహుశా చాలా ఇళ్ళలో అందరూ నిద్రపోతున్నారు.

ఎదుట వరసలో వస్తున్న మణి తన ఇంటిమీద కళ్ళు మళ్ళించి చూసాడు. 'మనింట్లో దీపమా? ఇదేదో వింతగా ఉందే? నిద్రపోయేముందు మనింటోలో దీపాలన్నీ అణచడం మామూలుగా? ఇంకా అందరూ మెలకువతోనే ఉన్నారా? ఒక వేళ అమ్మ నేను కనిపించలేదని ఇంకా ఏడుస్తోంది కాబోలు! అందుకే . . . '

విస్తుబోతూ మణి ఒక నిమిషం ఆగాడు.

పరుగెత్తుకొని ఇంట్లోకి దూరాలని ఆవేశం కలిగినా వాడి కాళ్ళు కదల్లేదు. తనెలా ఇప్పుడు వెళ్ళి వాళ్ళముందు నిలబడడం? కాని ఆఖరికి ప్రేమానురాగాలే జయించాయి.

'ఆ రోజు గోపీ తల్లి తంగం గురించి బెంగబెట్టుకోలేదూ? తన తల్లీ అలాగే కలవరపడుతూ ఉంటుంది. తను వెంటనే వెళ్ళి అమ్మని ఓదార్చాలి . . . '

మణి ఇంట్లోకి నడిచాడు.

"అయ్యో . . . అమ్మా . . . మణి ఇంకా రాలేదే?"

'అవును, అది అమ్మ కంఠధ్వని!' మణి వసారాలోనే నిలబడిపోయాడు.

"అన్నయ్యని తరిమేసి ఇది ఎందుకు పుట్టింది? దీన్ని చూడడానికి నాకు రోతగా ఉందే! . . . దేవుడా . . . "

'ఏంటీ?'

'పాప పుట్టిందా? అవును, నా పొరబాటువలన పాపని నిందిస్తున్నారు! పాపం!"

గభీమని మణి లోపలికి వెళ్ళాడు.

ఒక చూపులో వాడి దృష్టి అందరిమీదా పడింది.

నాన్నగారు కుర్చీలో ఒక చెయిలో పంచాంగం, ఇంకొక చెయి వొంగిన తలని ఆనుకుంటూ కనిపించారు. చూస్తే జాలి కనిపించే వాలకం.

అమ్మమ్మ ఒక గదిలోనుంచి చెయిలో ఒక పెద్ద పాత్రతో వస్తోంది.

ఎడంపక్కనుంచి ఒక చిన్న ధ్వని; మంత్రసాని షణ్ముగం అమ్మమ్మకి చెప్తోంది:

"అమ్మా, మీ అబ్బాయిలాగుందే?"

"ఎవరు, మణియా?" ఇది నాన్నగారి ప్రశ్న!

"అవునా, మన మణియేనా? నువ్వెప్పుడురా రావడం?" అమ్మమ్మ అడిగింది. ఆవిడకి కళ్ళు బాగా కనిపించవు.

"నిజంగానా? అంతా దేవుడి దయ . . . నా మనసు . . . " ఇది ఇంటి యజమాని లక్ష్మి అమ్మాళ్ ప్రార్థన. ఆవిడ దేహమూ, మనసూ బాగా దెబ్బతిన్నాయి, మరెలా ఆవిడ తన సంతోషం తెలియపరచగలరు?

ఈ ఘోషాలమధ్య మణి మెట్లెక్కి మేడమీదకి వెళ్ళిపోయాడు.

"అమ్మా, నేను చెప్పలేదూ, 'అబ్బాయి తిరిగివస్తాడు, ఎక్కడికీ పారిపోడు!' అని? నీకు ఒకటే బెంగ! చూడు, ఆఖరికి రక్తసంబంధం ఏంచేసిందో! ఈ చంటి పిల్ల అన్నయ్యని లాగ్గొని వచ్చేసింది!" అని షణ్ముగం తల్లికి చెప్పడం మణి విన్నాడు.

'ఓ, అలాగా? ఈ పాప నన్ను ఇంటికి రమ్మని పిలిచిందన్నమాట!' అని మణి తనలో అనుకున్నాడు. కాని, వెంటనే తన తల్లిదండ్రులని ముఖాముఖిగా ఎలా చూడడం అనే బెంగ పట్టుకుంది.

పాపం మణి!

"'నేనేం మీకోసం ఇంటికి తిరిగిరాలేదు. పాపకోసం వచ్చాను!' అని పొద్దున్నే మొండిగా చెప్పేయాలి!" అని మణి తనలో చెప్పుకున్నాడు.

********

**(మూలం ప్రచురణ: స్వదేశమిత్రన్, అక్టోబర్ 3, 1948)**

# ఆదర్శ ఇల్లాలు

అబ్బబ్బా, శుభ్రత అంటే ఇదే కాబోలు! ఇల్లంటే నాణ్యం, నాజూకు తప్పకుండా కావాలా? అవును, కాని అమితంగా చేస్తే ఎద్దైనా పీకులాటేకదా?

ఇక నేను భరించలేను. నా భార్య నా ప్రాణం తీస్తోంది! దానికీ ప్రాణం పోయినట్టు ఉందట! "మాటిమాటికీ మీతో దెబ్బలాడి నేను అలసిపోతున్నాను!" అని వాపోతుంది. "మరెందుకు నువ్విలాగ బాధపడాలి?" అని అడుగతే "అందుకేగా 'ఇంటిలో ఒక ఆడది తప్పక ఉండాలి, అన్ని పనులూ సరిగ్గా జరగాలి,' అని పెద్దలు అన్నారు?' అని నాకు గుర్తు చేస్తోంది!

నిత్యమూ శుభ్రత అనే పాట మా ఆవిడ పాడుతోంది!

వసతి, సదుపాయం అనే మాటలకీ, ఈ శుభ్రతకీ ఏమైనా పొత్తు ఉందా? అదే నా ప్రశ్న! చాలామట్టుకూ శుభ్రత తికమకలుకి దారి తీస్తుందని నా వాదం!

ఒక అగ్గిపుల్ల పెట్టెకాని సబ్బు పెట్టెకాని ఆ ఆ స్థానంలో లేకపోతే, అంతే! "ప్రతీదానికీ ఒక స్థలముండాలి, ప్రతీదీ దాని దాని స్థలంలో ఉండాలి!" అని అంటూ వాటిని సరియైన చోటల్లో సర్దుతుంది. సబ్బుపెట్టె ఉండవలసిన చోటునుంచి ఒక అరగజం దూరంలో కనబడితే కొంప మునిగినట్టు ఎందుకు భయం? నేను తొందరగా బయటకి వెళ్తున్నప్పుడు ఏదైనా కాగితంని నలగగొట్టి, ఒక స్తంబంపక్కన జాఱవిడిచి, మెట్లు దిగి వెళ్తే, ఆ కాగితంని జాగ్రత్తగా తీసి, లోపలికి వెళ్ళి తొట్టిలో వేస్తుంది!

ఇవన్నీకూడా నేను లెక్కచెయ్యను, నేను చేసే చిన్న తప్పులని ఊరుకుంటాను; మా కాపురం ఆరంభించిన రోజుల్లో ఇటువంటి చేష్టలు నాకు చాలా నచ్చాయి అని ఒప్పుకుంటాను; దాని దృష్టి అంతా నామీదే అని గుర్తుచేసుకుంటే నాకు సంతోషమే! కాని ఆ చిన్న పెర్రి పెద్ద పెర్రిగా మారిపోయింది!

ఒక చెంబులో నీళ్లు తీసుకొని చేతులు, కాళ్ళు కడుక్కొని ఇవతలకి వచ్చివుంటాను. వెంటనే, ఇంటి వసారాలో చీపురుకట్టతో తుడుచుతున్న సద్దం వినిపిస్తుంది. వసారాలో రెండుమూడుచోట్ల సిమెంటు నేల కొంచెం అణగివుంటుంది.

వాటిలోని నిలువనీరుని మా ఆవిడ చీపురుతో తుడిచివుంటుంది. ఇది చూసి నేను నాలుగు రోజులువరక ఏమీ అనక ఊరుకున్నాను. ఆదీ అలాగే రోజూ చేస్తూవుంది; ఆఖరికి నాకే జాలి కలిగింది. “అదలాగే ఉండనీ! అర్ధగంటలో ఎండ రాగానే ఆ నీరు ఇగిరిపోతుందిగా?” అని అన్నాను. ఐదారుసార్లు అలాగే చెప్పాను. అది నా మాట వినుపించుకోలేదని ఒక రోజు కోపంతో “ఆ రవంత నీరు నీకేం చాలా బాధగా ఉందా?” అని అడిగేసాను.

“మీరుగాని కొంచెం అవతల నిలబడి వసారాకి దూరంగా ఒక్కొక్క కాలు కడుక్కుంటే ఏ బాధా ఉండదు!” అని మాత్రం అంది. ‘ఓ, అలాగా?’ అని నాకనిపించింది.

కాని అది అన్నట్టు కొత్త విధంగా కాళ్ళు కడుక్కునే అలవాటు నాకు రానేలేదు. కాళ్ళు కడుక్కోడం అంటే ఒక పాదం మీద ఇంకోక పాదం పెట్టి తోముకుంటేనే నాకు తృప్తి! నాకా అలవాటు పోనేలేదు; మా ఆవిడకి చీపురుతో వసారాలో ప్రవేశించే అలవాటూ పోలేదు!

నాకు కనిపించిన మార్పు ఇదే.

“‘అయ్యో. పాపం!’ అని నామీద జాలి కలిగితే మీకీ అలవాటు తప్పకుండా వచ్చివుంటుంది! అదీ మీకు చేతకాదే! నాది ఆడజన్మ! శుభ్రతగురించే నా ధ్యానమంతా! అదే నా బాధ్యత, నేను చూసుకుంటున్నాను!” అని రోజువారీ రెండుమూడుసార్లు నాకు చెప్తుంది. అంటే, ఆఖరికి, నాదే పొరబాటు!

తైలస్నానం చేసినప్పుడు మనం కూర్చొనే పీటని జిడ్డు పట్టేసిందని పదే పదే సీకాయతో తోముతుంది. “ఆ పీట మనం ప్రత్యేకంగా వాడుతున్నాం. కూర్చొని భోజనం చెయ్యడానికి వేరేవేరే పీటలున్నాయిగా? ఈ పీటని నాలుగు వారాలకి ఒకసారి సోడాతో కడుగుతే చాలదా? నువ్వెందుకు ఇలా పాటుపడాలి?” అని అడిగితే ఏ జవాబూ రాదు.

“తైలస్నానం చేసినప్పుడు ఆ నూనె చిందకుండా మీరు కొంచెం జాగ్రత్తగా ఉండాలి!” అని నాకు మా ఆవిడ గుర్తు చేస్తుంది. మెట్టుమెట్టుగా తలకి నూనె రాసుకొని స్నానం చెయ్యాలని బాల్యంనుంచే నాకు నా తాతగారు పాఠం నేర్పారు. ఆ ఆలవాటు నేనెలా మానుకోడం?

రోజూ నా గదికి వచ్చి, మా ఆవిడ నా మేజా శుభ్రం చెయ్యడానికి వస్తుంది. అందువలనే రోజూ ఒక ఉత్తరం, రసీదు, చీటీ గభీమని మాయమవడం జరుగుతుంది!

నాకు కావలసిన ఫైలు, కలం, పత్రం, డైరీ, ఉత్తరాలు నేను మేజామీద ఉంచుతాను.

"ఇవన్నీ మీరు చక్కగా అలమారీలో ఉంచుకుండే ఎంత బాగుంటుంది! అలమారీలో ఎంత జాగా ఉంది!" అని నాకు సలహా ఇస్తుంది.

కుర్చీ, మేజా ఎందుకు కొన్నాం? ఉత్తికే దర్శనంకనా? చెయికి అందవలసినవి మేజాలో పెట్టి కుర్చీలో పని చెయ్యాలనేకదా? మేజామీదున్న వస్తువులబట్టేకదా ఆ మేజాకి శోభ, గౌరవం?

అలాగడిగితే "సరే, కాని మేజా శుభ్రంగా ఉండాలిగా, ఆ table cloth అందరూ చూడాలిగా?" అని వెంటనే ఎదురు ప్రశ్న అడుగుతుంది!

కార్డులు, కవర్లు, స్టాంపులు - ఇవన్నీ నేను మేజామీద ఒక చిన్న అట్టపెట్టెలో ఉంచుకుంటాను.

"ఇదిగో, వీటిని ఇలా సర్దుకుంటే మీకు ఎంత వసతిగా ఉంటుంది! మనం కార్డులే ఎక్కువగా వాడుతాం, అవన్నీ మీద ఉండనీ! కవర్లు ఎక్కువగా వాడంకదా, అవి ఆ తరువాత ఉండనీ! స్టాంపులు వీటికి అడుగున ఉండనీ!" అని వాటిని మళ్ళీ సర్దుతుంది!

నాయనా, నా వసతికి కార్డో, కవరో, స్టాంపో - ఎది కావాలో అది దొరికినట్టు - నాకు నా పద్ధతి నచ్చింది. అదెందుకు మార్చాలి?

నేను మేజా దగ్గర కూర్చొని, ఉత్తరం రాసి, దాన్ని కవరులో పెట్టాలన్న ఆశకూడా లేనట్టు ఆ అట్టపెట్టె నా కళ్ళకి ఇక కనిపించదు!

మేజా సొరుగులో నేను కొన్ని పెట్టాను: కత్తెర, నూలు దండ, బొత్తాను, బంక ద్రవ్యం, ఇత్యాది వస్తువులు. అవన్నీ బొమ్మలకొలువులో ఉన్నట్టు కనిపించాలట! ఐతే ఆ సొరుగు మేజాకి పక్కవాటిగా ఎందుకు ఉందని? మనం లాగ్గానే ఒక విశాలమైన పళ్ళెంలాగ అందులోవున్నవి మన కళ్ళకి స్పష్టంగా కనిపించాలనేకదా?

శుభ్రతలో మా ఆవిడకున్న ఈ ఆవేశం - రోగం - నేనిక భరించలేకపోయాను.

"నువ్విలాగ హతం చేస్తే నీ ఆరోగ్యం దెబ్బతింటుంది!" అని బెదిరించాను.

“మీరు చదువుకున్నవాళ్ళు . . .  మీరే ఇలా మాటాడితే . . . .?”

“అవును, నిజం. కాని హద్దుమీరితే ఇలాగే చెప్పితీరాలి! ” అన్నాను.

“మరి మీ ఇంట్లో cleanliness, neatness అనే పదాలు వాడరుకాబోలు . . . ”

‘దీనికి ఈ neatness పిచ్చి విపరీతంగా వచ్చేసింది! What a nonsense!’ అని నేను నా మనసులో అనుకున్నాను.

మా ఆవిడని ఒప్పించాలని నేను బాగా ఆలోచించాను. నాకని ఇల్లు, ఇల్లాలు ఉన్నా అవేమీ లేనట్టు అనిపించింది. ఆఖరికి దానిమీద ప్రయోగించడానికి ఒక అహింసా ఆయుదం దొరికింది.

“ఇదిగో, విను. ఈ మేజా మన వసతికి ఉందా, లేక మనం ఈ మేజాకోసం ఉన్నామా? ఈ వసారా మనకోసమా లేక మనం ఈ వసారాకి సర్దుకొనిపోవాలా? ఈ ఇల్లు మనకోసమా లేక మనం ఈ ఇల్లుకోసమా?”

మా ఆవిడ కళ్ళు పెద్ద చేసుకొని నన్ను చూసింది.

అపార్థం చేసుకుంటుందోమో అని నాకు జాలి కలిగింది.

“నువ్వుండేది నా వసతికి. ‘నీ వసతికి నేను లేను,’ అని నేను అనడంలేదు, భయం వద్దు! మనిద్దరం మనకోసం ఉన్నాం. కాని ఈ సరుకుల విషయంలో అలాగ కాదు, అవి మనకోసం! వాటికోసం నువ్వు ఆయాసపడి అన్ని పనులూ చేస్తూంటే నాకోసం నువ్వు ఆరాటపడుతున్నావనిపిస్తోంది. నువ్వెప్పుడూ ఇంట్లోనే చాకిరీ చెయ్యాలా? నీకు నచ్చిన పనులు చాలా ఉన్నాయిగా - పాట, కుట్టుపని, చదువు . . . ఇలాగెన్నో . . . ”

“అవునండీ . . .  నిజం . . . ” ఆశ్చర్యంతో నన్ను బాగా చూసింది.

ఆ తరువాత ఆమెలో మార్పులు కనిపించాయి. తన కార్యకలాపాల్లో నిబ్బరంగా కనిపించింది.

కాని . . . కాని . . . నేను ఎదురుచూసినది వేఱు . . . ఇవాళ జరుగుతున్నది అవాళ నేను ఎదురుచూసానా?

ఇవాళ నేను అడిగేది ఒక కొత్తదైన ప్రశ్న !

“నా పంచె కనిపించదేం? నువ్వు నిన్న దాన్ని ఉతకలేదా?” అని అడిగాను.

"ఇప్పుడే ఉతుకుతాను. నిన్న మధ్యాహ్నం ఉతుకుదామనుకున్నాను . . . ఎండలో ఉతకబోతే ఏం నష్టం? పెట్టెలోవున్న పంచెలు తీసి నాలుగురోజులు కట్టుకోండి! రోజూ ఉతుకుతే బట్ట పాడవుతుంది! నాలుగు పంచెలు బయటకి తీసి రోజూ ఒకటని వాడితే ఆ తరువాత చాకలికి ఇవ్వవచ్చు! నిన్న కట్టుకున్న పంచెనే ఇవాళ వాడాలని నియమం ఉందా ఏమిటి? మనకోసం పంచెలా, లేకపోతే పంచెకోసం మనమా?"

దాని ప్రశ్నలన్నీ ఈ ధోరణిలో వస్తున్నాయి.

అది నన్ను ఎగతాళి చేస్తోందని అనవద్దు! ఈ వేళాకోళం చేసేది నా మనసే!


కొత్తకాపురంలో మా ఆవిడకి శుభ్రతలో విపరీతంగా ఆసక్తి వచ్చేసిందని, క్రమేణ ఆ నవీనత పోతే సహజంగా ఇల్లరికం సాగుతుందని నేను గ్రహించలేకపోయాను. దాని తోవ తప్పించి బాహ్యప్రపంచంతో పరిచయం ప్రేరేపించాను. ఇప్పుడు ఒక స్థానిక మహిళా సంఘంలో మా ఆవిడ అధ్యక్షురాలు!

'అంత ఉగ్రంగా అంటుకున్న సుభ్రత ఇలా గభీమని మాయమవుతుందా?" అని మీకు వింతగా ఉందా?

ఆ గుణం దానితో ఇముడ్చుకొని పోయింది. నేను ఎదడిగినా సరిగ్గా నాకు జవాబు చెప్తోంది!

********

**(మూలం ప్రచురణ: స్వదేశమిత్రన్, మే 14, 1950)**



(రచయిత్రి వింధియా భర్త Prof. V. సుబ్రహ్మణ్యంతో)